
www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★

సంపుటి 08, సంచిక: 142 | మంగళవారం | 22-04-2025 | ఖమ్మం   Published from: **Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar**  పేజీలు: 12+8 | వెల రూ. 5.00




## అద్భుత భవిష్యత్తుకు బాటలు



**హైదరాబాద్‌కు రండి... జపాన్ ఉత్పత్తులు తయారు చేయండి**

- జపాన్ వ్యాపారవేత్తలను ఆహ్వానించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- ఒసాకా ఎక్స్‌పోలో ప్రత్యేక ఆకర్షణగా తెలంగాణ పెవిలియన్

ప్రజాపక్షం / హైదరాబాద్

'తెలంగాణకు జపాన్‌కు మధ్య చక్కటి సంబంధాలున్నాయి. హైదరాబాద్‌కు రండి. జపాన్ కంపెనీలు ఉత్పత్తులు తయారు చేయండి. భారత మార్కెట్‌తో పాటు ప్రపంచంలోని వివిధ దేశాలకు ఎగుమతి చేసేందుకు తెలంగాణను గమ్యస్థానంగా ఎంచుకోండి. ఒసాకా బేలో సూర్యోదయం లాంటి కొత్త అధ్యాయం తెలంగాణలో ప్రారంభమవుతోంది. తెలంగాణతో పాటు ఒసాకా, ప్రపంచంతో కలిసికట్టుగా అద్భుతమైన భవిష్యత్తుకు బాటలు వేద్దాం'' అని జపాన్ కంపెనీలను ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి తెలంగాణకు ఆహ్వానించారు. తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి జపాన్ వేదికగా ప్రపంచానికి చాటి చెప్పారు. ఒసాకాలో జరిగిన 'వరల్డ్ ఎక్స్ పోలో' తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం భాగస్వామ్యమైంది. వివిధ రంగాలకు చెందిన వ్యాపార వేత్తలు, పారిశ్రామికవేత్తలతో విడివిడిగా సమావేశమైంది. వివిధ రంగాల్లో రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అపారమైన అవకాశాలను వారితో చర్చించింది. ఈ సందర్భంగా తరువాయి 2లో




## త్వరలోనే పెండింగ్ ధాన్యం బోనస్

- ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు నిర్మించి ఉంటే ఉమ్మడి నిజామాబాద్‌కు ఎంతో ఉపయోగముండేది
- రూ. లక్ష కోట్లు పెట్టి కాళేశ్వరం కట్టినా అదనంగా ఒక్క చుక్కా నీరు రాలేదని విమర్శ

**నిజామాబాద్ :** పెండింగ్‌లో ఉన్న ధాన్యం బోనస్ డబ్బులను త్వరలోనే విడుదల చేస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. నిజామాబాద్‌లో రైతు మహోత్సవం ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు నిర్మించి ఉంటే ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు ఎంతో ఉపయోగం ఉండేదన్నారు. గత ప్రభుత్వం సాగునీటిపై రూ.లక్ష కోట్లకు పైగా ఖర్చు చేసినా.. అదనంగా ఒక్క ఎకరానికీ నీరు ఇవ్వలేదని విమర్శించారు. నిజాంసాగర్, ఎస్సారెస్పీ ప్రాజెక్టులను నిర్మించింది కాంగ్రెస్ హయాంలోనేనని చెప్పారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు మరిన్ని చెక్ డ్యామ్‌లు మంజూరు చేస్తాం. రైతు పక్షపాతిగా ఈ ప్రభుత్వం సాగుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటోంది. రాష్ట్రాన్ని తాకట్టు పెట్టి రూ.లక్ష కోట్లు అప్పు తెచ్చి కాళేశ్వరం నిర్మించారు. బిఆర్‌ఎస్ తరువాయి 2లో




## భవన నిర్మాణ కార్మికుల పట్ల పాలకులు చిన్నచూపు

- ఫలితంగా అందరూ అసంఘటిత కార్మికులుగా మారారు
- యూనియన్ రాష్ట్ర మహాసభల బహిరంగ సభలో సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ

ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి

పాలకులు అనుసరిస్తున్న విధానాల ఫలితంగా నేడు అందరూ అసంఘటిత కార్మికులుగా మారిపోయారని, భవన నిర్మాణ కార్మికులను ప్రభుత్వం ఎంత బాగా చూసుకుంటే దేశం అంత వెలుగొందుతుందని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. సోమవారం రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో నిర్వహించిన తెలంగాణ తరువాయి 2లో

**• జోహార్లు**



ప్రపంచ గమనం మార్చిన మహాశయుడు
**వి.ఐ లెనిన్ జయంతి నేడు**
22-04-1870 – 21- 01-1924

### స్కూల్ పిల్లలకు నిషేధిత ఇ-సిగరెట్లు, వేపర్స్

- తెలంగాణలో, ఎపిలో రూ.కోటికిపైగా విక్రయాలు
- గుట్టురట్టు చేసిన టిజిఎఎన్‌బి
- రూ.25లక్షల సిగరెట్ల స్వాధీనం

03

### 'ఎసిబి వల'లో అవినీతి అధికారులు

- మణుగూరు, ఆర్మూర్, జనగామ జిల్లా చిల్పూరులో ఎసిబి మెరుపుదాడులు

### తులం బంగారం అక్షరాలా రూ.లక్ష!

05

### ఇస్రో ఖాతాలో మరో ఘనత..

- స్పేడెక్స్ రెండో డాకింగ్ ప్రక్రియ సక్సెస్..



### రూ.1 కోటి రివార్డున్న నక్సల్ హతం

- జార్ఖండ్‌లోని బొకారో జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ప్రయాగ్ మాంఝీ సహా ఎనిమిది మంది మృతి
- మృతుల్లో మరో ఇద్దరిపైనా రివార్డులు

**న్యూఢిల్లీ :** జార్ఖండ్‌లోని బొకారో జిల్లాలో మావోయిస్టులకు కోలుకోలేని దెబ్బ తగిలింది. లాల్ పానియా ప్రాంతంలోని లుగూ హిల్స్ వద్ద సోమవారం ఉదయం కోబ్రా దళాలతో జరిగిన ఎన్ కౌంటర్‌లో మావోయిస్టు కీలక నేత, సెంట్రల్ కమిటీ సభ్యుడు ప్రయాగ్ మాంఝీ అలియాస్ వివేక్ సహా 8 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఇప్పటికే వివేక్ పేరిట రూ.కోటి రివార్డ్‌ను ప్రకటించినట్లు తరువాయి 2లో

### పోప్ ఫ్రాన్సిస్ కన్నుమూత



- రానున్న ఆరు రోజుల్లో అంత్యక్రియలు
- ప్రపంచవ్యాప్తంగా సంతాపసందేశాలు

**వాటికన్‌సిటీ :** రోమన్ క్యాథలిక్ చర్చ్ ప్రధానాధిపతి, వాటికన్‌సిటీ సర్వసార్వభౌమాధికార రాజ్యాధిపతి పోప్ ఫ్రాన్సిస్ మరణించారు. ఆయన వయసు 88 సంవత్సరాలు. 12 సంవత్సరాలు ఆయన పోప్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఆయన మరణ వార్త తెలియగానే సెయింట్ పీటర్స్ స్క్వేర్ వీధుల్లో ప్రజలు పెద్దపెద్ద రాగాలు తీస్తూ ఏడ్చేదృశ్యాలు కనిపించాయి. కడసారిగా ఈస్టర్ సందర్భంగా ఆదివారం నాడు ఆయన ప్రజలను కలిసి సందేశం ఇచ్చారు. ఆయన హయాంలో అనేక కీలక సంస్కరణలు జరిగాయి. మానవతావాదానికి ఆయన పెద్దపీట వేశారు. రోమ్ కాలమానం ప్రకారం సోమవారం ఉదయం 7.35 గంటలకు (భారత కాలమానం ప్రకారం ఉదయం 11 గంటలు) బిషప్ తరువాయి 2లో








# ప్రపంచం
WORLD NEWS

## 148కి పెరిగిన కాంగో నదిలో మృతులసంఖ్య



**కిన్షాసా :** కాంగోనదిలో పడవ మునిగిపోయిన ఘటనలో మృతులసంఖ్య సోమవారంనాటికి 148కి పెరిగింది. మరో 100 మంది ప్రయాణికుల జాడ తెలియకపోవడంవల్ల ఇంకా మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ఈ ప్రమాదం నుండి ఇప్పటివరకూ 150 మంది సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు. డి.ఆర్.కాంగోలో గడచిన శుక్రవారంనాడు పడవలో మంటలు చెలరేగడంతో పడవ తలక్రిందులైంది. అప్పటికే పడవలో సామర్థ్యానికి మించిస్థాయిలో ప్రయాణికులు ఉన్నారు. ఇదే ప్రాంతంలో గడచినవారంలో కూడా ఇదేవిధంగా ఒక పడవ తలక్రిందులు కావడంతో 72 మంది ప్రయాణికులు మరణించారు.

## అమెరికా కాంగ్రెస్ సభ్యులు,
# అధికారులపై చైనా ఆంక్షలు



**వాషింగ్టన్ :** చైనా—అమెరికా మధ్య సుంకాల యుద్ధం పరాకాష్టకు చేరుకున్న తరుణంలో చైనా తీవ్రంగా స్పందిస్తోంది. కొంతమంది అమెరికా కాంగ్రెస్ సభ్యులు, అమెరికా అధికారులు, స్వచ్ఛంధ సంస్థల అధిపతులపై చైనా సోమవారం నాడు ఆంక్షలు విధించింది. హాంకాంగ్‌కు సంబంధించిన సమస్యపై అమెరికా హద్దుమీరి ప్రవర్తిస్తున్నందువల్ల ఈ చర్యలు చేపట్టినట్లు చైనా విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రకటించింది. గతనెలలో ఆరుగురు చైనా, హాంగ్‌కాంగ్ అధికారులపై అమెరికా ఆంక్షలు విధించినందుకు ప్రతీకార చర్యగా చైనా ఈ ప్రకటన చేసింది. అదేవిధంగా సుంకాల విషయంలో కూడా ఇప్పటివరకూ హెచ్చరికలతో సరిపెట్టిన చైనా ఆ దశను దాటి చిన్న చిన్న ఆచరణాత్మక చర్యలు తీసుకోవడం ప్రారంభించింది. చైనాపై 245 శాతం సుంకాలను అమెరికా విధిస్తే, అందుకు ప్రతీకారంగా చైనా కూడా అమెరికా నుండి వచ్చే దిగుమతులపై 125 శాతం సుంకాలను విధించింది. అమెరికా విధానాలకు వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్తంగా భావసారూప్యతగల అన్ని దేశాలను తనవెంట కూడగడతామని చైనా ప్రకటించింది.

**చైనా వాణిజ్య ప్రయోజనాలు దెబ్బతీస్తే ఆంక్షలు**
తమ వాణిజ్య ప్రయోజనాలను పణంగాపెట్టి అమెరికాతో సంప్రదింపుల ద్వారా ఒప్పందాలు చేసుకున్న దేశాలపై వాణిజ్య ఆంక్షలు విధిస్తామని చైనా ప్రకటించింది. అమెరికాతో వాణిజ్య ఒప్పందాలకు తలొగ్గదని, ఆ విషయంలో జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించింది. అలాంటి దేశాలపై ప్రతీకార సుంకాలు విధిస్తామని హెచ్చరించింది. తమతో దాదాపు 70 లేదా 80 దేశాలు చర్చలకు సిద్ధపడుతున్నాయని, టారిఫ్‌లు తగ్గించమని అడుగుతున్నాయని డోనాల్డ్ ట్రంప్ కొద్దిరోజులక్రితం ప్రకటించారు. ట్రంప్‌తో టారిఫ్ బేరసారాలు చేస్తూ, తమ దేశ వాణిజ్య ప్రయోజనాలు పణంగా పెడితే అలాంటి దేశాలను ఉపేక్షించేది లేదని ఈ పూర్వరంగంలో చైనా హెచ్చరించింది. ఈ విధమైన ఒప్పందాలను తమదేశం తీవ్రంగా వ్యతిరేకిస్తోందని చైనా వాణిజ్య మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి ఒక హెచ్చరిక చేశారు. చైనాతో వాణిజ్య సంబంధాలను పరిమితం చేసేందుకు, ఇతర దేశాలతో తమ వాణిజ్యాన్ని దెబ్బతీసేందుకు అమెరికా ప్రయత్నాలు చేస్తోందని ఇలాంటి చర్యలను తాము సమ్మతించబోమని చైనా ప్రతినిధి చెప్పారు. పొరుగుదేశాల వాణిజ్య ప్రయోజనాలు పణంగాపెడితే సహించబోమని పేర్కొన్నారు. టారిఫ్ సంప్రదింపులను ఒక ఒత్తిడి చేసే ఆయుధంగా దజనుపైగా దేశాలపై అమెరికా ప్రయోగిస్తోందని గతవారం వాల్‌స్ట్రీట్ జర్నల్ పేర్కొంది. అమెరికాతో ప్రధాన వాణిజ్య భాగస్వాములుగా ఉన్న దేశాలు చేసుకునే ఎలాంటి ద్వైపాక్షిక ఒప్పందాలైనా చైనా విదేశీ వాణిజ్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తాయని ప్రపంచ వాణిజ్య సంస్థ డేటా ఇప్పటికే పేర్కొంది.

# మీరంటే ఎంతో గౌరవం,మాతో కలిసి రండి

భారత్‌కు ఇజ్రాయెల్
అధ్యక్షుడు విజ్ఞప్తి



**జెరూసలెం :** ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకునేందుకు కలిసి పనిచేద్దామని ఇజ్రాయెల్ అధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్ భారత్‌కు విజ్ఞప్తి చేశారు. భౌగోళిక, వ్యూహాత్మక సమస్యలపై ప్రత్యేకించి భారత్—మధ్య, తూర్పు యూరప్ ఎకనామిక్ కారిడార్ (ఐఎంఇసి) ప్రాజెక్టుపై పనిచేసేందుకు కలిసి రావాలని భారత్‌కు సోమవారం నాడు ఐజాక్ హెర్జోగ్ విజ్ఞప్తి చేశారు. ''భారతదేశంపట్ల తమకు ఎంతో గొప్ప గౌరవం ఉంది, ఆ దేశ నాయకత్వంపై కూడా మాకెంతో గౌరవం ఉంది, ఇజ్రాయెల్ మీ దేశాన్ని ఎంతగానో ప్రేమిస్తోంది, మీ దేశంలో పర్యటన చేసేందుకు నేను ఎంతో ఆత్రుతతో ఎదురుచూస్తున్నాను, అదేవిధంగా భారతదేశ ప్రధానమంత్రి, రాష్ట్రపతికి ఇజ్రాయెల్‌లో ఆతిథ్యం ఇచ్చేందుకు కూడా ఎంతో కుతూహలంతో ఉన్నాం'' అని హెర్జోగ్ పేర్కొన్నారు. ఇజ్రాయెల్‌లో భారత్ కొత్తగా నియమించిన దౌత్యవేత్త జె.పి.సింగ్‌కు హెర్జోగ్ ఈ విషయం చెప్పారు. టెల్‌అవీవ్‌లో దౌత్యవేత్తగా నియమితులైన సింగ్ తన అర్హత పత్రాలను ఇజ్రాయెల్ అధ్యక్షుడికి సమర్పించి సమావేశమైన సందర్భంగా ఐజాక్ హెర్జోగ్ పైవిధంగా స్పందించారు. ''మీ పదవీకాలంలో ఎంతో గొప్ప విజయాలను మీ బృందం సాధించాలన మేం ఆకాంక్షిస్తున్నాం, మనం మరింత ఉన్నతస్థాయిల్లో సంబంధాలను వృద్ధిచేసుకోవాలి'' అంటూ సింగ్‌కు హెర్జోగ్ ఆహ్వానం పలికారు. సింగ్ ఆయనను అధ్యక్షుడి అధికార నివాసంలో కలిశారు. ''ఐఎంఇసి అనేది ప్రపంచ భవిష్యత్తు, కేవలం ఈ ప్రాంతానికి మాత్రమే కాదు, ఇజ్రాయెల్, భారత్‌లతోపాటు యూరప్, అమెరికా భౌగోళిక రాజకీయ సంబంధాలలో కూడా ఈ ఐఎంఇసి ప్రాజెక్టు మార్పులు తీసుకువస్తుంది, ప్రజలమధ్య విశ్వసనీయతను, సంబంధాలను వృద్ధిచేస్తుంది'' అని చెప్పారు. 2023లో న్యూఢిల్లీలో జీ—20 సదస్సు సందర్భంగా ఈ ఐఎంఇసి ప్రాజెక్టును ప్రకటించారు. భారత్ నుండి యూరప్ వరకూ, ఆసియా, మధ్యప్రాచ్యాలను అనుసంధానం చేస్తూ ఈ మౌలిక సదుపాయాలు విస్తరిస్తాయి.

# ఈ వారంలోనే రష్యా—ఉక్రేన్ శాంతి ఒప్పందం : ట్రంప్





**వాషింగ్టన్ :** రష్యా—ఉక్రేన్ మధ్య ఈ వారంలోనే యుద్ధానికి సంబంధించిన ఒక ఒప్పందం జరుగుతుందని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆశాభావం వ్యక్తం చేశారు. పుతిన్‌తో ట్రంప్ మధ్యవర్తిత్వం చేసిన తర్వాత ఉక్రేన్,రష్యామధ్య యుద్ధం మరింత తీవ్రతరమైంది. ఈస్టర్ సందర్భంగా పుతిన్ స్వచ్ఛంధంగా 24 గంటలు కాల్పుల విరమణ ప్రకటించినప్పటికీ ఈ ఒప్పందాన్ని ఉల్లంఘించారని ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ విమర్శించారు. ఉక్రేన్ దేశమే ఒప్పందాన్ని ఉల్లంఘించి దాడులు చేసిందని పుతిన్ విమర్శించారు. ఈ విధమైన విమర్శలు, ప్రతివిమర్శల మధ్య ట్రంప్ తాజా ప్రకటన చేశారు. ఆదివారం రాత్రితోనే పుతిన్ ప్రకటించిన కాల్పుల విరమణ గడువు పూర్తయిందని, ఈ గడువును పుతిన్ పొడిగించలేదని మాస్కో వర్గాలు ప్రకటించిన తర్వాత మళ్ళీ దాడులు, ప్రతిదాడులు కొనసాగాయి. ఈ వారంలోనే రెండు దేశాలమధ్య ఒప్పందం జరుగుతుందని, తద్వారా రెండు దేశాలు అమెరికాతో సంబంధాలు, ఒప్పందాలు చేసుకునే అవకాశాలుంటాయని తన సొంత ట్రూత్ సోషల్ మీడియా నెట్‌వర్క్‌లో ట్రంప్ ఒక పోస్టింగ్ పెట్టారు. ఇదిలా ఉండగా తమ దేశంలోని పలు ప్రాంతాలపై రష్యా డ్రోన్లతో దాడులు చేసిందని ఉక్రేన్ ప్రభుత్వం సోమవారం ఒక ప్రకటన చేసింది. పుతిన్ 30 గంటలపాటు యుద్ధాన్ని విరమిస్తున్నట్లు ఈస్టర్ సందర్భంగా ప్రకటించారు. ఈ గడువు ముగిసిన వెంటనే దాడులు మొదలయ్యాయని ఉక్రేన్ పేర్కొంది. ఐతే రష్యా ప్రభుత్వ వర్గాలు కూడా తాము తిరిగి దాడులు ప్రారంభించినట్లు ధృవీకరించాయి. కీవ్,ఖెర్సాన్, డ్నిప్రోపెట్రోవ్క్స్, ఛెర్కసీ, మైఖోలైవ్, జపోరిఝియా తదితర ప్రాంతాలలో సైన్యం అప్రమత్తంగా ఉండాలని ఉక్రేన్ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. 2022 ఫిబ్రవరి 24న ఉక్రేన్‌పై పూర్తిస్థాయి యుద్ధం ప్రారంభించిన రష్యా ప్రస్తుతం 20 శాతం ఉక్రేన్ ప్రాంతాలను తన అధీనంలోకి తెచ్చుకుంది.

# ఇజ్రాయెల్‌పై దాడికి 30 వేలమంది సిద్ధం?



**రియాద్ :** ఏడాదిన్నరకాలంగా గాజాను మృత్యులోయగా మార్చిన ఇజ్రాయెల్‌పై హమాస్ సంస్థ ప్రతీకారంతో రగిలిపోతోంది. పాలస్తినాలో యుద్ధం కారణంగా కకావికలమైన కుటుంబాలలలో 20 లక్షలమంది నిరాశ్రయులయ్యారు. దేశాలు పట్టిపోయారు. రోజువారీ ప్రాతిపదికపై దాడుల్లో మరణిస్తున్నారు. ఐతే హమాస్ మాత్రం 30 వేలమంది యువకులను, ఎదుగుతున్న పిల్లలను తమ దళంలోకి తీసుకుని శిక్షణ ఇస్తోందని, తదుపరి దాడులకు వారిని సిద్ధం చేస్తోందనీ సౌదీకి చెందిన ''అల్ అరేబియా'' మీడియా పేర్కొంది. హమాస్‌కు చెందిన సాయుధ విభాగం ఇజ్ అద్ అల్ కస్సామ్ బ్రిగేడ్‌లో వీరందరినీ చేర్చి శిక్షణ ఇస్తున్నట్లు పత్రిక పేర్కొంది. వీరికి గెరిల్లా యుద్ధంలో శిక్షణ ఇవ్వడంతో పాటు రాకెట్లను ప్రయోగించడం కూడా నేర్పుతోందని పేర్కొంది. కానీ వాస్తవానికి హమాస్ నాయకత్వం ఇజ్రాయెల్ దాడులకారణంగా క్షీణదశలో ఉంది. కొత్త నాయకత్వాన్ని తీర్చిదిద్దే యత్నాలలో దీనిని ఒక భాగంగా భావిస్తున్నారు. వారికి తగిన వనరులు కూడా లేవు. హమాస్ తిరిగి తలెత్తకుండా చేసేందుకు గాజాను పూర్తిగా స్వాధీనం చేసుకోవాలని ఇజ్రాయెల్ ప్రయత్నిస్తుండగా భవిష్యత్ యుద్ధ వ్యూహాలను హమాస్ రచిస్తున్నది. ఐతే వాస్తవిక పరిస్థితుల రీత్యా ఈ కథనం వెనుక విశ్వసనీయత కూడా ప్రశ్నార్థకంగా మారింది. కానీ ఇటీవలి వారాలలోనే ఈ రిక్రూట్‌మెంట్లు జరిగాయని అల్ అరేబియా మీడియా పేర్కొంది. ఇదిలా ఉండగా గాజాలో నెలరోజులక్రితం 14 మంది రెడ్ క్రిసెంట్ వైద్య సహాయ సిబ్బందిని హతమార్చిన ఘటనపై స్వతంత్ర దర్యాప్తు జరపాలని పాలస్తినా సివిల్ డిఫెన్స్, రెడ్ క్రిసెంట్‌లు డిమాండ్ చేశాయి. రాత్రిపూట అతిదారుణంగా సహాయ వైద్యబృందాలను ఇజ్రాయెల్ దళాలు చంపాయని ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఈ విషయంలో ఇజ్రాయెల్ తప్పుడు దర్యాప్తు నివేదిక పేరుతో అసత్య ప్రచారం చేస్తోందని విమర్శించాయి. ఇదిలా ఉండగా హమాస్‌కు లొంగకుండా ఇజ్రాయెల్ బందీలను దేశానికి తీసుకువచ్చే ప్రక్రియ అత్యంత కీలక దశకు చేరిందని ఆ దేశ ప్రధానమంత్రి బెంజిమెన్ నేతన్యాహూ చెప్పారు. అలవికాని హమాస్ డిమాండ్లను అంగీకరించేదిలేదని, వాటిని పక్కకునెట్టి బందీలను జల్లెడపట్టి వెదకి తీసుకువస్తామని అన్నారు.

## ధాన్యం బోనస్ (మొదటి పేజీ తరువాయి)

నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు మూడేళ్లకే కూలిపోయింది అని ఉత్తమ్‌కుమార్ రెడ్డి విమర్శించారు.

**రైతుబంధు ఇచ్చి మిగతా అన్ని పథకాలు నిలిపివేశారు : మంత్రి తుమ్మల**
పసుపు పంటకు మద్దతు ధర వస్తేనే.. పసుపు రైతు తలెత్తుకుని ఉండగలడని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రైతు సంక్షేమ కార్యక్రమాల్లో తెలంగాణకు సాటి వచ్చే రాష్ట్రం మరొకటి లేదన్నారు. రాష్ట్రానికి పసుపుపారాణి లాంటిది నిజామాబాద్ జిల్లా అని పేర్కొన్నారు. రైతులకు రూ.2 లక్షల వరకు ఒకే విడతలో రుణమాఫీ చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని పేర్కొన్నారు. గత ప్రభుత్వం రైతుబంధు ఇచ్చి మిగతా అన్ని పథకాలను నిలిపివేసింది. అకాల వర్షాలకు పంట నష్టపోయిన వారికి త్వరలోనే పరిహారం అందజేస్తాం. భారాస హయాంలో పదేళ్ల పాటు వ్యవసాయ యంత్ర పరికరాలను ఇవ్వలేదు. ఈ ప్రభుత్వం మళ్లీ వాటి పంపిణీని పునరుద్ధరించింది. ప్రతి జిల్లాలో ఆయిల్ పామ్ పరిశ్రమ ఏర్పాటు చేసే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంది. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో ఈ సాగు పెరగాల్సి ఉంది. 4 ఎకరాల వరిసాగుతో వచ్చే లాభం ఎకరం ఆయిల్‌పామ్ తోటతో వస్తుంది అని తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, పిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, భూపతి రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ, ఆర్మూర్ నియోజక వర్గ ఇన్‌చార్జి వినయ్ రెడ్డి, ఏనుగు రవిందర్ రెడ్డి, ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి, నుడా ఛైర్మన్ కేశ వేణు, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు, కాంగ్రెస్ నాయకులు, రైతులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

## పాలకులు చిన్నచూపు
(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్(ఎఐటియుసి)రాష్ట్ర మహాసభల సందర్భంగా నిర్వహించిన బహిరంగసభలో సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి,భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు బుజ్జిని రత్నాకర్ రావులతో కలిసి ఆయ న ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ ఆకాశాన్ని ముద్దాడే భవనాలను నిర్మిస్తున్న భవన నిర్మాణ కార్మికులను పాలకులు చిన్నచూపు చూస్తున్నారని విమర్శించారు.పాలకులు అనుసరిస్తున్న విధానాల ఫలితంగా నేడు అందరూ అసంఘటిత కార్మికులుగా మారిపోయారన్నారు. గతంలో కార్మిక రంగంలో సంఘటిత,అసంఘటిత రంగ కార్మికులని వేరువేరుగా ఉండేవారని,ప్రస్తుతం అన్నిచోట్ల పర్మినెంట్ కార్మికులకు బదులుగా నియమించుకునే సందర్భంలోనే తాత్కాలిక ఉద్యోగులు నియమిస్తున్నారని నారాయణ అన్నారు. నరేంద్రమోదీ ప్రభుత్వం అధికారులకు వచ్చిన తర్వాత కార్పొరేట్ శక్తులకు ప్రోత్సహిస్తూ,కార్మికులు పేదలపై భారాలు మోపుతుందన్నారు. అందులో భాగంగానే 29 మంది కార్పొరేట్ శక్తులు 16 లక్షల కోట్లు ఎగ్గొట్టిన పట్టించుకోని ప్రభుత్వం సామాన్యులు వాడు వంద రూపాయల కొనుక్కుని చెప్పులపై జిఎస్టి ఐదు నుండి 18 శాతానికి పెంచి, ధనవంతులు కొనుక్కుని వస్తువులపై జీఎస్టీని 33 శాతం నుండి 18 శాతానికి తగ్గించిందని విమర్శించారు. సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి పోరాటాలు అది వారేమన్నారు. కార్మిక వర్గ పార్టీగా భారత కమ్యూనిస్టు పార్టీ దేశంలో రాష్ట్రంలో నిరంతరం కార్మికుల పక్షాన పోరాడుతుందని ఆయన గుర్తు చేశారు.భవన నిర్మాణ కార్మికుల హక్కులను అమలు చేసే పరిస్థితిలో ప్రభుత్వాలు లేవని ఏఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజు విమర్శించారు. ఆహ్వాన సంఘం అధ్యక్షులు పానుగంటి పర్వతాలు అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎండి యూసుఫ్,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాలరాజు,సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎం నరసింహ,ఏఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి గన్న అరపు రమేష్ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రవీణ్ కుమార్ గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మీనారాయణ,రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి కే రామస్వామి,ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సామిడి శేఖర్ రెడ్డి,ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శులు ఎస్ మల్లేష్,హరి సింగ్ నాయక్ ఎం శ్రీను నాయక్,జిల్లా ఉపాధ్యక్షుడు వెంకన్న,భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కే నర్సింహారెడ్డి,జిల్లా అధ్యక్షుడు దాసరి ప్రసాద్,నర్రగిరి తదితరులు పాల్గొన్నారు.

## కన్నుమూత
(మొదటి పేజీ తరువాయి)

మరణించినట్లు ఒక వీడియో సందేశంలో వాటికన్‌సిటీ వర్గాలు తెలియజేశాయి. పోప్ పదవిని అధిష్టించిన మొట్టమొదటి లాటిన్ అమెరికన్‌వాసి ఫ్రాన్సిస్. డబుల్ న్యుమోనియా కారణంగా ఇటీవల ఆయన ఐదువారాలపాటు ఆసుపత్రిలో చికిత్సపొంది మరణం అంచులను తాకి వచ్చారు. ఆసుపత్రి నుండి విడుదలయ్యాక మూడోరోజున బ్రిటన్ రాజదంపతులను కలిశారు. వారిని ఆశీర్వదించారు. ఏప్రిల్ ఆరో తేదీన కొద్దిసేపు ప్రజలకు వీల్‌ఛైర్‌లో కనిపించారు. ఏప్రిల్ 10న సెయింట్ పీటర్స్ బాసిల్లకాను సాధారణ దుస్తుల్లో సందర్శించారు. ఈస్టర్ సందర్భంగా గురువారంనాడు రోమ్ జైలును సందర్శించారు. ఏప్రిల్ 20 ఆదివారంనాడు ఈస్టర్ సందర్భంగా ప్రజలను ఆశీర్వదించారు. అదేరోజు అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ దంపతులతో అనధికార సమావేశం జరిపారు. ఆ మరునాడే మరణించారు. రాబోయే ఆరు రోజుల లోపు పోప్ ఫ్రాన్సిస్ అంత్యక్రియలు జరుగుతాయి. పోప్ ఫ్రాన్సిస్ మరణవార్త వినడంతో ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల నాయకులు వాటికన్ సిటీకి వరద ప్రవాహంలా సంతాప సందేశాలు పంపిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా 140 కోట్ల మంది రోమన్ క్యాథలిక్ ప్రజలకు ఆయన ప్రధాన మార్గదర్శకుడుగా గడచిన 12 సంవత్సరాలుగా బాధ్యతలు నిర్వహించారు. మూడవ పోప్‌పాల్ జెసూట్ ఉత్తర్వు ప్రకారం ఏర్పడిన సొసైటీ ఆఫ్ జీసస్ బృందం నుండి రోమ్ బిషప్‌గా బాధ్యతలు చేపట్టిన మొదటి గురువు పోప్ ఫ్రాన్సిస్.

**జీవిత సంగ్రహం :** లాటిన్ అమెరికాదేశం అర్జెంటైనా రాజధాని బ్యూనోస్ ఐర్స్‌లో 1936 డిసెంబరు 17వ తేదీన పోప్ ఫ్రాన్సిస్ జన్మించారు. ఆయన అసలు పేరు జార్జ్ మారియో బెర్గోగ్లియో. 1958లో తీవ్ర అనారోగ్యానికిగురై మరణం అంచులు చూసి తిరిగి వచ్చిన బెర్గోగ్లియో 1969లో నాటి పోప్ ఆశీర్వాదాలతో జెసూట్స్‌లో చేరారు. క్యాథలిక్ మత గురువుల మంత్రివర్గ సభ్యుడయ్యారు. 1973 నుండి 1979 వరకూ అర్జెంటైనాలో ప్రొవెన్షియల్ సుపీరియర్‌గా ఒకరుగా బాధ్యతలు నిర్వహించారు. 1998లో బ్యూనోస్ ఐర్స్ ఆర్చ్ బిషప్ బాధ్యతలు స్వీకరించారు. పోప్ జాన్ పాల్—2 ఆదేశాల ప్రకారం 2001లో ఆయన సలహాదారులలో ఒకరుగా బాధ్యతలు తీసుకున్నారు. 2001లో అర్జెంటైనా బ్యూనోస్‌ఐర్స్‌లో హింసాకాండ చెలరేగినప్పుడడు శాంతిసాధనలో చర్చ్ గురువుగా బాధ్యతలు నిర్వహించారు. 2013 ఫిబ్రవరి 28న బెనెడిక్ట్—16 రోమ్ బిషప్ పదవికి రాజీనామా చేయడంతో మార్చి 12,13 తేదీలలో జరిగిన పాపల్ సదస్సులో బెర్గోగ్లియో రోమ్ బిషప్‌గా నియమితులయ్యారు. పేద క్రైస్తవుడుగా జీవితాన్ని అనుష్ఠించి క్రైస్తవ మత బోధకుడుగా జీవించిన సెయింట్ ఫ్రాన్సిస్ ఆఫ్ అస్సిసి స్ఫూర్తితో, ఆయన జ్ఞాపకార్థం రోమ్ బిషప్ పదవికోసం బెర్గోగ్లియో తన పేరును ఫ్రాన్సిస్‌గా మార్చుకున్నారు.

వివిధ క్రైస్తవ విభాగాలమధ్య ఐక్యత ఉండాలని ఆయన పిలుపు ఇచ్చారు. 2016లో జరిగిన క్రైస్తవ అష్టమ ఐక్యతా కూటమి సందర్భంగా ఇతర క్రైస్తవులపట్ల రోమన్ క్యాథలిక్స్ అనుసరించిన వైఖరిపట్ల క్షమాపణలు తెలియజేశారు. అదేవిధంగా క్యాథలిక్స్‌ను హింసించినవారిని కూడా క్షమించాలని ఆ దేవుణ్ణి ప్రార్థించారు. క్రైస్తవ మతమే తనకు ప్రధానమని, ఏ మార్గాన్ని అనుసరించినాగానీ అని క్రైస్తవ సంఘాలు ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపు ఇచ్చారు. బాలలను లైంగికంగా దోపిడీ చేస్తున్నారని క్యాథలిక్స్‌పై వచ్చిన తీవ్ర ఆరోపణలు ఆయన పదవీకాలంలో పెద్ద సవాలుగా నిలిచాయి. ఈ ఆరోపణలను ఆయన అధిగమించారు.

## నక్సల్ హతం
(మొదటి పేజీ తరువాయి)

పోలీసులు వెల్లడించారు. అతడిని పుచన, నాగ మాంఝీ, కరన్, లెతర అనే పేర్లతో కూడా పిలుస్తారని తెలిపారు. ఈ ఎన్‌కౌంటర్లో చనిపోయిన ఎనిమిది మందిలో అరవింద్, రామ్ మాంఝీ, కేంద్ర కమిటీ సభ్యుడు మాంఝీ అలియాస్ వివేక్, స్పెషల్ ఏరియా కమిటీ సభ్యుడు అరవింద్ యాదవ్ అలియాస్, అవినాష్, జోనల్ కమిటీసభ్యుడు సహేబ్రం మాంఝీ అలియాస్ రాహుల్ మాంఝీ, మహేష్ మాంఝీ అలియాసం మోట, టాలు, రంజు మాంఝీ, గంగారం, మహేష్ అనే మావోయిస్టులు ఉన్నట్లు వివరించారు. వివేక్ తలపై రూ.1 కోటి, అరవింద్ యాదవ్ తలపై 25 లక్షలు, సహేబ్రం మాంఝీ తలపై కూడా రూ.10 లక్షలు చొప్పున రివార్డులు ఉన్నాయని చెప్పారు. సోమవారం తెల్లవారుజామున బొకారో జిల్లాలోని లాల్‌పానియా ప్రాంతంలో సిఆర్‌పిఎఫ్, రాష్ట్ర పోలీసులు కూంబింగ్ ఆపరేషన్ చేపట్టారు. వీరికి లుగు హిల్స్ వద్ద మావోయిస్టులు ఎదురుపడటంతో ఎన్‌కౌంటర్ ప్రారంభమైంది. ఆ తర్వాత కొద్దిసేపటికి నక్సలైట్లు అడవుల్లోకి పారిపోయారు. అనంతరం మొత్తం 8 మృతదేహాలను స్వాధీనం చేసుకోగా, వీరిలో ప్రయాగ్ ఉన్నట్లు గుర్తించారు. తాజా ఆపరేషన్‌లో ఎస్ఎల్ఆర్, ఇన్సాస్ వంటి భారీ ఆయుధాలను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. 209 కోబ్లా బెటాలియన్, జార్ఖండ్ పోలీసులు ఇందులో పాల్గొన్నారు. ఈ ఏడాది జార్ఖండ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్లలో మొత్తం 13 మంది మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయారు. 2025 చివరికి రాష్ట్రాన్ని మావో రహిత రాష్ట్రంగా చేయాలని పోలీసులు లక్ష్యంగా పెట్టుకొన్నారు. ఇప్పటికే 244 మంది మావోయిస్టులను రాష్ట్రంలో అరెస్టు చేయగా, పలు దళాల కమాండర్లతో కలిపి 24 మంది లొంగిపోయారు.

**ప్రశాంత్ హిల్స్ అతడి అడ్డా :** కేంద్ర కమిటీ సభ్యుడైన ప్రయాగ్ మాంఝీ, ధనాబాద్ జిల్లా తుండీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దల్‌బుద గ్రామంలో పుట్టాడు. జార్ఖండ్, బిహార్, ఛత్తీస్‌గఢ్, ఒడిశాలో జరిగిన దాదాపు 100దాడుల్లో ఇతడి హస్తం ఉంది. ముఖ్యంగా ప్రశాంత్ హిల్స్ కేంద్రంగా చేసుకుని తన కార్యకలాపాలు నిర్వహించేవాడు. ఒక్క గిరిధి జిల్లాలోనే ఇతడిపై 50కేసులతో పాటు రూ.కోటి రివార్డు ప్రకటించారు. జార్ఖండ్‌లో అత్యధిక రివార్డ్ ఉన్న రెండో మావోయిస్టు ఇతడేనని పోలీసులు చెప్పారు ఇతడు పరస్నాథ్ ప్రాంతంలోకి ప్రవేశించినట్లు సమాచారం అందడంతో పోలీసులు వేగులను అప్రమత్తం చేసి హతం చేశారు.

**ఏడాది క్రితమే భార్య అరెస్ట్ :**
ప్రయాగ్ మాంఝీ భార్య జయాను గత సంవత్సరం పోలీసులు అరెస్టు చేశారు. ఆమె క్యాన్సర్‌తో బాధపడుతోంది. ఈ క్రమంలోనే చికిత్స తీసుకోవడానికి బయటకు రాగా ఆమెను అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత చికిత్స పొందుతూ జయా మృతి చెందింది.

**నక్సలిజం నిర్మూలన దిశగా మా అడుగులు ఆగవు :**
నక్సలిజం నిర్మూలనకు తమ ప్రభుత్వ నిబద్ధత కొనసాగుతుందని కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా సోమవారం స్పష్టం చేశారు. జార్ఖండ్‌లో భద్రతా దళాలతో సోమవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఎనిమిది మంది నక్సలైట్ల వధ నేపథ్యంలో హోమ్ శాఖ మంత్రి ఆ వ్యాఖ్యలు చేశారు. 'నక్సలిజం నిర్మూలన దిశగా మా అడుగులు ఆగకుండా సాగుతున్నాయి. నక్సలిజం నిర్మూలనకు ప్రస్తుతం సాగుతున్న ఆపరేషన్‌లో భద్రతా దళాలు సోమవారం మరొక విశిష్ట విజయం సాధించాయి. జార్ఖండ్ బొకారో జిల్లాలోని లుగు హిల్స్‌లో ఎన్‌కౌంటర్‌లో కోటి రూపాయల రివార్డు ఉన్న అగ్రశ్రేణి నక్సల్ నేత, మరి ఇద్దరు ఘరానా నక్సలైట్లు సహా ఎనిమిది మంది మావోయిస్టులు హతమయ్యారు. ఈ ఆపరేషన్ కొనసాగుతోంది. మన భద్రత దళాలను శ్లాఘించాలి' అని అమిత్ షా 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు.

# వడదెబ్బతో నలుగురు మృతి





**ప్రజాపక్షం/ తొర్రూరు/నిజామాబాద్/ నిర్మల్ :** వడదెబ్బతో నిజామాబాద్, నిర్మల్, మహబూబాబాద్‌లో నలుగురు మృతి చెందారు. విరాలలోకి వెళితే.. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం చెర్లపాలెం గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో మహిళా రైతు హనుమాండ్ల ప్రేమలత వడదెబ్బతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సంఘటనా స్థలానికి చేరుకొని వారి కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. నిజామాబాద్ జిల్లా దర్పల్లి మండలంలోని వాడి గ్రామానికి చెందిన కర్క పటేండ్ల రాములు (65) అనే రైతు తన వ్యవసాయ పంట పొలంలో పనిచేస్తుండగా వడదెబ్బ తగిలి మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. సోమవారం ఉదయం తన వ్యవసాయ పొలానికి వెళ్లి వరి కర్రలను నూర్పిడి చేస్తున్నాడని, మధ్యాహ్నం అయినా కూడా ఇంటికి రాకపోవడంతో ఏం జరిగిందో తెలియక రాములు భార్య పొలానికి వెళ్ళి చూడగా తన భర్త రాములు విగతజీవిగా పడి ఉండడం చూసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో కుటుంబ సభ్యులు గ్రామస్తులతో కలిసి వెళ్ళి చూడగా అప్పటికే మృతి చెందినట్టు గుర్తించారు. నిర్మల్ జిల్లాలోనూ వడదెబ్బతో ఇద్దరు మృతి చెందారు. నిర్మల్ పట్టణంలోని కుమన్నపేట్ కాలనీకి చెందిన శంకర్(48), రాజు 42 ఆదివారం పోచమ్మ పండుగ ఉండటంతో డప్పు కొట్టడానికి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చిన క్రమంలో నీరసంగా ఉండటంతో ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా మృతి చెందినట్లు తెలిపారు. నిరుపేద కుటుంబానికి చెందిన వీరిని ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు.

## బాటలు (మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ఒసాకాలో జరుగుతున్న వరల్డ్ ఎక్స్‌పోలో దేశంలోనే మొదటి రాష్ట్రంగా తెలంగాణ భాగస్వామ్యం కావడం గర్వంగా ఉందన్నారు. తెలంగాణ, జపాన్‌ల మధ్య ఉన్న చారిత్రక స్నేహాన్ని దీర్ఘకాల భాగస్వామ్యంగా మార్చుకుందామని పిలుపునిచ్చారు. కొత్త ఆవిష్కరణలతో భవిష్యత్ ప్రణాళికల రూపకల్పనకు కలిసి పనిచేద్దామనే ఆకాంక్షను వ్యక్తం చేశారు. ప్రభుత్వం అనుసరిస్తున్న స్థిరమైన విధానాలు, సులభతర పారిశ్రామిక విధానం, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు తెలంగాణలో ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ఐటి, బయోటెక్నాలజీ రంగాల్లో తెలంగాణ ఇప్పటికే ప్రత్యేకమైన గుర్తింపు సాధించిందని, వీటితో పాటు ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్, టెక్స్‌టైల్స్ రంగాల పరిశ్రమలకు ఉన్న అనుకూలతలను వివరించారు. హైదరాబాద్‌లో 30 వేల ఎకరాల్లో 'ఫ్యూచర్ సిటీ'ని నిర్మిస్తున్నామని, ఎకో, ఎనర్జీ, స్మార్ట్ మొబిలిటీ, సర్క్యులర్ ఎకానమీపై ఈ సిటీ ఆధారపడుతుందన్నారు. జపాన్‌కు చెందిన మారుబెని కార్పొరేషన్‌తో ఫ్యూచర్ సిటీలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. హైదరాబాద్ చుట్టూ 370 కిలోమీటర్ల రీజనల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్), రేడియల్ రోడ్లతో పాటు ఆర్ఆర్ఆర్‌కు ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) మధ్య ఉన్న జోన్‌లో ఎలక్ట్రిక్ వాహనాలు, ఎనర్జీ స్టోరేజ్, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్స్, ఏరోస్పేస్ పరిశ్రమలకు అనువైన వాతావరణం ఉందన్నారు. ఎగుమతులకు వీలుగా సమీప ఓడరేవుతో అనుసంధానించే డ్రై పోర్ట్‌ను తెలంగాణలో ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. మూసీ పునరుజ్జీవనంలో భాగంగా నది పొడవునా 55 కిలోమీటర్ల అర్బన్ గ్రీన్‌వే అభివృద్ధి చేసేందుకు టోక్యో, ఒసాకా నగరాలను చూసి ఎంతో నేర్చుకోవాల్సి ఉందని అన్నారు. నైపుణ్యాల శిక్షణతో పాటు నాణ్యత, క్రమశిక్షణకు అద్దం పట్టేలా యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ వివరించారు. ఈ యూనివర్సిటీ రాష్ట్రంలో ఉపాధి, వ్యాపార అవకాశాలను రెట్టింపు చేస్తుందన్నారు.

**ఒసాకా ఎక్స్‌పోలో ఘనంగా**
**తెలంగాణ పెవిలియన్ ప్రారంభం**

జపాన్‌లోని ఒసాకాలో జరుగుతున్న ప్రతిష్టాత్మక ఒసాకా ఎక్స్‌పోలో తెలంగాణ రాష్ట్రం తన ప్రత్యేకమైన పెవిలియన్‌ను ఘనంగా ప్రారంభించింది. కిటాక్యూషు నుంచి ఒసాకా చేరుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం సోమవారం ఉదయం భారత పెవిలియన్‌లో అడుగుపెట్టింది. భారత పెవిలియన్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తెలంగాణ జోన్‌ను సిఎం రేవంత్ రెడ్డి, ఐటి పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు ప్రారంభించారు.

ప్రతి ఐదేళ్లకు ఒకసారి ఒసాకో ఎక్స్‌పో నిర్వహిస్తారు. ఒసాకో ఎక్స్‌పోలో పాల్గొన్న భారతదేశంలోని తొలి రాష్ట్రం తెలంగాణ కావటం విశేషమని ముఖ్యమంత్రి కార్యాలయం తెలియజేసింది. ఒసాకా ఎక్స్‌పో వేదికపై తెలంగాణ తన వైవిధ్యమైన సంస్కృతి, అభివృద్ధి చెందుతున్న పారిశ్రామిక అనుకూల వాతావరణం, సాంప్రదాయ కళలు, పర్యాటక ఆకర్షణలను ప్రపంచం నలుమూలాల నుంచి వచ్చే సందర్శకులకు చాటిచెప్పనుంది. తెలంగాణ పెవిలియన్‌లో రాష్ట్ర సాంకేతిక పురోగతి, సాంస్కృతిక వారసత్వం, పర్యాటక సంపదను ప్రతిబింబించే ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఈ వేదిక ద్వారా అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు, సాంస్కృతిక సహకారాన్ని పెంపొందించే దిశగా తెలంగాణ అడుగులు వేస్తోందని ముఖ్యమంత్రి కార్యాలయం తెలియజేసింది.

# జనరల్
STATE & REGIONAL NEWS

## సెర్ప్‌లో సాధారణ బదిలీలకు.. మంత్రి సీతక్క ఆదేశాలు

ప్రజాపక్షం/హైదరాబాద్ : గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్)లో సాధారణ బదిలీలకు రంగం సిద్ధమైంది. మంత్రి సీతక్క ఆదేశాలతో సెర్ప్‌లో వందలాది బదిలీలకు అనుమతులు ఇస్తూ సోమవారం ప్రభుత్వం జిఓ జారీ చేసింది. సెర్ప్‌లో మొత్తం 3,974 మంది ఉద్యోగులు ఉన్నారు. ఈ సంస్థలో సాధారణ బదిలీలు జరిగి పదేళ్ళయిన నేపథ్యంలో ఉద్యోగుల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం బదిలీలకు ఆమోదం తెలిపింది. చాలా మంది సిబ్బంది ఒకేచోట పాతుకుపోవడంతో పనుల్లో వేగం తగ్గిందని, మళ్లీ పనుల్లో వేగం పెంచేందుకు బదిలీలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని మంత్రి చెప్పారు. మహిళా సంఘాలను స్వయం సమృద్ధి నుంచి ఉపాధి కల్పన, సంపద సృష్టి దిశలో ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ ప్రక్రియ వేగవంతం కోసం బదిలీలు ఉపయోగపడతాయని భావిస్తున్న ప్రభుత్వం అభిప్రాయం వ్యక్తం చేసింది. కాగా, సెర్ప్ కేంద్ర కార్యాలయంలో ఎంతో మంది ప్రాజెక్టు మేనేజర్లు, జిల్లాల్లో డిపిఎం, ఏపిఎంలు, సిసిలుగా చాలా మంది ఒకే దగ్గర పాతుకుపోయారు.

# ఉద్యోగాల కల్పనే ప్రభుత్వ లక్ష్యం



మధిరలో జాబ్ మేళాను ప్రారంభించిన డిప్యూటీ సిఎం భట్టి

ప్రజాపక్షం/మధిర : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, విద్యుత్‌శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. సోమవారం రెడ్డిగార్డెన్స్ కళ్యాణ మండపం నందు డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క సారథ్యంలో అధికారులు, వివిధ కంపెనీ ప్రతినిధుల ఆధ్వర్యంలో జరిగిన మెగా జాబ్ మేళాకు అధికసంఖ్యలో నిరుద్యోగ యువతీ, యువకులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిధిగా హాజరై జాబ్ మేళాను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కోరి కొట్లాడి తెచ్చుకున్న ప్రత్యేక రాష్ట్రంలో కొద్దిమంది రాజకీయ నాయకులకే ఉద్యోగాలు వచ్చాయే తప్పా గత పది సంవత్సరాల్లో రాష్ట్రంలో నిరుద్యోగులకు అన్యాయం జరిగిందన్నారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించడమే ప్రధాన ధ్యేయమని సిఎం రేవంత్‌రెడ్డితో పాటు యావత్ క్యాబినెట్ ఒక నిర్ణయం తీసుకుందని అన్నారు. ఆ మేరకు రాష్ట్రంలో మూడు అంచెల్లో ఉద్యోగాల కల్పిస్తున్నామని వివరించారు. మొదటి సంవత్సరంలోనే 56వేల ఉద్యోగాల భర్తీ చేశామని, మరో 30వేల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి కసరత్తు జరుగుతుందని తెలిపారు. రెండో దశలో ప్రపంచ వ్యాప్తంగా గ్లోబలైజేషన్లో భాగంగా వచ్చిన మార్పుల మేరకు బహుళ జాతి సంస్థలకు రాష్ట్రంలో వనరులు ఏర్పాటు చేసి ఆ సంస్థల ద్వారా రాష్ట్రంలోని లక్షలాది యువతకు ఉపాధి కల్పించడమే ధ్యేయం అన్నారు. మూడవ దశలో ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు రూ.9వేల కోట్లు పెట్టుబడితో రాజీవ్ యువ వికాసం పథకాన్ని తీసుకువచ్చామని, రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం జూన్ 2న ఎంపికైన వారందరికీ రాష్ట్ర వ్యాప్తంగా శాంక్షన్ లెటర్లు పంపిణీ చేస్తామని తెలిపారు. ఉమ్మడి రాష్ట్ర చరిత్రలోనే ఎన్నడూలేనివిధంగా నిధులు కేటాయించామన్నారు. 5లక్షల మంది యువతకు ఉపాధి కల్పించేలా మరో నాలెడ్జి సిటీ ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. మధిరలో జాబ్ మేళా ద్వారా ఒకే రోజు 5వేల మందికి ఉపాధి లభిస్తుందని తెలిపారు. మధిర నియోజకవర్గమంతా వ్యవసాయదారులేనని, భవిష్యత్‌లో వ్యవసాయంతో పాటు పరిశ్రమలు వచ్చేందుకు ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేశామని తెలిపారు. రాబోయే రోజుల్లో మధిర భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుందని, దేశానికి, ప్రపంచానికి నాయకత్వం వహించేలా మధిర నియోజకవర్గ యువత ఎదగాలని ఆకాంక్షించారు. విద్యారంగ అభివృద్ధిలో భాగంగా అధిక మొత్తంలో నిధులు కేటాయించామని, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను అప్‌గ్రేడ్ చేసి అన్ని వసతులు కల్పిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ, సింగరేణి జనరల్ మేనేజర్ సాలెం రాజు, వివిధ కంపెనీల ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున నిరుద్యోగ యువతీ, యువకులు తదితరులు పాల్గొన్నారు.

### 44 ఏళ్ల తర్వాత అధికారికంగా
# ఇంద్రవెల్లి అమరవీరుల వార్షికోత్సవం

బాధితుల కుటుంబాలకు సహాయాన్ని అందిస్తాం
అర్హత మేరకు ఉపాధి కల్పిస్తాం : మంత్రి సీతక్క



ఆదిలాబాద్: ఇంద్రవెల్లి అమరవీరుల వార్షికోత్సవాన్ని ఆదివారం 44 సంవత్సరాల తర్వాత తొలిసారిగా అధికారికంగా నిర్వహించారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి మంత్రి సీతక్క ఇంద్రవెల్లి అమరవీరుల స్మారక చిహ్నం వద్ద నివాళులర్పించారు. గిరిజనుల త్యాగాలను మంత్రి గౌరవిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం బాధితుల కుటుంబాలకు సాధ్యమైన అన్ని సహాయాలను అందిస్తుందని చెప్పారు. అర్హత మేరకు ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఐటిడిఎ) లేదా పంచాయతీ రాజ్ శాఖ ద్వారా వారికి ఉపాధి కల్పిస్తామని ఆమె ప్రకటించారు. ఇందిరమ్మ పథకం కింద బాధితుల కుటుంబాలలో ప్రతి ఒక్కరికి ప్రభుత్వం ఐదు ఎకరాల సాగుభూమి, ఇంటి స్థలాలను కేటాయిస్తామని సీతక్క హామీ ఇచ్చారు. 1981 పోలీసు కాల్పుల్లో మరణించిన వారి కుటుంబాలు, గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను అంచనా వేయడానికి ఐటిడిఎ పరిధిలో ఒక కమిటీని ఏర్పాటు చేస్తామని ఆమె తెలిపారు. వచ్చే ఏడాది నాటికి అమరవీరుల స్మారక చిహ్నం వద్ద బాధితుల ఫోటోలను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘాలకు చెక్కులను పంపిణీ చేసిన మంత్రి, కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని ఆంక్షలను తొలగించి, స్మారక దినోత్సవాన్ని అధికారికంగా గుర్తించిందని అన్నారు. స్మారక చిహ్న అభివృద్ధికి ఒక ఎకరం భూమి, రూ.1కోటితో పాటు ఈ ప్రాంతంలో అనేక ఇతర అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ప్రకటించిన విషయాన్ని ఆమె గుర్తు చేసుకున్నారు. 1981 ఏప్రిల్ 20న అప్పటి అవిభక్త ఆదిలాబాద్ జిల్లాలోని ఇంద్రవెల్లి గ్రామంలో పోలీసు కాల్పుల్లో 13 మంది గిరిజనులు మరణించారు. భూ ఆక్రమణలు, దోపిడీకి వ్యతిరేకంగా తమ గళాన్ని వినిపించేందుకు ఆదివాసీ గిరిజన రైతు కూలి సంఘం భారీ బహిరంగ సభకు ప్లాన్ చేసింది. పోలీసులు అనుమతి నిరాకరించి, ఆ ప్రాంతంలో నిషేధాజ్ఞలు విధించారు. అయితే, సమావేశానికి అప్పటికే వచ్చిన చాలా మంది గ్రామస్తులు, విద్యార్థులకు ఈ వార్త చేరలేదు. ఉద్రిక్తతలు పెరగడంతో, పోలీసులు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో అధికారిక రికార్డుల ప్రకారం 13 మంది గిరిజనులు ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో 1986లో ఆదివాసీలు ఆ స్థలంలో ఒక స్మారక చిహ్నాన్ని నిర్మించారు, కానీ అదే సంవత్సరం ప్రభుత్వం దానిని కూల్చివేసింది. నిరసనల తర్వాత, ప్రభుత్వం 1987లో స్మారక చిహ్నాన్ని పునర్నిర్మించింది. 1982 నుండి, గిరిజనులు ప్రతి సంవత్సరం నివాళులు అర్పిస్తూ ఈ దినోత్సవాన్ని పాటిస్తున్నారు. 1981లో జరిగిన ఈ ఘటన తర్వాత వచ్చిన ప్రభుత్వాలు గిరిజన సంక్షేమంపై దృష్టి సారించాయి. యువతను ఉగ్రవాదం నుండి దూరం చేయడానికి విద్య, ఉపాధిని ప్రోత్సహిస్తూ వస్తున్నాయి. కాగా, ఆదిలాబాద్ ఎంపి గోడం నగేష్, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు, పోలీసు సూపరింటెండెంట్ అఖిల్ మహాజన్, ఐటిడిఎ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఖుష్బూ గుప్తా, ఇతర అధికారులు, నాయకులు స్మారక చిహ్నాన్ని సందర్శించి నివాళులర్పించారు.

# ప్రభుత్వ దవాఖానాల్లో సకల సౌకర్యాల కల్పనకు నిరంతర కృషి

పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రిలో రూ.1కోటి నిధులతో ఆధునిక థియేటర్లను ప్రారంభించిన ఎమ్మెల్యే కూనంనేని



ప్రజాపక్షం/పాల్వంచ : ప్రభుత్వ దవాఖానాల్లో సకల సౌకర్యాల కల్పనకు నిరంతర కృషి చేస్తున్నట్లు కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. సోమవారం పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రి (సిహెచ్‌సి)లో రూ.1కోటి నిధులతో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్థోపెడిక్, ఇఎన్‌టి, డెంటల్, కంటి, ఓపిడి, ఆపరేషన్ థియేటర్లను ఎమ్మెల్యే కూనంనేని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదలకు ప్రభుత్వ వైద్యం మరింత చేరువ కావాలని ఆకాంక్షించారు. పాల్వంచ ఆసుపత్రిలో కార్పొరేట్ స్థాయి వైద్యం అందుబాటులోకి వచ్చిందని, విద్య, వైద్యంకు తన మొదటి ప్రాధాన్యత ఉంటుందని అన్నారు. వివిధ వ్యాధులతో ఆసుపత్రికి వచ్చే రోగులతో వైద్యులు, వైద్య సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, సరైన వైద్యం అందించి వారి ప్రాణాలను కాపాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిహెచ్‌ఎస్ డాక్టర్ రవిబాబు, పాల్వంచ తహసీల్దార్ వివేక్, మున్సిపల్ కమిషనర్ కె.సుజాత, పాల్వంచ ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ రాంప్రసాద్, డాక్టర్ సోమరాజుదొర, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నూకల రంగారావు, కొండ వెంకన్న, సీపీఐ, కాంగ్రెస్ నాయకులు బండి నాగేశ్వరరావు, ఉప్పుశెట్టి రాహుల్, గుండాల నాగరాజు, డి.సుధాకర్, అన్నారపు వెంకటేశ్వర్లు, శనగారపు శ్రీనివాసరావు, మనేం వెంకన్న, నరహరి, నాగేశ్వరరావు, బానోత్ రంజిత్, రవి, భూక్యా విజయ్, రాజశేఖర్, దుర్గా మహేష్, కుమార్, రాజు, విజయ్, రాము, శాంత వర్ధన్, సుమ, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్‌ను దళితులకే పరిమితం చేయడం సరికాదు

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : భారతదేశ చరిత్రలో డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ఎదుర్కొన్న అవమానాలు మరెవరూ ఎదుర్కోలేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. ఎన్ని అవమానాలు ఎదురైనా అడుగడుగునా హేళనకు గురైనా వాటినే సోపానాలుగా చేసుకుంటూ అనుకున్న లక్ష్యానికి చేరుకోవడంతో పాటు తన చదువునంతా సమాజ శ్రేయస్సుకు అణగారిన వర్గాల అభ్యున్నతికి ధారపోసిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని బిజెపి జిల్లా శాఖ ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని శుభమంగళ గార్డెన్స్‌లో నిర్వహించిన సెమినార్‌లో బండి సంజయ్ ప్రసంగించారు. చిన్న సమస్య, అవమానాలు ఎదురైతే లక్ష్యసాధన నుంచి పక్కకు తప్పుకుంటున్న నేటి తరానికి అంబేద్కర్ జీవితమే స్ఫూర్తిదాయకమన్నారు. అంబేద్కర్‌ను దళితజాతికే పరిమితం చేయాలని కాంగ్రెస్ కుట్ర చేసిందన్నారు. చరిత్ర అంటే డూప్లికేట్ గాంధీ కుటుంబానికే అన్నట్లుగా విపరీతమైన ప్రచారం చేసుకుని అంబేద్కర్‌ను తక్కువ చేసిందన్నారు. ఆర్టికల్ 370 దేశానికి మంచిది కాదని, ఒకే దేశానికి రెండు చట్టాలు కరెక్ట్ కాదని అంబేద్కర్ తీవ్రంగా వ్యతిరేకిస్తే ఆయనను అవమానిస్తూ ఆ ఆర్టికల్‌ను ఆమోదించిందన్నారు. గాంధీ కుటుంబ సభ్యులైన నెహ్రూ, ఇందిరా, రాజీవ్ గాంధీలకు భారతరత్న ఇచ్చుకున్నారు కానీ అంబేద్కర్ మహనీయుడికి ఇవ్వకుండా ఆయనను ఓడించిన కజ్రోల్కర్‌కు పద్మభూషణ్ అవార్డు ఇచ్చి తీవ్రమైన మానసిక క్షోభకు గురిచేసిందన్నారు. అంబేద్కర్ ఆశయాలను అమలు చేస్తూ ఆయన అడుగు జాడల్లో నడుస్తున్న ఏకైక పార్టీ బిజెపియే నన్నారు. కార్యక్రమంలో బండి సంజయ్‌తో పాటు మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ మేయర్ సునీల్ రావు, మానేరు అనంతరెడ్డి, దేవేందర్ రావు, అడవి కుమార్, డాక్టర్ గంగాధర్, రాజేందర్ రెడ్డి, సోమిడి వేణు పాల్గొన్నారు.

# కార్యకర్తలకు అండగా నిలబడతాం

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



ప్రజాపక్షం/భద్రాచలం : చావునోట్లో తలపెట్టి, పేగులు తెగేదాకా కొట్లాడి సాధించుకున్న మన తెలంగాణ మన కళ్లముందే ఆగమవుతోందని, తెలంగాణకు బిఆర్‌ఎస్సే శ్రీరామరక్ష అని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. సోమవారం బిఆర్‌ఎస్ కార్యకర్తలు, ఉద్యమకారులతో హరిత హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరైన ఆమె మాట్లాడారు. బిఆర్‌ఎస్ కార్యకర్తలను కాపాడుకునేందుకు తాను వారధిగా ఉంటానని, ఏ చిన్న సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకొస్తే కేసిఆర్ దృష్టికి తీసుకెళతానని చెప్పారు. సింగల్ ఎజెండాతో బిఆర్‌ఎస్ ముందుకు సాగుతుందని, తెలంగాణాను కాపాడుకోవడమే తమ లక్ష్యం అన్నారు. ఇక్కడ బిఆర్‌ఎస్ టిక్కెట్‌పై గెలిచిన డా.తెల్లం వెంకట్రావు తన స్వార్థం కోసం కాంగ్రెస్ కండువా కప్పుకున్నాడని, ఉప ఎన్నికలు వస్తే ఇక్కడ గెలిచేది మళ్లీ బిఆర్‌ఎస్సే అని చెప్పారు. గెలిచిన అతి కొద్దికాలంలోనే రూ.1.60 వేల కోట్లను అప్పులు తెచ్చారని, వాటిని ఎలా ఖర్చుపెట్టారని అడిగితే బుకాయిస్తున్నారని మండిపడ్డారు. రూ.40 వేల కోట్ల విలువైన కంచ గచ్చిబౌలి భూములను రూ.10వేల కోట్లకు తాకట్టుపెట్టారని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం ప్రకారం రైతు రుణ మాఫీ ఇంకా 60 శాతం మందికి చేయలేదని, 50 శాతం మందికి రైతుభరోసా జమ చేయలేదన్నారు. జిల్లాలో ముగ్గురు మంత్రులున్నా.. అభివృద్ధి శూన్యమని ఎద్దేవా చేశారు. రాష్ట్రాభివృద్ధి కోసం కేసిఆర్ అహర్నిశలు కృషి చేశారని, సీతారామా ప్రాజెక్టు ద్వారా 3.5 లక్షల ఎకరాలకు కేసిఆర్ నీళ్లిచ్చారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ మోసపూరిత వాగ్దానాలు ఇస్తుంది మోసపోకండి గోసపడతరు అని కేసిఆర్ అప్పట్లోనే చెప్పారని, ఇప్పుడు అక్షరాల ఈ పాలనలో ప్రజలు గోసపడుతున్నారని చెప్పారు. ఈ విలేకరుల సమావేశంలో రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, ఎంఎల్‌సి తాతా మధు సూధన్, బిఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు, మాజీ ఎంఎల్‌ఏ వనమా వెంకటేశ్వరరావు, జిల్లా గ్రంధాలయ మాజీ చైర్మన్ దిండిగాల రాజేందర్, మానె రామకృష్ణ, బానోత్ చంద్రావతి, రావులపల్లి రాంప్రసాద్, తాండ్ర రమణారావు, ప్రభోద్‌కుమార్‌తో పాటు పలు ప్రాంతాలకు చెందిన బిఆర్‌ఎస్ నాయకులు, ఉద్యమకారులు తదితరులు పాల్గొన్నారు.

# స్కూల్ పిల్లలకు నిషేధిత ఇ-సిగరెట్లు, వేపర్స్

టిజి,ఎపిలో రూ.కోటికిపైగా విక్రయాలు
గుట్టురట్టు చేసిన టిజిఎఎన్‌బి
రూ.25 లక్షల సిగరెట్లు స్వాధీనం

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర రాజధానిలోని విఐపి స్కూల్స్ విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని నిషేధిత ఇ సిగరెట్లతో పాటు డ్రగ్స్ అణవాలు కలిగిన వేపర్స్‌ను విక్రయిస్తున్న ఓ ముఠా గుట్టును తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టిజిఎఎన్‌బి) సోమవారం రట్టు చేసింది. ఈ ముఠా ఇప్పటికే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో రూ.కోటి వరకు వీటిని విక్రయాలు జరిపిందని పోలీసుల విచారణలో తేలింది. టిజిఎఎన్‌బి హైదరాబాద్ పోలీసులు ఇటీవల విద్యాసంస్థల్లో డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నిషేధిత ఇ సిగరెట్లు, వేపర్స్ విక్రయాల గురించి పోలీసుల దృష్టికి తీసుకువచ్చారు. టిజిఎఎన్‌బి అధికారులు ఆబిడ్స్‌లోని లిటిల్ ఫ్లవర్ స్కూల్, సెయింట్ మేరీస్ జూనియర్ కాలేజ్, సెయింట్ జార్జ్ గ్రామర్ స్కూల్, రోజరీ కాన్వెంట్ హైస్కూల్, సుజాత హైస్కూల్, జూనియర్ కాలేజ్‌లపై నిఘా పెట్టడంతో ఇ సిగరెట్ల రాకెట్ గుట్టు రట్టయ్యింది. ఈ సందర్భంగా సాదిక్ లాల్ అతని సోదరుడు అనిల్ లాల్‌లను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. వీరి నుంచి రూ.25 లక్షల విలువైన ఇ సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో నిందితులు నిషేధిత ఇ సిగరెట్లను యువతకు, పాఠశాలకు వెళ్లే మైనర్ పిల్లలకు ఎస్‌ఐడి పేరుతో దాదాపు 500 మందితో వాట్సాప్ గ్రూప్‌ను ఏర్పాటు చేశారు. ఈ గ్రూప్లోకి కొత్త ఉత్పత్తి ఏదైనా వస్తే దాని గురించి ప్రకటనలు చేస్తూ విక్రయిస్తున్నారు. న్యూఢిల్లీకి చెందిన అమిత్, ముంబైకి చెందిన వసీమ్‌లు వీటిని నిందితులకు సరఫరా చేసినట్లు తేలింది. ఇ సిగరెట్లు 18 ఏళ్లలోపు 13 మంది బాలనేరస్థులను వారి ఫోన్ నంబర్లతో సహా గుర్తించారు. ఈ 13 మంది బాల నేరస్థులు చిన్న వయసులోనే మాదకద్రవ్యాల దుర్వినియోగంలో చిక్కుకునే అవకాశం చాలా ఎక్కువ. స్థానిక పోలీసులు వారి ఇళ్లను సందర్శించి వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వనున్నారు.

# 'ఎసిబి వల'లో అవినీతి అధికారులు

మణుగూరు, ఆర్మూర్, జనగామ జిల్లా చిల్పూరులో ఎసిబి మెరుపుదాడులు



ప్రజాపక్షం/మణుగూరు/ఆర్మూర్/ జనగామ : తెలంగాణ రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో ప్రభుత్వ అధికారులు లంచావతారం ఎత్తి డబ్బు ఇస్తే తప్ప పనికాదని సతాయిస్తున్నారు. విసిగివేసారిన బాధితులు ఎసిబిని ఆశ్రయించడంతో ఎసిబి అధికారులు మెరుపుదాడులు నిర్వహించి అవినీతి అధికారులను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అవినీతి నిరోధక శాఖ అధికారులు (ఎసిబి) సోమవారం ఈ దాడులు నిర్వహించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో ఇద్దరు, నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో ఒకరు, జనగామ జిల్లా చిల్పూరు మండలంలో నిర్వహించి దాడులలో మరొక అధికారి ఎసిబికి రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కారు. దీనికి సంబంధించి వివరాలలోకి వెళితే... మణుగూరులో ఎసిబి అధికారులు సోమవారం మధ్యాహ్నం మెరుపుదాడి చేసి సిఐ సతీష్ కుమార్, రిపోర్టర్ గోపిని అదుపులోనికి తీసుకున్నారు. ఖమ్మం డిఎస్‌పి వై.రమేష్ వెల్లడించిన వివరాల ప్రకారం... మణుగూరులో గత కొద్ది రోజుల క్రితం గుట్టమారం పరిధిలో ప్రభుత్వ భూములను కొంత మంది వ్యక్తులు ఆక్రమించి అమ్ముకున్నారని వారిపై మణుగూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. కాగా ఆ కేసుకు సంబంధించి సిఐ సతీష్ కుమార్ మణుగూరుకు చెందిన ప్రముఖ వ్యాపారి, అతని అల్లుడుని ఆ కేసులో ఇరికించకుండా ఉండేందుకు గాను రూ.4లక్షల లంచం డిమాండ్ చేశారని, దానికి సంబంధించిన పైకంలో రూ.3లక్షలు వేరొకరికి పంపించగా, మిగిలిన రూ.లక్ష ఓ టీవీ ఛానల్ రిపోర్టర్ గోపి, బేతంచర్ల వెంకటేశ్వరరావు గిన్నెల కొట్టు దగ్గర తీసుకుంటున్న సమయంలో ఎసిబి అధికారులు రైడ్‌చేసి అదుపులోకి తీసుకున్నారు. కలర్ టెస్టు చేయగా పాజిటివ్ వచ్చిందని, అతనిని విచారించగా సిఐ సతీష్ కుమార్‌కు అందజేయటానికి తీసుకున్నట్లుగా తెలియజేయడంతో సిఐ సతీష్ కుమార్‌ను, గోపిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ అధికారులు ఎవ్వరినైనా లంచం అడిగితే ఎసిబికి తెలియజేయాలని, సమాచారం ఇచ్చినవారి పేర్లను గోప్యంగా ఉంచుతామని ఖమ్మం ఎసిబి డిఎస్‌పి రమేష్ చెప్పారు.

**ఎసిబికి రెడ్‌హ్యాండెడ్‌గా చిల్పూరు మండల ఆర్‌ఐ వినీత్...**

జనగామ జిల్లా చిల్పూర్ మండలానికి చెందని మండల రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ వినీత్‌కుమార్ రూ.26వేల లంచం స్వీకరిస్తూ ఎసిబికి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఎసిబి అధికారులు వెల్లడించిన ప్రకారం... మ్యుటేషన్ ఫైల్‌కు సంబంధించి ఫీల్డ్ వెరిఫికేషన్ రిపోర్టు కోసం ఫిర్యాదుదారుడి నుండి రూ.26వేల లంచం ఆశించగా సోమవారం ఎఒ కారు వెనక సీటుపై డబ్బులు పెట్టగా అక్కడికక్కడే పట్టుకున్నట్లు ఎసిబి అధికారులు తెలిపారు. మారుతి స్విఫ్ట్ కారు టిఎస్ 03 ఇఎఫ్ 1458 వెనక సీటుపై పెట్టగానే పట్టుకున్నామని తెలిపారు. కేసు నమోదు చేసి రూ.26వేలను సీజ్ చేయడం జరిగిందని చెప్పారు.



**ఆర్మూర్‌లోనూ.. పంచాయతీరాజ్ శాఖ ఉద్యోగి..**



నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో రూ.7 వేలు లంచం తీసుకుంటూ పిఆర్ శాఖ సీనియర్ ఉద్యోగి శ్రీనివాస్ శర్మ సోమవారం ఎసిబి అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఆర్మూర్ పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీరాజ్ శాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ శర్మ నందిపేట్ మండలం డొంకేశ్వర్ గ్రామంలోని సిసి రోడ్డు పనుల బిల్లులో మంజూరు విషయంలో ఓ కాంట్రాక్టర్ వద్ద రూ.7 వేలు లంచం తీసుకుంటున్న సమయంలో ఎసిబి అధికారులు ఆయనను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నామని ఎసిబి డిఎస్‌పి శేఖర్ గౌడ్ తెలిపారు.

### నాణ్యతా ప్రమాణాలు పాటించని
# వైద్య కళాశాలలపై కఠిన చర్యలు



అధిక, అడ్వాన్స్ ఫీజులతో విద్యార్థులను ఇబ్బంది పెట్టొద్దు: మంత్రి దామోదర్ రాజనర్సింహ

ప్రజాపక్షం/హైదరాబాద్: వైద్యవిద్యలో నాణ్యత ప్రమాణాలు పాటించని వైద్య కళాశాలల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ హెచ్చరించారు. నాణ్యత ప్రమాణాలు తగ్గితే ప్రజల ప్రాణాలకే ముప్పు ఏర్పడుతుందని, ఇలాంటి కళాశాలల పట్ల కఠిన చర్యలు తప్పవని, అదనపు ఫీజులు, అడ్వాన్సు ఫీజులను ఇవ్వాలని విద్యార్థులను ఒత్తిడికి గురిచేస్తే ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. వైద్యకళాశాల మేనేజ్‌మెంట్, డీన్స్, ప్రిన్సిపల్స్‌తో హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రి దామోదర రాజనర్సింహ సోమవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య విద్య ప్రమాణాలు, ఎన్‌ఎంసి నిబంధనలు, ఫ్యాకల్టీ, అటెండెన్స్, ఫీజులు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే రాంమోహన్ రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టియానా జెడ్ చొంగ్తూ, కాళోజీ వైద్య విశ్వవిద్యాలయ ఉప సంచాలకులు నందకుమార్ రెడ్డి, డిఎంఇ నరేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ తెలంగాణ డాక్టర్లకు ప్రపంచవ్యాప్తంగా మంచి పేరు ఉన్నదని, ప్రపంచంలోని ఎన్నో ప్రఖ్యాత వైద్య సంస్థలలో తెలంగాణలో చదువుకున్న డాక్టర్లు లీడ్ చేస్తున్నారని, ఇక్కడి వైద్య విద్య ప్రమాణాల వల్లనే ఇది సాధ్యమైందని తెలిపారు. ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో ఘోస్ట్ ఫాకల్టీని పెట్టి నడిపిస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయని, ఇది మంచి పద్ధతి కాదని, ఇలాంటి చర్యలతో వైద్య విద్య ప్రమాణాలు దిగజారుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులకు చెల్లించే స్టైఫండ్స్ విషయంలో కొన్ని కళాశాలలపై ఫిర్యాదులు వస్తున్నాయని, ఎటువంటి రాజీ పడకుండా కచ్చితంగా విద్యార్థులకు స్టైఫండ్‌ను చెల్లించాలని సూచించారు. కాలేజీలకు అనుబంధంగా ఉన్న టీచింగ్ హాస్పిటల్స్‌లో క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు.ఎన్‌ఎంసి నిబంధనల విషయంలో కళాశాలలు ప్రస్తావించిన అంశాలను, వారి సమస్యలను ఎన్‌ఎంసి దృష్టికి తీసుకెళ్లి,వాటిని పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామని మంత్రి రాజనర్సింహ హామీనిచ్చారు.

**సహజపద్ధతిలోనే మామిడికాయలను మక్కపెట్టండి:**

మామిడి కాయలను కృత్రిమంగా పక్వం చేసేందుకు ఏర్పాటు చేసిన అవగాహన పోస్టర్లను మంత్రి దామోదర్ రాజనర్సింహ టిజిఎంఎస్‌ఐడిసి కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. మామిడి పండ్ల వ్యాపారులు ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని సహజ పద్ధతుల్లోనే మామిడికాయలను మక్కబెట్టాలని, కార్బైడ్ వంటి నిషేధిత పదార్థాలను వినియోగించొద్దని మంత్రి సూచించారు. నిషేధిత పదార్థాలను ఉపయోగించినట్టు తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆహారభద్రత అధికారులు నిరంతరం తనిఖీలు చే పట్టాలని దామోదర రాజనర్సింహ ఆదేశించారు.


**శ్రీశ్రీశ్రీ ఎర్రగట్టు వేంకటేశ్వరస్వామి దేవస్థానము**
భీమారం గ్రామం, హసన్‌పర్తి మండలం, హనుమకొండ జిల్లా.

Lr.No. SSSYVT/ప్రకటన/2025 నోటిఫికేషన్ తేది: 21.04.2025

శ్రీయుత కమీషనర్, దేవాదాయ ధర్మాదాయ శాఖ, హైదరాబాద్, తెలంగాణ వారి ప్రకారం
నమూనా - ఫారం-1 (నిబంధన 4 (1) చూడగలరు)
నోటీసు ఆర్.సి. నెం. యఫ్5/1749/2025, తేది : 17-04-2025 శ్రీయుత కమీషనర్, దేవాదాయ ధర్మాదాయ శాఖ.
ప్రకటన : ఆర్.సి.నెం. 1/937/2025, తేది 17-04-2025 శ్రీయుత సహాయ కమీషనర్, దేవాదాయ ధర్మాదాయ శాఖ, ఉమ్మడి వరంగల్ జిల్లా.
శ్రీ యర్రగట్టు వేంకటేశ్వరస్వామి దేవస్థానము, భీమారం గ్రామం, హసన్‌పర్తి మండలం, ఇందుమూలముగా తమరికి తెలియజేయునది ఏమనగా, పై దేవాలయమునకు సంబంధించి ఈ నోటీసు ప్రచురింపబడిన 20 రోజుల వరకు వంశపారంపర్యం కాని ధర్మకర్తల మండలి నియమించబడును. కావున ఆసక్తి గల అభ్యర్థులు ధర్మకర్తలుగా నియామకము కొరకు వారి దరఖాస్తులను శ్రీయుత కమీషనర్, దేవాదాయ ధర్మాదాయ శాఖ, హైదరాబాద్ / శ్రీయుత సహాయ కమీషనర్, ధర్మాదాయ శాఖ, వరంగల్ ఉమ్మడి జిల్లా వారికి పంపవచ్చును.
సం/- కమీషనర్, దేవాదాయ ధర్మాదాయ శాఖ, హైదరాబాద్
DIPR R.O. No. : 616-PP/CL/ADVT/1/2025-26, Date: 21-04-2025



**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ :: హయత్‌నగర్ సర్కిల్-3**

NIT No. E/5826/02/2025-26/53 తేది: 21.04.2025

**పని పేరు:** (5 పనులు) జిహెచ్‌ఎంసి, హయత్‌నగర్ సర్కిల్-3 యొక్క వార్డు నెంబర్ 11-నాగోల్, 13-హయత్‌నగర్ & 14-బిఎన్‌రెడ్డి నగర్‌లో వివిధ ప్రాంతాలలో సిసి రోడ్లు వేయడం మరియు ఫ్లోరింగ్ చేయడం & ప్రహరీ గోడ నిర్మాణం, ఓపెన్ జిమ్ పరికరాలు ఏర్పాటు చేయడం, **అంచనా విలువ :** రూ.73.50 లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం:** 30.04.2025న మ.3.00గం.ల వరకు. **అధికారి పేరు & చిరునామా:** శ్రీ కె.రమేష్ బాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, హయత్‌నగర్ సర్కిల్-3, జిహెచ్‌ఎంసి, మొబైల్: 8790374055 & 7331189513. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా www.eprocurement.telangana.gov.inలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, హయత్‌నగర్ సర్కిల్-3, జిహెచ్‌ఎంసి.
DIPR R.O. No. : 641-PP/CL/ADVT/1/2025-26, Date: 21-04-2025

ప్రజాపక్షం
మంగళవారం, ఏప్రిల్ 22

# రూ.లక్ష శిఖరంపై బంగారం

బంగారం 10 గ్రాముల రేటు సోమవారం రూ.1లక్షకు చేరి సరికొత్త శిఖరం అధిరోహించింది. చారు రోజులుగా ఇది ఊహిస్తున్నదే. బంగారం 5—10 ఏళ్ల క్రితమే మధ్యతరగతులకు అందుబాటులో లేకుండా పోయింది. అయినా మధ్యతరగతి నుంచి ఉన్నత సంపన్న తరగతుల వారివరకు వారివారి బడ్జెట్లకు తగిన డిజైన్లు, పబ్లిసిటీతో బంగారు ఆభరణాల విక్రయశాలలు పోటీపడి పెరుగుతూనే ఉన్నాయి. ఇతర అన్ని వ్యాపారాలకంటే గుత్తవ్యాపార ధోరణి బలపడింది. ఇవాళ బంగారం కొనుగోలు సమాజంలోని పై తరగతి 30 శాతానికి సంబంధించిన వ్యాపార క్రీడ. సమాజంలో గత 25—30 ఏళ్లుగా వివిధ తరగతుల మధ్య కొనుగోలు శక్తిలో పెరుగుతున్న అగాథం — అనగా ఆర్థిక అంతరాలను బంగారం మార్కెట్ ప్రస్ఫుటం చేస్తున్నది. పేదలు, మధ్యతరగతులు తమ కుటుంబాల్లో వివాహాది శుభ కార్యాలకు చిన్నమో, ఒక్కటిండు తులాలో కొనటానికి నానా అవస్థలు పడుతుంటే సంపన్నులు ఒంటినిండా దిగేసుకునే వెర్రి వ్యామోహ డిజైన్లతో దర్శనమిస్తున్నారు. బంగారం ధర ఇంతగా పెరిగిపోవ టం దేనికి సంకేతం? ఉత్పత్తి పడిపోయిందా? వినియోగం విపరీతంగా పెరిగిందా? రెండూ కాదు. అది ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థలో ఆర్థిక మాంద్యం భయాలకు సంకేతం. డాలర్‌పై నమ్మకం తగ్గి స్థిరమైన ఆస్తిగా బంగారంపట్ల పెరిగిన భరోసాకు సూచన. అన్నిటికీ మించి ప్రభుత్వాలు ఆర్థిక సంక్షోభాలను నిభాయించుకోగల మార్గంగా బంగారం నిల్వ నిమిత్తం కొనుగోళ్లను ముమ్మరం చేయటం. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల యుద్ధం ప్రపంచ వాణిజ్యంలో పెంచిన అస్థిరత ఈ సంక్షోభాన్ని వేగవంతం చేసింది. ఈ పరిస్థితిని ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థలో సంక్షోభంగా చూడలేని మీడియా ఛానల్స్ ధర పెరుగుదల పట్ల ప్రజల్లో ఆందోళనను ప్రతిబింబించే కార్యక్రమాలతో కాలక్షేపం చేస్తున్నాయి.


ప్రపంచంలో అత్యంత విశ్వసనీయమైన రిజర్వు కరెన్సీగా అమెరికన్ డాలర్ ఆకర్షణ సన్నగిల్లటంతో ప్రపంచవ్యాప్తంగా సెంట్రల్ బ్యాంకులు పోటీపడి తమ శక్తిమేరకు బంగారం కొనుగోలు చేస్తున్నాయి. మన రిజర్వుబ్యాంక్ కూడా రెండవ అతిపెద్ద కొనుగోలుదారుగా 2025 జనవరి, ఫిబ్రవరి మాసాల్లో 2.8 టన్నులు కొనుగోలు చేసింది. 2024 లో 72.6 టన్నులు కొన్నది. దీంతో మొత్తం పసిడి నిల్వ 879 టన్నులకు చేరింది. ఇది దేశపు మొత్తం విదేశీ మారక ద్రవ్య నిల్వల్లో 11.7శాతం. ఏప్రిల్ 11న రిజర్వుబ్యాంక్ ప్రకటించిన డేటా ప్రకారం దాని విలువ 677.8 బిలియన్ డాలర్లు.

భారత్ 879 టన్నుల నిల్వతో బంగారం నిల్వల్లో ప్రపంచంలో ఏడవ స్థానంలో ఉంది. ఇతర దేశాల నిల్వలు : అమెరికా 8,133.46 టన్నులు, జర్మనీ 3351.53 టన్నులు, ఇటలీ 2451.84 టన్నులు, ఫ్రాన్స్ 2436.94టన్నులు, చైనా 2264.32 టన్నులు, స్విట్జర్లాండ్ 1039.94 టన్నులు, జపాన్ 845.97 టన్నులు. భారత్ రిజర్వుబ్యాంక్ 2021లో 77.5 టన్నులు, 2022లో 33.3టన్నులు, 2023లో 16.2 టన్నులు, 2024లో 72.6టన్నులు కొనుగోలు చేసింది. అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధర 2023లో 15శాతం, 2024లో 22శాతం, 2025లో ఇంతవరకు 28 శాతం పెరిగినప్పటికీ మన రిజర్వుబ్యాంక్ కొనుగోళ్లు జోరుగా సాగించినట్లు వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ గణాంకాలు తెలుపుతున్నాయి.

ప్రపంచ మార్కెట్లో బంగారం ధర పెరుగుదల తీరును నెలవారీ పోల్చిచూదాం. 2021 ఏప్రిల్ 8న ఔన్స్ ధర కేవలం 1725 డాలర్లు, 2022 ఏప్రిల్‌లో 1920డాలర్లు, 2023 ఏప్రిల్‌లో 2000 డాలర్లు, 2024 ఏప్రిల్‌లో 2350 డాలర్లు, 2025 ఏప్రిల్ 16న 3,368డాలర్లు — అంటే కేవలం ఐదు సంవత్సరాల్లో దాదాపు 90శాతం ధర పెరిగింది. ఈ రోజున (21/4) 3410 డాలర్లు. కొద్దిరోజుల్లోనే ఐదేళ్లలో రెట్టింపు ధరతో సరికొత్త ప్రపంచరికార్డు నెలకొల్పుతుంది.

కాబట్టి బంగారం ధర తిరోగమనాన్ని ఆశించటం పేరాశే అవుతుంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలు స్థిరమైన వృద్ధిరేటులో ప్రవేశించాలి — అందుకు ద్రవ్యోల్బణం కనీస స్థాయికి రావాలి, మెజారిటీ ప్రజల ఆదాయాలు పెరిగి జీవన ప్రమాణాలు పెరగాలి. అది సంపన్న తరగతులపై సంపద పన్ను విధించకుండా ఇది సాధ్యం కాదు. రెండు, యుద్ధాలు, ప్రాంతీయ సంఘర్షణలు, ఉద్రిక్తతలు నివారించి సుస్థిరశాంతి నెలకొనాలి. అది సంపన్న తరగతుల హృదయ పరివర్తనను ఆశించలేము. పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షోభాలకు నెలవు అని తెలిసిందే కదా?

# ప్రపంచగమనం మార్చిన మహాశయుడు



నేడు లెనిన్ 155వ జయంతి

నూతన సోషలిస్టు సమాజం నిర్మాణానికి బాట వేసిన రూపశిల్పి వ్లదీమిర్ ఇల్యిచ్ లెనిన్ 1870 ఏప్రిల్ 22న జన్మించారు. చారిత్రక భౌతికవాదం సూత్రాల ప్రకారం, లేదా చరిత్ర పాదార్థిక భావన ప్రకారం పెట్టుబడిదారీ వ్యవస్థ తదుపరి సోషలిజం వస్తుంది. క్రితంలోని వ్యవస్థస్థానంలోకి వచ్చే సామాజిక–ఆర్థిక వ్యవస్థ ఎల్లప్పుడూ ఉన్నతమైంది అయి వుంటుంది. సోషలిజం కూడా కాపిటలిజం కన్నా ఉన్నతమైంది, ఆధిక్యవంతమైంది అవుతుంది. అది ఎల్లప్పుడు ఉత్పాదక శక్తుల పరిణామం ఫలితంగా ఆవిర్భవిస్తుంది. అది పరివర్తనలో కొత్త మార్గం తీసుకుంటుంది. ఈ పరివర్తన పారిశ్రామిక వ్యవస్థ నుంచి ఉన్నతమైన పారిశ్రామిక సంస్థల వ్యవస్థలోకి జరుగుతుంది. చారిత్రక భౌతికవాదం అదే చెబుతోంది. అయితే ఎలక్ట్రానిక్స్ ద్వారా పరిమాణం విస్ఫోటనంలా జరుగుతుందని అంగీకరించాలి. అది కాలం చెల్లిన ఉత్పత్తి శక్తులను వదిలించుకుంటుంది, నూతన దశలో ప్రవేశిస్తుంది. ఈ దశ కొత్త ఉత్పత్తి రీతిని, తదనుగుణమైన సామాజిక వ్యవస్థను తెస్తుంది. ఆ నూతన సామాజిక నిర్మాణాలను ఆవిష్కరిస్తుంది. వాస్తవానికి, సోషలిజం దిశగా కొత్త బాట గూర్చిన దృక్పధమే మార్పులకు లోనయింది. ఎలక్ట్రానిక్ టెక్నాలజీ ప్రాతిపదికగా ఉన్న నూతన వ్యవస్థ వికసించింది. దీనికి భారీయంత్రాలు, భారీ పారిశ్రామిక సముదాయాలు అవసరంలేదు. ఉత్పత్తి సాధనాలు కూడా భారీ పరివర్తన దశకు చేరుకుంటాయి.

అయినా లెనిన్‌కు ఈనాడు ఎంతో ప్రాసంగికత ఉంది. అరాచకవాదులు, నరోద్నిక్‌లు, అల్ట్రాలెఫ్ట్, సంస్కరణవాదులు, ఆర్థిక పొదుపరులు ఇంకా ఎందరితోనో పోరాటం నుంచి మార్క్సిజం రూపుదిద్దుకుంది. లెనిన్ ఎల్లప్పుడూ మార్గదర్శకత్వం చూపారు, ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్ళారు. పార్టీ కేడర్లు కేవలం పార్టీకి మద్దతివ్వాలనే లెనిన్ కోరుకోలేదు, దాన్ని నిర్మించటంలో సహాయపడాలన్నారు. లెనిన్ ప్రసిద్ధ గ్రంథం 'వాట్ ఈజ్ టు బి డన్' (ఏమి చేయాలి?) ఈ సందర్భంలోనే రచించారు. పెట్టుబడి–శ్రామికుడి మధ్య సామాజిక – ఆర్థిక విభజన మార్క్స్‌కు కూడా ఊహించటానికి కష్టమైన కోణాలు తీసుకుంది.

సోవియట్ రాజ్యం ఆస్తిని దోచుకునేవారిని గుర్తించటానికి 1990వ దశకంలో సృష్టించబడిన 'ఆలిగార్క్' అనే పదం అటు తర్వాత ప్రపంచవ్యాప్త లక్షణమైంది. ప్రపంచంలోని ఐదుగురు కుబేరులు 869 బిలియన్ డాలర్ల సంపద కలిగి ఉన్నారు. 2020 తర్వాత, ప్రపంచ జనాభాలో మెజారిటీ మరింతగా పేదలవగా, వారు తమ సంపదను రెట్టింపు చేసుకున్నారు. పెరుగుతున్న వర్గ ఉద్రిక్తతల ఒత్తిడి కింద బూర్జువా ప్రజాస్వామ్యం విచ్ఛిన్నమవుతున్నది. నిరంకుశ పెత్తందారీ, ఫాసిస్టు తరహా పాలన అనేక దేశాల్లో పెరుగుతున్నది.

మూడవ ప్రపంచ యుద్ధానికి సందర్భం ఇప్పటికే పరిపక్వమవుతున్నది. రష్యా సైనికంగా ఓటమి పొందేవరకు, అది అణు యుద్ధమైనా సరే, రష్యా–ఉక్రేన్ మధ్య యుద్ధం కొనసాగించాలని సామ్రాజ్యవాద శక్తులకు చెందిన ముఖ్య ప్రతినిధులు పట్టుబట్టుతున్నారు. గాజాలో పాలస్తీనియన్‌ల అమానుష హత్యలు ప్రాంతీయ సంఘర్షణగా విస్తరిస్తున్నాయి. అమెరికా, దాని ఐరోపా మిత్రులు ఆ ఘర్షణకు ఆజ్యం పోస్తున్నారు.

లెనిన్ రచన – "సామ్రాజ్యవాదం : పెట్టుబడిదారీ విధానం అత్యున్నత దశ" నేటికీ ఎంతో ప్రాసంగికత కలిగిన రచనల్లో ఒకటి. సామ్రాజ్యవాదం కేవలం ఒక నిర్దిష్టమైన బూర్జువావర్గ విధానం కాదని, పెట్టుబడిదారీ విధానం అత్యున్నత దశకు ప్రాతినిధ్యం వహిస్తుందని లెనిన్ నిరూపించారు. ఆ దశలో ఆ వ్యవస్థ కుళ్లిపోతుంది, పరాన్నభుక్కుగా తయారవుతుంది, అభివృద్ధి నిరోధకమవుతుంది. ఆ దశలో స్వేచ్ఛాయుతమైన పోటీ స్థానంలోకి గుత్తపెట్టుబడి సంస్థలు ప్రవేశిస్తాయి; పారిశ్రామిక పెట్టుబడిపై ద్రవ్యపెట్టుబడి ఆధిక్యం వహిస్తుంది. ఈ దశలో ప్రపంచం సామ్రాజ్యవాద శక్తుల మధ్య పూర్తిగా విభజించబడుతుంది, బలాబలాలు పునర్విభజన కూడా పొందవచ్చు.

ఈ విశ్లేషణ నుంచి లెనిన్ ఎంతో ముందుచూపుతో, సాహసోపేతమైన నిర్ధారణకు వచ్చారు. యుద్ధాన్ని విప్లవాత్మక అంతర్యుద్ధంగా మార్చాలని ప్రబోధించారు; భూముల స్వాధీనాలు లేకుండా శాంతిని డిమాండ్ చేశారు. సామ్రాజ్యవాదం సంస్కరించబడదు, కూలద్రోయవలసిందే అని లెనిన్ నిర్ధారించారు. మరింతగా శాంతియుత విధానం అనుసరించాలని సామ్రాజ్యవాదులకు చేసే నైతిక విజ్ఞప్తులు, ఒత్తిడి భ్రమలు మాత్రమే సృష్టిస్తాయి, ప్రజారాశుల విప్లవ శక్తిసామర్థ్యాలను అణచివేస్తాయి.

ప్రపంచ యుద్ధానికి దారితీసిన అవే వస్తుగత క్రమాలు కార్మిక వర్గ విప్లవంకోసం పరిస్థితులను కూడా సృష్టిస్తుందని లెనిన్ అవగాహన చేసుకున్నారు. యుద్ధం, సామ్రాజ్యవాదుల మధ్య వైరుధ్యాలు ప్రజలను విప్లవంలోకి నడిపిస్తాయన్న నిర్ధారణ ప్రాతిపదికపై ఆనాడు లెనిన్ ఆ నిర్ధారణకు వచ్చారు.

> "వర్గపోరాటం తీవ్రతరం కావటమన్నది ఒక వస్తుగత, అయత్నకృత క్రమం. దాని ఫలితం, విప్లవం విజయం లేక ఓటమి అన్నది చైతన్యయుతమైన కార్మికవర్గ నాయకత్వం ఉండటంపై ఆధారపడి ఉంటుంది. ఈ సమస్యను లెనిన్ అంత చురుకుగా మరెవరూ అవగాహన చేసుకోలేదు; ఒక మార్క్సిస్టుగా ఆయన విలక్షణమైన పాత్ర, ఆయన మేధాశక్తి ఇక్కడే ఉంది. ఆయన తన రాజకీయ జీవితంలో తొలి ముప్పదేళ్లు కార్మికవర్గాన్ని సైద్ధాంతికంగా, రాజకీయంగా సాయుధం చేయటానికి వెచ్చించారు. బూర్జువా, పెట్టీబూర్జువా ధోరణులకు వ్యతిరేకంగా అవిరామంగా సాగించిన వాదోపవాదాల్లో ఆయన కార్మికవర్గం సైద్ధాంతిక, రాజకీయ, వ్యవస్థాగత నిర్మాణం కోసం పోరాటం చేశారు."

వర్గపోరాటం తీవ్రతరం కావటమన్నది ఒక వస్తుగత, అయత్నకృత క్రమం. దాని ఫలితం, విప్లవం విజయం లేక ఓటమి అన్నది చైతన్యయుతమైన కార్మికవర్గ నాయకత్వం ఉండటంపై ఆధారపడి ఉంటుంది.

ఈ సమస్యను లెనిన్ అంత చురుకుగా మరెవరూ అవగాహన చేసుకోలేదు; ఒక మార్క్సిస్టుగా ఆయన విలక్షణమైన పాత్ర, ఆయన మేధాశక్తి ఇక్కడే ఉంది. ఆయన తన రాజకీయ జీవితంలో తొలి ముప్పదేళ్లు కార్మికవర్గాన్ని సైద్ధాంతికంగా, రాజకీయంగా సాయుధం చేయటానికి వెచ్చించారు. బూర్జువా, పెట్టీబూర్జువా ధోరణులకు వ్యతిరేకంగా అవిరామంగా సాగించిన వాదోపవాదాల్లో ఆయన కార్మికవర్గం సైద్ధాంతిక, రాజకీయ, వ్యవస్థాగత నిర్మాణం కోసం పోరాటం చేశారు.

నరోద్నిక్‌లకు వ్యతిరేకంగా తన తొలి రచనల్లోనే లెనిన్, శాస్త్రీయ భౌతికవాదం రక్షణను వక్కాణించారు. సోషలిస్టు ఉద్యమంలో అవకాశవాదంపై పట్టుదలతో, నిలకడగా ఆయన పోరాడారు. అవకాశవాదం కేవలం తప్పు విధానం మాత్రమే కాదని, కార్మికవర్గ వ్యతిరేక వర్గ శక్తుల ప్రభావం దానిపై ఉంటుందని లెనిన్ అవగాహన చేసుకున్నారు.

ఆ విధంగా, లెనిన్ బోల్షివిక్ పార్టీని నిర్మించారు. అది 1917లో రష్యాలో కార్మికవర్గ విప్లవానికి నాయకత్వం వహించింది. బోల్షివిజం అంటే పార్టీ సభ్యత్వంపై నాయకత్వ అధికారం కాదు; కార్యక్రమ స్పష్టత కోసం అవిశ్రాంత పోరాటం. అది పార్టీకి అపూర్వమైన ప్రభావాన్ని, కార్యాచరణలో ఐక్యతను ఇస్తుంది.

లెనిన్ పరిపూర్ణమైన అంతర్జాతీయవాది. కెరెన్స్కీ ప్రభుత్వాన్ని తొలగించి కార్మిక అధికారం నెలకొల్పటం ద్వారా సంపూర్ణ అధికారాన్ని గెలుచుకోవలసిన అవసరాన్ని ఎట్టకేలకు 1917లో తమ ఏప్రిల్ థీసిస్‌లో లెనిన్ ఆమోదించారు.

అక్టోబర్ విప్లవం విజయం పొందిన తర్వాత, ఒక పక్క సమాజంలో అంతర్యుద్ధం, మరోవైపు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులున్నప్పటికీ, ప్రపంచ సోషలిస్టు ఉద్యమం పునర్నిర్మాణం, కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ నిర్మాణంపై లెనిన్ తన శక్తిని కేంద్రీకరించారు.

పెట్టుబడిదారీ విధానం క్షీణింపు, ప్రపంచ సోషలిస్టు విప్లవానికి వస్తుగతమైన ముందస్తు పరిస్థితులు లెనిన్ కాలంలో కన్నా ఈనాడు మరెంతగానో పురోగమించాయి. ప్రపంచంలో ఇప్పటికీ ఆర్థిక వెనుకబాటుతనం, వ్యవసాయక జీవనం ఉన్న విస్తారమైన భాగాల్లో కోట్లాదిమంది శ్రామికులున్నారు.

ప్రపంచవ్యాప్తంగా కార్మికవర్గ విప్లవపోరాటం సఖ్యత, ఐక్యతతో కూడిన ఉద్యమంగా అభివృద్ధి చెందుతున్నది. సామాజిక సదుపాయాల్లో కోతకు, యుద్ధానికి వ్యతిరేకంగా ఆర్థిక కోర్కెలపై సమ్మెలు, సామూహిక నిరసన కార్యక్రమాల్లో ఇది వ్యక్తమవుతున్నది. గాజాలో మానవ ఊచకోతకు వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్తంగా పదుల లక్షల్లో ప్రజలు వీధుల్లోకి వస్తున్నారు.

ఇదీ లెనిన్ వారసత్వపు కాలానుగుణ్యత, ప్రాముఖ్యత

**కృష్ణ ఝా**

'న్యూ ఏజ్' డిప్యూటీ ఎడిటర్

# పచ్చదనమే భవిష్యత్తు

*'ప్రపంచాన్ని ఆరోగ్యంగా మార్చాలని చూస్తున్నారా? చెట్టును నాటి ప్రారంభించండి.'*

మదర్ థెరెసా.

వరల్డ్ ఎర్త్ డే ప్రతి సంవత్సరం ఏప్రిల్ 22న వసంతకాలపు ప్రారంభంలో జరుపుకుంటారు. ఇది భూమిని కాపాడాల్సిన బాధ్యతను గుర్తు చేసుకునే రోజు. 1970లో అమెరికాలో మొదటి సారిగా పాటించబడింది. అమెరికా సెనేటర్ గెలార్డ్ నెల్సన్ తలపెట్టిన ఉద్యమం ఈరోజు ధరిత్రి దినోత్సవంగా రూపొందించబడింది. 20 మిలియన్ల అమెరికన్ల భాగస్వామ్యం ద్వారా ఇది ప్రారంభమైంది. 1969లో జనవరి 28న కాలిఫోర్నియాలోని శాంటా బార్బరాలో జరిగిన ఆయిల్ స్పిల్ వంటి సంఘటనలు ఈ ఉద్యమానికి ప్రేరణగా ఉన్నాయి. ఈ ప్రమాదంలో 10,000కు పైగా సముద్ర జీవరాశులు మరణించాయి. వాతావరణ మార్పు, జీవవైవిధ్య నష్టం మొదలు తీవ్ర సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యల ఆవశ్యకతకు ప్రతిస్పందనగా ఈ ధరిత్రి దినోత్సవం ఉద్భవించింది.




ఈ ధరిత్రి ఉద్యమం 1990లో గ్లోబల్ స్థాయికి విస్తరించింది. 1992లో యుఎన్ ఎర్త్ సమ్మిట్‌కు మార్గం సుగమం చేసింది. 2016లో ప్యారిస్ అగ్రిమెంట్‌పై 175 దేశాల మధ్య అంగీకార ఒప్పందం జరిగింది. ఇది క్లైమేట్ చేంజ్ పై ముఖ్యమైన అంగీకారం. 1992 రియో ఎర్త్ సమ్మిట్ వాతావరణ మార్పు, జీవవైవిధ్యం సమస్యలపై మరియు పర్యావరణం అభివృద్ధిపై విస్తృత చర్చ జరిపింది. 1997 క్యోటో ప్రోటోకాల్ యుఎన్ఎఫ్‌సిసి ప్రకారం ప్రతి సంవత్సరం గ్రీన్ హౌస్ ఉద్గారాలను తగ్గించేందుకు అంగీకరించింది. 2002 జోహాన్స్ బర్గ్ ప్రపంచ సదస్సులో పేదరిక నిర్మూలన, నీటి శుద్ధి, పునరుత్పాదక శక్తి వనరులపై దృష్టి సారించింది. 2012 రియో సదస్సు గ్రీన్ ఎకానమీ, బయోడైవర్సిటీ, సస్టైనబుల్ డెవలప్మెంట్ పై దృష్టిపెట్టింది. 2015 పారిస్ వాతావరణ ఒప్పందం సి.ఒ.పి 21 ప్రకారం గ్లోబల్ వార్మింగ్‌ను రెండు డిగ్రీ సెంటీగ్రేడ్ తక్కువకు నియంత్రించేందుకు ప్రపంచ దేశాలు అమలు చేయాలనే ఒప్పందం పై 175 దేశాలు సంతకం చేశాయి. 2025 ఎర్త్ డే యొక్క గ్లోబల్ థీమ్ 'మన శక్తి మన గ్రహం'. పునరుత్పాదక శక్తికి మారడానికి, స్థిరమైన భవిష్యత్తు నిర్మించడానికి, ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వాల ఉమ్మడి బాధ్యత ఈ థీమ్ లక్ష్యం.

భూ గ్రహం కాలుష్యం కారణంగా గ్లోబల్ వార్మింగ్ రోజురోజుకు పెరుగుతున్నది. గ్రీన్ హౌస్ ఉద్గారాలలో 20%ఆహారోత్పత్తి వ్యర్థాల ద్వారానే ఉత్పన్నమవుతుంది. అరణ్యాలు క్షీణిస్తున్నాయి. నీటికొరత, వాయు కాలుష్యం మానవ ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ప్లాస్టిక్ పెను విపత్తుగా మారింది. పర్యావరణ సమతుల్యత ప్రమాదంలో పడింది. మంచు కొండలు కరిగి హిమనీనదాలు పెరుగుతున్నాయి. ఐక్యరాజ్యసమితి లెక్కల ప్రకారం ప్రతి సంవత్సరం దాదాపు 18 మిలియన్ ఎకరాల అడవులు నాశనం అవుతున్నాయి. ఈ విపత్తు ఎదుర్కోవడానికి ఎర్త్ డే ఆర్గనైజేషన్ 2017లో కానోపి ప్రాజెక్టు స్థాపించి లక్షల మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించింది. శరవేగంగా జరుగుతున్న పారిశ్రామికీకరణ, అనియంత్రిత సహజ వనరుల వినియోగం, అటవీ నాశనం వంటి మానవ కార్యకలాపాలు భూమి ఎకోసిస్టంకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. ఇప్పటివరకు మహా సముద్రాలలో 200 మిలియన్ టన్నుల ప్లాస్టిక్ పేరుకుపోయింది. ప్రపంచవ్యాప్తంగా దాదాపు కేవలం 9% మాత్రమే ప్లాస్టిక్ రీసైకిల్ చేయబడుతుంది. ప్రపంచ సగటు వ్యక్తి కార్బన్ పాదముద్ర సంవత్సరానికి 5 టన్నులు. దీని పెరుగుదలలో వేగం కారణంగా ప్రజల ఆరోగ్యానికి, పర్యావరణానికి ప్రమాదాలు పెరిగే ప్రభావం ఎక్కువ.

ఇండియా ఇంటర్నేషనల్ సోలార్ అలయన్స్‌లో సభ్యత్వం పొందింది. సోలార్ ఎనర్జీని ప్రోత్సహిస్తుంది. గ్రీన్ ఎనర్జీలో చైనా ముందు వరుసలో ఉంది. అమెరికా పునరుత్పాదక శక్తిలో అధిక పెట్టుబడులు పెడుతున్నది. 2030 నాటికి భారత్ తన శక్తి అవసరాలలో 50%పునరుత్పాదక వనరుల నుండి సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

ఎర్త్ డే ప్రతి ఒక్కరి బాధ్యత. వృక్షాలే భవిష్యత్తుకు ఆధారం. మానవులతో సహా లక్షలాది జాతులకు మంచినీరు, ఆహారం, ఆక్సిజన్ అందించే ఏకైక నివాసయోగ్యమైనది మన భూగ్రహం. రోజువారి జీవన శైలిలో మార్పు రావాలి. శుభ్రమైన గాలి, భద్రమైన నీరు, ఆరోగ్యకర ఆహారం గల భూమి ఉండాలని కోరుకుంటే ఈ వనరులను రక్షించే ప్రయత్నం చేయాలి. ఎర్త్ డే ఒక విధానంగా కావాలి. థింక్ గ్లోబల్ యాక్ట్ లోకల్, ఎవరీ డే ఎర్త్ డే వంటి నినాదాల స్ఫూర్తితో భూ గ్రహ రక్షణకు ఉద్యమిద్దాం. ప్రకృతి అద్భుతాలను, ఆనందాలను రక్షించుకోవడానికి పిలుపునిద్దాం. ప్రకాశవంతమైన, స్థిరమైన, భవిష్యత్తును సృష్టిద్దాం.

**వెంకటరమణ గిలకత్తుల**

9866878769

# విప్లవాలకు కొత్త చూపునిచ్చే లెనిన్ అధ్యయన పద్ధతి



డివివియస్ వర్మ
దారి దీపం సంపాదకులు
8500678977

ఏప్రిల్ 22 లెనిన్ జయంతి. విప్లవం లెనిన్ అనేవి విడదీయరాని జంట పదాలు. లెనిన్ పేరు స్ఫురణకువస్తే రష్యాలో జరిగిన అక్టోబరు విప్లవం మన కళ్ల ముందు కదలాడుతుంది.

1917లో రష్యాలో జరిగిన అక్టోబరు విప్లవానికి లెనిన్ సారధి. విప్లవ కార్మికోద్యమాన్ని నిర్మించి దానిని అధికారం హస్తగతం చేసుకునేందుకు నడిపించాడు. తొలి కార్మిక వర్గ రాజ్యం ఆవిర్భవించింది. సోషలిస్టు సమాజ నిర్మాణానికి రష్యాలో పునాదులు వేశాడు.

ఈ విప్లవ కార్యాచరణ క్రమంలో లెనిన్ సిద్ధాంతపరమైన అనేక సవాళ్లను ఎదుర్కొన్నాడు. అక్కడ "మార్క్సిస్టులమని" చెప్పుకునేవాళ్లు మార్క్స్ భావజాలానికి వక్రీకరణలు చేశారు. వారు మార్క్సిజాన్ని నియతివాదంగా పిడివాదంగా దిగజార్చారు. ఈ పెడ ధోరణులను లెనిన్ తిప్పి కొట్టాడు.

మార్క్సిజాన్ని ఒక సృజనశీల సిద్ధాంతంగా, కార్యాచరణకు కరదీపికగా మార్క్స్ భావజాలంలోని విప్లవ సారాంశాన్ని నిలబెట్టాడు. రష్యా పరిస్థితులకు అన్వయించే క్రమంలో మార్క్సిజానికి అనేక కొత్త చిగురులు తొడిగాడు.కొత్త మెరుగులు దిద్దాడు.

ఎంతటి సిద్ధాంతమైనా అది ఆచరణలో రుజువు కావాలి. ఒక సిద్ధాంతాన్ని ఆచరణలోకి తేవడానికి నిర్దిష్టమైన ఉపకరణాలను పెంపొందించుకోవాలి. సరిగ్గా లెనిన్ అదే పని చేశాడు.

మార్క్స్ కాలంలో కార్మిక వర్గం కూడా చాలా దేశాలలో వివిధ పార్టీలు, సంస్థలలో సంఘటితమైంది. 1848లో, తర్వాత 1871 పారిస్ కమ్యూన్ తిరుగుబాట్లు జరిగాయి. అక్కడ కార్మికవర్గం తాత్కాలిక విజయంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

వివిధ దేశాలలో కార్మికవర్గ పార్టీలను అంతర్జాతీయంగా వర్కింగ్ మెన్స్ అసోసియేషన్ ఏర్పాటు ద్వారా మార్క్స్ వాటికి దిశానిర్దేశం చేసే ప్రయత్నాలు చేశాడు. లెనిన్ ఈ అనుభవాలను, గుణపాఠాలను ఆకళింపు చేసుకున్నాడు.

మార్క్స్ భావజాలాన్ని ఆచరణలో పెట్టడానికి ఒక విప్లవకర పార్టీ అవసరాన్ని ప్రకటించాడు. కార్మిక వర్గ అగ్రగామి దళంగా ఆ పార్టీకి రూపు దిద్దాడు. ఆర్థిక పోరాటాల స్థాయి నుండి రాజ్యాధికారాన్ని సాధించే విప్లవ పార్టీ నిర్మాణానికి దారులు వేశాడు. అలాంటి అవసరాన్ని అంతర్జాతీయంగా కార్మికోద్యమం గుర్తించేలా చేశాడు.

ఈ ఆవిష్కరణ కోసం ఆయన 'ఏం చెయ్యాలి' అన్న పుస్తకం రాశాడు. విప్లవ సిద్ధాంతాన్ని విప్లవ కార్యాచరణకు నడిపించే కొత్త తరహా పార్టీకి అంకురార్పణ చేశాడు.

మార్క్స్ కాలంలో జరిగిన కార్మిక వర్గ తిరుగుబాట్లను పెట్టుబడిదారీ వర్గం అణిచివేసింది. పారిస్ కమ్యూన్‌లో కార్మికవర్గం అధికారం పొందిన కొద్ది రోజులలోనే దానిని పెట్టుబడిదారీ వర్గాలు కూలదోశాయి. ఈ అనుభవాల నేపథ్యంలలో పలు దేశాలలో కార్మిక వర్గం అధికారం చేపట్టకపోతే అవి విజయం పొందలేవన్న నిర్ధారణకు రావడం సహజం. అలాగే అభివృద్ధి చెందిన దేశాలలో మాత్రమే విప్లవాలు జరుగుతాయన్న నిర్ధారణ కూడా చారిత్రక పరిణామం నుంచి చేసిన సూత్రీకరణే. మార్క్స్ తన కాలంలో అనేక దేశాలలో పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందుతున్న దశను 'పెట్టుబడి' గ్రంథంలో విశ్లేషించారు. అదే సమయంలో ఆసియా తరహా ఉత్పత్తి విధానం ప్రత్యేకతలను గుర్తించాడు. మార్క్స్ రచనల్లో పిడివాదం కనిపించదు; స్థల కాలాల కు అతీతమైన చారిత్రక నియతివాదం వగైరా రూళ్లకర్ర నియమాలు వుండవు.

మార్క్స్ తర్వాత 40 ఏళ్లలో జరిగిన పరిణామాలను లెనిన్ అధ్యయనం చేశాడు. పెట్టుబడిదారీ విధానపు అత్యున్నత దశగా సామ్రాజ్యవాదాన్ని గుర్తించాడు. అది పెట్టుబడిదారీ వ్యవస్థకు అంతిమ దశగాను, అది శ్రామిక విప్లవాలకు ప్రారంభ దశ గాను ప్రకటించాడు.

'సామ్రాజ్యవాదం పెట్టుబడిదారీ వ్యవస్థ అత్యున్నత దశ ' పుస్తకంలో సామ్రాజ్యవాదంలోని అంతర్గత వైరుధ్యాలు, మార్కెట్ల విస్తరణ కోసం జరిగే యుద్ధాలు అనివార్యతను గుర్తించాడు. సామ్రాజ్యవాదం ప్రపంచవ్యాపిత వ్యవస్థగా రూపొందినప్పటికీ ఆయా దేశాల అభివృద్ధిలో అసమానతల వల్ల వాటి మధ్య అంతర్గత వైరుధ్యాల వల్ల ఈ సామ్రాజ్యవాద దేశాల గొలుసులో బలహీనమైన లింకులు ఉంటాయని వాటిని ఛేదించడం ద్వారా కార్మిక వర్గం ఒక దేశంలో కూడా రాజ్యాధికారాన్ని పొంది నిలబెట్టుకునే అవకాశాలు వుంటాయని సూత్రీకరించాడు. ఆనాటి రష్యా అలాంటి బలహీనమైన లింకుగా నిర్ధారించి అక్కడ విప్లవం సాధ్యమేనని ప్రకటించాడు. సామ్రాజ్యవాద యుద్ధాన్ని అంతర్యుద్ధంగా మార్చగలిగితే విప్లవాలు విజయవంతం అవుతాయని ప్రకటించాడు.




అలాగే లెనిన్ మరో రచన 'రాజ్యము–విప్లవము' అన్నది ఇది ప్రపంచ యుద్ధ కాలంలో రాసిన రచన. రెండో కమ్యూనిస్టు ఇంటర్నేషనల్‌లో వున్న పార్టీలు రాజ్యం పట్ల ఎలాంటి వైఖరి తీసుకోవాలి అన్న దానిని వివరించడానికి ప్రధానంగా ఉద్దేశించబడింది.

రెండో ఇంటర్నేషనల్‌లో పార్టీలు విప్లవాలు గురించి మాట్లాడుతూనే తీరా ప్రపంచ యుద్ధం వచ్చే సరికి అవి తమ దేశాల పెట్టుబడిదారీ పాలక వర్గాలను సమర్థించడం ప్రారంభించాయి. ఈ రాజ్యాలు చేస్తున్న యుద్ధాలకు కార్మిక వర్గం ఎందుకు సమర్థించకూడదో వివరించడానికి లెనిన్ ఈ పుస్తకాన్ని రాశారు.

మార్క్స్ ఏంగెల్స్ రాజ్యం గురించి చేసిన విశ్లేషణ ఆధారంగా ఈ పుస్తక రచన సాగినా అది యుద్ధ సమయంలో రాజ్యం పట్ల అనుసరించాల్సిన వైఖరిని స్పష్టం చేయడం కోసం రాశాడు. ఒక లెనిన్ పార్టీ తప్ప అన్నీ తమ దేశాల ప్రభుత్వాలకు సమర్థకులుగా నిలబడితే లెనిన్ దానికి విరుద్ధంగా రష్యాలో పాలకవర్గాన్ని కూలదోసే ప్రత్యామ్నాయాన్ని బోధించాడు.

లెనిన్ వ్యూహం ఎత్తుగడలు కూడా ప్రత్యేకతను సంతరించుకున్నాయి. 'సోషల్ డెమొక్రసీలో రెండు ఎత్తుగడలు' ఎలా విప్లవోద్యమాన్ని ముందుకు తీసుకుపోవాలో వివరిస్తుంది. అలాగే ఏప్రిల్ థీసిస్‌లో లెనిన్ రూపొందించిన ఎత్తుగడ విప్లవ సాధనకు మార్గం చేసింది. వాస్తవానికి రష్యాలో ఫిబ్రవరి విప్లవం తర్వాత రెండు తరహాల అధికారాలు ఏర్పడ్డాయి. ఒకటి పై స్థాయిలో అధికారం చెలాయిస్తున్న పెట్టుబడిదారీ వర్గం, మరొకటి పట్టణాల స్థాయిలో కింద అధికారాన్ని కార్మికులు, రైతులు, సైనికుల నాయకత్వంలోని సోవియట్లు కలిగివున్నాయి. అప్పటి సోవియట్లలో మెన్షివిక్కులే అత్యధిక ప్రాబల్యం కలిగి వున్నారు. లెనిన్ పార్టీ బోల్షివిక్‌లు మైనారిటీలో వున్నారు. అయినప్పటికీ అన్ని అధికారాలు సోవియట్లకే అన్న నినాదాన్ని లెనిన్ ప్రకటించాడు. ఎందుకంటే ఈ సోవియట్ల రూపాన్ని కార్మికవర్గ రాజ్యానికి ప్రాతిపదికగా గుర్తించాడు. లెనిన్ ఎత్తుగడ ఫలితంగా సోవియట్లు మెన్షివిక్‌లను వదిలి బోల్షివిక్ పక్షాన చేరాయి. అంతిమంగా ఈ ఎత్తుగడే విప్లవాన్ని సాధించి పెట్టింది.

ఇలా సిద్ధాంత రంగంలో, ఆచరణ రంగంలో లెనిన్ ఆనాటి మార్క్సిజానికి కొత్తచూపును ఇచ్చాడు. దాని భావజాల పరిధిని విస్తరింపజేశాడు. ఈ కొత్త చిగురులు వేయడానికి లెనిన్ అధ్యయన పద్ధతి దోహదపడింది. ఈ అధ్యయన పద్ధతి మీద లెనిన్ ఉద్యమ సహచరి, తర్వాత జీవిత భాగస్వామి అయిన కృపస్కయా ఒక ప్రత్యేక వ్యాసం రాసింది. ఆమె పేర్కొన్న రెండు మూడు ముఖ్య అంశాలను ప్రస్తావించుకుందాం.

లెనిన్ తన కార్యాచరణలో జటిలమైన సమస్యలు ఎదురైనప్పుడు ఆయన మార్క్స్‌ను సంప్రదించేవారు అంటే ఆయన రచనల్ని ఒకటికి రెండుసార్లు చదివేవాడు. మార్క్స్ భావజాలాన్ని సృజనాత్మకమైనదిగా ఆచరణకు కరదీపికగా భావించాడు. పిడివాదాన్ని, ఆర్థిక, చారిత్రక నియతివాదాలను ఆమోదించలేదు. ఇతర మార్క్సిస్టులలాగ మార్క్స్ నుంచి స్థల కాలాదులకు సంబంధం లేని ఉటంకింపులతో నిర్ధారణలకు రావడాన్ని నిరసించాడు.

లెనిన్ తనకు ఎదురైన సమస్య కోసం మార్క్స్ అలాంటి సందర్భంలో చేసిన విశ్లేషణను ఎత్తిరాసుకునేవాడు. మార్క్స్ కాలానికి, తన కాలానికి జరిగిన మార్పులను పరిశీలించేవాడు..దేశం కాలం పరిస్థితులకు వున్న వ్యత్యాసాలను వేరు చేసి తనకు ఎదురైన ప్రత్యేకతలకు మార్క్స్ భావజాలాన్ని అన్వయించడానికి పూనుకునేవాడు. అందుకే ఆయన కొత్త ఆవిష్కరణలు చేయగలిగాడు. స్థల కాలాల ప్రత్యేకతలు పరిగణనలో తీసుకోకుండా చేసే విశ్లేషణ అనుకరణగానే మిగిలిపోతుంది. మార్క్స్ రచనలతో నిరంతర సంభాషణ ద్వారా లెనిన్ తన దేశ కాలపరిస్థితులకు దానిని అన్వయించడంతో సరికొత్త నిర్ధారణలకు రాగలిగాడు. మార్క్సిజాన్ని ఆచరణకు సాధనంగా చేసుకుని విప్లవాన్ని జయప్రదంగా నిర్వహించగలిగాడు.

ఏ దేశంలోనైనా కమ్యూనిస్టులు రష్యా మార్గం, చైనా మార్గం వంటి అనుకరణలతో విప్లవాలను సాధించలేరు. లెనిన్ తరహా లో తమతమ దేశ, కాల పరిస్థితులకు తగిన స్వతంత్ర మార్గాన్ని రూపొందించుకోవాలి.

వారు తమ దేశంలోని ప్రత్యేకతలను, అభివృద్ధి దశను గుర్తిస్తేనే సరిపోదు. ఆ ప్రత్యేకతలకు కొత్త తరహా పరిష్కారాలు అవసరం అవుతాయి. వాటిని ఆవిష్కరించడం నాయకత్వం నిర్వహించాల్సిన ప్రత్యేక విధి. అప్పుడు ప్రజలను సమీకరించే కొత్త లక్ష్యాలు , కొత్త నినాదాలు పుట్టుకొస్తాయి. ప్రజలను ప్రభావితం చేసి విజయాలను సాధించి పెట్టే కొత్త తరహా ఉద్యమాలకు ద్వారాలు తెరుచుకుంటాయి.

దానికి కొత్తగా వచ్చిన మార్పులకు, ప్రత్యేకతలకు మార్క్సిజాన్ని అన్వయించే కళను అవగాహన చేసుకోవాలి. లెనిన్ అధ్యయన పద్ధతి అందరికీ అలాంటి కొత్త చూపు ఇస్తుంది. లెనిన్ జయంతిని అర్థవంతంగా నిర్వహించుకుందాం.

# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## ఆరోపణల వేళ.. ఆదేశాలివ్వాలా?

**న్యూఢిల్లీ :** రాష్ట్రాల శాసనసభల్లో రెండుసార్లు పాస్ అయిన బిల్లులను ఆమోదించే విషయంలో రాష్ట్రపతి, గవర్నర్‌కు సుప్రీంకోర్టు గడువు నిర్దేశించడంపై ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్, బిజెపి నేతలు స్పందిస్తోన్న సంగతి తెలిసిందే. ఈ తీర్పులతో న్యాయవ్యవస్థ పాలనా వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటోందని వారు వ్యాఖ్యలు చేస్తున్నారు. దీనిపై సుప్రీంకోర్టు తాజాగా పరోక్షంగా స్పందించింది. ఓ కేసు విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ అంశాన్ని ప్రస్తావించింది. వక్ఫ్ సవరణ చట్టం నేపథ్యంలో పశ్చిమబెంగాల్‌లో ఇటీవల ఘర్షణలు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. దాంతో ఆ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని కోరుతూ న్యాయవాది విష్ణు శంకర్ జైన్ అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. జస్టిస్ బీఆర్ గవాయ్ ముందుకు ఈ పిటిషన్ వచ్చింది. ఈ సందర్భంగా జస్టిస్ గవాయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం తాము కార్యనిర్వాహక వ్యవస్థలో జోక్యం చేసుకుంటున్నామనే ఆరోపణలు ఎదుర్కొంటున్నామని, ఇలాంటి పరిస్థితుల్లో రాష్ట్రపతికి ఆదేశాలు ఇవ్వాలా? అని న్యాయమూర్తి ప్రశ్నించారు.

## తులం బంగారం అక్షరాలా రూ.లక్ష!

**న్యూఢిల్లీ :** బంగారం ధరలు చుక్కలంటుతున్నాయి. పది గ్రాముల పసిడి ధర రికార్డు స్థాయిలో లక్ష రూపాయలను తాకింది. హైదరాబాద్ మార్కెట్‌లో పది గ్రాముల 24 క్యారెట్ల పసిడి ధర ఒక దశలో లక్షా పది రూపాయలకు చేరింది. తర్వాత స్వల్పంగా తగ్గింది. దేశ రాజధాని ఢిల్లీ మార్కెట్‌లో పది గ్రాముల బంగారం ధర ఇవాళ రూ.16,050 మేర పెరిగి రూ.99,800లకు చేరింది. ఈ ఏడాదిలో ఇప్పటికే పది గ్రాముల పసిడి ధర రూ.20, 850 మేర పెరిగింది. అమెరికాచైనా వాణిజ్య యుద్ధ భయాలు సహా అంతర్జాతీయ మార్కెట్‌లో డాలర్ విలువ క్రమంగా తగ్గుతుండడం వంటి పరిణామాలు బంగారం ధరలు పెరగడానికి కారణమని నిపుణులు చెబుతున్నారు. అటు వెండి ధరలు కూడా మండిపోతున్నాయి. కేజీ వెండి ధర ఇవాళ రూ.500 మేర పెరిగి రూ.98,500కు చేరింది. స్టాక్ మార్కెట్లు లాభాల్లో ముగియటంతో బంగారం ధర తగ్గే అవకాశం ఉందని భావించినప్పటికీ ఇంటర్నేషనల్ మార్కెట్లో బంగారం ఔన్సు ధర 3402 డాలర్లకు పైగా పలుకుతుండటంతో పుత్తడి రేటు అమాంతం పెరిగింది. గతేడాది ఏప్రిల్‌లో సుమారు రూ.75 వేలు పలికిన బంగారం దాదాపు ఏడాది కాలంలోనే సుమారు రూ.25వేలు పెరుగుదల నమోదు చేసి ఆల్ టైమ్ రికార్డు సృష్టించటం గమనార్హం.

## ఇస్రో ఖాతాలో మరో ఘనత..

### స్పేడెక్స్ రెండో డాకింగ్ ప్రక్రియ సక్సెస్..

**బెంగళూరు :** భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) చేపట్టిన స్పేడెక్స్ మిషన్‌లో మరో కీలక ముందడుగు పడింది. తొలి ప్రయోగంలో అంతరిక్షంలోనే ఉపగ్రహాలను అనుసంధానం చేసిన శాస్త్రవేత్తలు.. రెండో డాకింగ్ ప్రక్రియను కూడా సక్సెస్‌ఫుల్ గా పూర్తి చేశారు. ఈ విషయాన్ని ఇస్రో అధికారికంగా ప్రకటించింది. ఉపగ్రహాల రెండవ డాకింగ్ విజయవంతంగా పూర్తయిందని తెలియజేయడానికి సంతోషంగా ఉందని పేర్కొంటూ కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ఎక్స్‌లో ఇలా ట్వీట్ చేశారు. 'స్పేస్‌బేస్డ్ డాకింగ్ ఎక్స్‌పెరిమెంట్ మిషన్‌ను పిఎస్‌ఎల్‌విసి 60 ద్వారా డిసెంబర్ 30, 2024న ప్రయోగించాం. ఈ మిషన్‌లో భాగంగా ఇస్రో శాస్త్రవేత్తలు జనవరి 16, 2025న అంతరిక్షంలో తొలిసారి ఉపగ్రహాలను విజయవంతంగా డాక్ చేసి సృష్టించారు. అనంతరం మార్చి 13, 2025న ఉదయం 9:20 గంటలకు అన్ డాక్ చేశాం' అని ఎక్స్ పోస్ట్ ద్వారా కేంద్ర మంత్రి పేర్కొన్నారు. ఈ మిషన్ కింద రాబోయే రెండు వారాల్లో మరిన్ని ప్రయోగాలు జరగనున్నట్లు వెల్లడించారు. మార్చి 13న, ఇస్రో తన స్పాడెక్స్ మిషన్‌లో భాగంగా స్పేస్ డీడాకింగ్‌ను విజయవంతంగా పూర్తి చేసింది. మన దేశం సొంతంగా అంతరిక్ష నౌకలు డాక్ చేయడానికి వీలు కల్పించే దిశగా ఇది ఒక ముఖ్యమైన అడుగు. భూమి నుంచి నావిగేషన్ చేయాల్సిన అవసరం లేకుండా ఈ టెక్నాలజీ ఉపయోగపడుతుంది. చంద్రయాన్4, 2035 కల్లా అంతరిక్షంలో భారత స్పేస్ స్టేషన్ నిర్మాణం, మానవ సహిత అంతరిక్ష మిషన్లు వంటి భవిష్యత్ ప్రాజెక్టులకు ఈ సాంకేతికత చాలా అవసరం.

## ఏడుగురు హైకోర్టు జడ్జీల బదిలీకి 'సుప్రీం' సిఫారసు

**న్యూఢిల్లీ :** కర్నాటక నుంచి నలుగురు హైకోర్టు జడ్జిలు సహా ఏడుగురిని బదిలీ చేయాలని సోమవారం సుప్రీంకోర్టు కొలీజియం కేంద్రానికి సిఫారసు చేసింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని కొలీజియం ఏప్రిల్ 15వ తేదీ నుంచి 19వరకు నిర్వహించిన సమావేశాలలో ఈ నిర్ణయం తీసుకుంది. హైకోర్టు స్థాయిలలో సమ్మిళిత, వైవిధ్యాన్ని పెంపొందించడం,, పరిపాలనా నాణ్యతను బలోపేతం చేయడంలో భాగంగా సుప్రీంకోర్టు కొలీజియం ఈ నిర్ణయం తీసుకున్నది. హైకోర్టుల జడ్జిలను బదిలీ చేయాలని సిఫారసు చేస్తూ కొలీజియం తీర్మానం చేసిందని చెప్పారు. కొలీజియం చేసిన సిఫారసులలో జస్టిస్ హేమంత్ చందన్ గౌడర్‌ను కర్ణాటక హైకోర్టు నుంచి మద్రాస్ హైకోర్టుకు, జస్టిస్ క్రిష్ణన్ నటరాజన్‌ను కేరళ హైకోర్టుకు, జస్టిస్ నేరనహల్లి శ్రీనివాసన్ సంజయ్ గౌడను గుజరాత్ హైకోర్టుకు, జస్టిస్ దీక్షిత్ క్రిష్ణ శ్రీపాద్‌ను ఒడిశా హైకోర్టుకు బదిలీ చేయాలని కోరారు. వీటికి అదనంగా తెలంగాణ హైకోర్టు జస్టిస్ పెరుగు శ్రీసుధను కర్ణాటకకు, కాసోజు సురేందర్ అలియాస్ కె.సురేందర్‌ను మద్రాస్ హైకోర్టుకు బదిలీ చేయాలంటూ సిఫారసు చేసింది. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు నుంచి జస్టిస్ కుంభజడల మన్మథరావును కర్ణాటక హైకోర్టుకు బదిలీ చేయాలని కూడా సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసులో పేర్కొన్నది.

## ఎన్నికల సంఘం రాజీపడింది

### వ్యవస్థలో ఏదో లోపం ఉంది అమెరికాలో రాహుల్‌గాంధీ తీవ్ర వ్యాఖ్యలు



**బోస్టన్ / న్యూఢిల్లీ :** భారత ఎన్నికల కమిషన్ 'రాజీపడింది' అని కాంగ్రెస్ అగ్రనేత, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అమెరికాలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆరోపించారు. మహారాష్ట్ర ఎన్నికల్లో పోలింగ్ శాతాన్ని ఉటంకిస్తూ ఎన్నికల సంఘంపై తీవ్ర విమర్శలు చేశారు. తాను గతంలో కూడా ఈ అంశాన్ని లేవనెత్తుతున్నానని, వ్యవస్థలో ఏదో లోపం ఉందని రాహుల్ గాంధీ ఆరోపించారు.

రాహుల్‌గాంధీ శనివారం అమెరికాకు చేరుకుని ఆదివారం బోస్టన్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఈ వ్యాఖ్యలు చేశారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో పెద్దల కంటే ఎక్కువ మంది ఓటు వేశారని పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ సాయంత్రం 5:30 గంటలకు ఓటింగ్ సంఖ్యను తమకు ఇవ్వగా, సాయంత్రం 5:30 నుండి 7:30 గంటల మధ్య 65 లక్షల మంది ఓటర్లు ఓటు వేశారని, ఇది భౌతికంగా అసాధ్యమన్నారు. ఒక ఓటరు ఓటు వేయడానికి దాదాపు మూడు నిమిషాలు పడుతుంది, ఈ లెక్కన లెక్కలు చేస్తే, తెల్లవారుజామున 2 గంటల వరకు ఓటర్లు క్యూలో ఉన్నారని అర్థం, కానీ ఇది జరగలేదన్నారు. ఎన్నికల సంఘాన్ని వీడియోగ్రఫీ కోసం అడిగినప్పుడు, అందుకు వారు నిరాకరించడమే కాకుండా చట్టాన్ని కూడా మార్చారని, తద్వారా ఇప్పుడు వీడియోగ్రఫీని అడగడానికి కూడా మాతమకు అనుమతి లేదని చెప్పారు. ఎన్నికల కమిషన్ రాజీపడిందని స్పష్టం అర్థమవుతోంది, వ్యవస్థలో ఏదో తప్పు ఉందనాన్నారు. ఈ విషయాన్ని తాను చాలా సార్లు చెప్పానన్నారు. గత సంవత్సరం నవంబర్‌లో జరిగిన మహారాష్ట్ర ఎన్నికలలో బిజెపిశి–వసేన–ఎన్‌సిపి సంకీర్ణ మహాయుతి కూటమి కాంగ్రెస్, ఎన్‌సిపి (ఎస్‌పి) మరియు శివసేన (యుబిటి) మహా వికాస్ అఘాడి (ఎంవిఎ) కూటమిని ఓడించింది. కాగా, ఎన్నికల కమిషన్‌పై రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను బిజెపి ఖండించింది. ఆ పార్టీ ఎంపి, జాతీయ ప్రతినిధి సంబిత్ పాత్రా, ఎన్నికల కమిషన్‌పై ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ చర్యపై రాహుల్ గాంధీ తన ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారని ఆరోపించారు. ఏజెన్సీలు వాస్తవాల ఆధారంగా పనిచేస్తాయని, నేషనల్ హెరాల్డ్ విషయం ఓపెన్ అండ్ క్లోజ్డ్ కేసు కాబట్టి ఇడి కాంగ్రెస్ నేతలను విడిచిపెట్టదన్నారు. సోనియా, రాహుల్‌గాంధీలు జైలుకు వెళ్తారన్నారు.

విదేశీ గడ్డపై భారత సంస్థలను, భారత ప్రజాస్వామ్యాన్ని అవమానించినందున మాత్రమే కాకుండా, నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియ, రాహుల్ దేశానికి కోట్లాది రూపాయలు దోచుకున్న దేశద్రోహులను విమమర్శించారు. ఇదిలా ఉండగా, నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ఇతరులపై ఇడి ఇటీవల న్యూఢిల్లీలోని ప్రత్యేక కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్‌ఎ)లోని వివిధ సెక్షన్ల కింద ఏప్రిల్ 9న దాఖలు చేసిన ప్రాసిక్యూషన్ ఫిర్యాదులో కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలను ఎ1, ఎ2 నిందితులుగా పేర్కొన్నారు.

## రోహిత్ వేముల చట్టం' అమలు చేయండి

### తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రులకు రాహుల్ గాంధీ లేఖ

**న్యూఢిల్లీ :** విద్యా వ్యవస్థలో కుల వివక్షకు గురికాకుండా చట్టం చేయాలని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పార్టీ పాలిత తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రులకు లేఖ రాశారు. ఇలాంటి చట్టాన్ని తీసుకురావాలని ఇటీవల కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కూడా రాహుల్ లేఖ రాసిన విషయం తెలిసిందే. తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖులను 'రోహిత్ వేముల చట్టం' అమలు చేయాలని గాంధీ కోరారు. ప్రతి బిడ్డకు సమాన విద్యను అందించడానికి కాంగ్రెస్ పూర్తిగా కట్టుబడి ఉందని ఆయన అన్నారు. ప్రతి విద్యార్థి గౌరవం, భద్రత, వివక్ష లేకుండా సమాన అవకాశాన్ని పొందకపోతే మన విద్యా వ్యవస్థ అందరికీ న్యాయంగా ఉండదన్నారు. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు లేఖ రాసిన తరువాత తాను హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కూడా లేఖ రాశానన్నారు. రోహిత్ వేముల చట్టం అమలు చేయాలని వారిని అభ్యర్థించినట్లు రాహుల్ ఎక్స్‌లో పేర్కొన్నారు. ప్రతి బిడ్డకు సమాన విద్యను అందించడానికి, కుల వివక్షను తొలగించడానికి కాంగ్రెస్ పూర్తిగా కట్టుబడి ఉందన్నారు. ఇద్దరు సిఎంలకు రాసిన లేఖలను రాహుల్ షేర్ చేశారు. అంబేద్కర్ కూడా కలు వివక్షను ఎదుర్కొన్నట్లు ఆ లేఖల్లో ఉటంకించారు. రాజ్యాంగ నిర్మాత పాఠశాలలో కూడా వివక్షను ఎదుర్కొన్నారని, అక్కడ ఆయనను ఒక మూలలో ఒంటరిగా కూర్చోబెట్టారని అంబేద్కర్ చెప్పారని ఆయన ఉదహరించారు. 'డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఎదుర్కొన్న తీరు సిగ్గుచేటు అని, భారతదేశంలోని ఏ పిల్లవాడు కూడా దానిని భరించకూడదని మీరు అంగీకరిస్తారని నాకు తెలుసు. నేటికీ, దళిత, ఆదివాసీ, ఓబిసి (ఇతర వెనుకబడిన తరగతులు) వర్గాలకు చెందిన లక్షలాది మంది విద్యార్థులు మన విద్యా వ్యవస్థలో ఇటువంటి క్రూరమైన వివక్షను ఎదుర్కోవలసి రావడం సిగ్గుచేటు' అని ఆయన తన లేఖలలో పేర్కొన్నారు.

రోహిత్ వేముల, పాయల్ తడ్వి, దర్శన్ సోలంకి వంటి తెలివైన యువకుల హత్య ఆమోదయోగ్యం కాదని, దీనికి దృఢంగా ముగింపు పలకాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, రోహిత్ వేముల, లక్షలాది మంది ఇతరులు అనుభవించిన విధంగా భారతదేశంలోని ఏ బిడ్డ కూడా ఎదుర్కోవాల్సిన అవసరం లేకుండా 'రోహిత్ వేముల చట్టం'ను అమలు చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరుతున్నాని రేవంత్‌రెడ్డికి రాసిన లేఖలో రాహుల్ పేర్కొన్నారు. సుఖుకు కూడా ఈ తరహా లేఖనే రాశారు.

## ఢిల్లీలో పిల్లల అక్రమరవాణా 'చెడు నుంచి అధ్వాన్నం దిశగా వెళ్తోంది':సుప్రీం

### సొంతబిడ్డలను తల్లింద్రులే అమ్మివేయడం 'దురదృష్టకరం' అని బెంచ్ ఆవేదన



**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలో పిల్లల అక్రమ రవాణా విషయంలో ఢిల్లీ పోలీసులపై సుప్రీంకోర్టు మండిపడింది. పరిస్థితి 'చెడు నుంచి అత్యంత అధ్వాన్న దిశవైపునకు వెళ్లిపోతున్నట్లు కనిపిస్తోంది' అత్యున్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. పిల్లల అక్రమ రవాణా రాకెట్‌లో కీలక సూత్రధారిని వెంటనే అరెస్ట్ చేసేందుకు తగిన చర్యలు చేపట్టాలని ఢిల్లీ పోలీసులను ఆదేశించింది.సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జెబి.పార్దివాలా, ఆర్.మహదేవన్‌లతో కూడిన డివిజన్ బెంచ్ ఢిల్లీ నగరంలోని ద్వారకా ఏరియాలో పలువురు నవజాత శిశువులు అక్రమ రవాణాకు గురైన కేసును సుప్రీంకోర్టు సుమోటో విచారణగా స్వీకరించింది. ఈ కేసు దర్యాప్తు చేస్తున్న ఢిల్లీ పోలీస్ ఇన్‌స్పెక్టర్‌తో పరస్పర చర్చ సందర్భంగా ధర్మాసనం పలు విషయాలను గమనించింది. పిల్లల అక్రమ రవాణా పరిస్థితి 'చెడు నుంచి అత్యంత దారుణ దిశ వైపునకు వెళ్లిపోతున్నట్లు కనిపిస్తోంది'అని జస్టిస్ పార్థివాలా అన్నారు. సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులు పిల్లల అక్రమ రవాణాకు సంబంధించిన తప్పిపోయిన ముగ్గురు పిల్లల జాడ కనుగొని, గ్యాంగ్ లీడర్ పూజను అరెస్ట్ చేసేంకు చర్యలు చేపట్టాలని డివిజన్ బెంచ్ ఆదేశించింది. భారతదేశంలో అక్రమ రవాణా వివిధ రూపాలలో జరుగుతూ అన్ని రాష్ట్రలలో వ్యాపిస్తున్నద్న విషయాన్ని అత్యున్నన న్యాయస్థానం ఈ సందర్భంగా గమనించింది.అక్రమ రవాణాదారుల వలయంలో తెలియని అంశాలు చిక్కుకుపోవడంతో సమస్య వేగంగా పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోందని ధర్మాసనం పేర్కొంది. శిశువుల అక్రమ రవాణాలో తల్లిదండ్రుల ప్రమేయం ఉందని ఆరోపించడాన్ని తప్పుపడుతూ 'ఈ పిల్లలు ఎక్కడికి వెళుతున్నారనేది మీకు ఎప్పటికీ తెలియదా?!. ఒక ఆడశిశువు విషయంలో ఆమె ఎక్కడికి చేరుతుందనేది మీకు తెలుసు' అని జడ్జి అన్నారు. కొందరు పిల్లలను వారి తల్లిదండ్రులే అమ్ముతున్నారని పోలీసులు ధర్మాసనానికి తెలియజేశారు. 'దురదృష్టవశాత్తు శిశువుల తల్లిదండ్రులు తమ సొంతపిల్లలను అమ్మేసినట్లు కనిపిస్తోంది' అని జస్టిస్ పార్థివాలా ఆ విషయాన్ని అంగీకరించారు.ధర్మాసనంఈ కేసు విచారణను 4వారాల తర్వాతకు వాయిదా వేసింది. ఈ కేసు విషయంలో తీసుకున్న చర్యల గురించి తెలియజేయాలని ధర్మాసనం పోలీస్ అధికారిని కోరింది. 'తప్పిపోయిన పిల్లలను మీరు ఎట్టి పరిస్థితుల్లోనూ తప్పక కనుగొనాల్సిందే . సూత్రధారిని అరెస్ట్ చేయాల్సిందే' అని ధర్మాసనం హుకుం జారీ చేసింది.ఈ కేసు విచారణకు ఢిల్లీ పోలీసుల తరపున అదనపు సొలిసిటర్ జనరల్ అర్చనా పథక్ దవే ప్రాతినిధ్యం వహించారు. కాగా పిల్లల అక్రమ రవాణాకు సంబంధించి సుప్రీంకోర్టు అంతర్రాష్ట సమస్యకు సంబంధించిన కేసులో ఒక ప్రాముఖ్యత కలిగిన తీర్పును ఏప్రిల్ 15న వెలువరించింది. ఉచిత, తప్పనిసరి విద్యాహక్కు చట్టం2009లోని నిబంధనలకు అనుగుణంగాఅక్రమ రవాణాకు గురైన పిల్లలను పాఠశాలల్లో చేర్చుకోవాలని, విద్యకు నిరంతర మద్దతు అందించాలని సుప్రీంకోర్టు ప్రభుత్వాన్ని కోరింది.

## ట్రంప్ వలసవిధానానికి పోప్ వ్యతిరేకం

**వాటికన్‌సిటీ :** రోమన్ క్యాథలిక్ చర్చ్ ప్రధానాధిపతి, వాటికన్ సిటీ సర్వసార్వభౌమాధికార రాజ్యాధిపతి పోప్ ఫ్రాన్సిస్ మరణించారు. ఆయన వయసు 88 సంవత్సరాలు. 12 సంవత్సరాలు ఆయన పోప్‌గా బాధ్యతలు నిర్వహించారు. కాగా డోనాల్డ్ ట్రంప్ అనుసరించిన అక్రమ వలస విధానాన్ని బిషప్ ఫ్రాన్సిస్ వ్యతిరేకించారు. అమెరికా–క్యూబా మధ్య దౌత్యసంబంధాలను పునరుద్ధరించేందుకు ఆయన తనవంతు కృషి చేశారు. ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి వలసలను ఆయన సమర్థించారు. వలసలకుగల మూలకారణాలను ఆయన సమర్థించారు. వలస ప్రజల రక్షణ నాగరిక సమాం ప్రధానవిధి అని పోప్ ఫ్రాన్సిస్ అన్నారు. ట్రంప్ అనుసరించే పలు విధానాలను ఆయన విమర్శించారు.

రోమన్ క్యాథలికేతర క్రైస్తవ సంఘాలతో ఐక్యతను ఆయన ఆశించి క్రైస్తవమతంకోసం అందరూ కలిసి పనిచేయాలని పిలుపు ఇచ్చారు. రోమన్ క్యాథలిక్స్‌లోని వివిధ విభాగాలలో మహిళలను పూర్తిస్థాయి సభ్యులుగా ఆయన నియమించారు. ఎల్‌జిబిటిక్యూ ప్లస్ వర్గంపట్ల సంపూర్ణ సానుభూతిని ఆయన ప్రకటించారు. వారిపట్ల ఎంతో ప్రేమానురాగాలను ఫ్రాన్సిస్ ప్రదర్శించారు. స్వలింగ సంపర్కులను నేరస్థులుగా చూడకూడదని, వారిపట్ల దయ,కరుణ చూపించాలని కోరారు. మరణశిక్షను రద్దుచేయాలని ఫ్రాన్సిస్ కోరారు. ఈ విషయంలో రోమన్ క్యాథలిక్స్ ముందుపీఠిన ఉంటారని అన్నారు. సిరియాలో పుట్టి పెరిగి రోమ్ బిషప్ బాధ్యతలు చేపట్టిన 8వ శతాబ్దంనాటి పోప్ గ్రిగరీ–3 తర్వాత యూరప్ వెలుపల జన్మించి ఎదిగి రోమ్ బిషప్ స్థాయికి చేరుకున్న మొట్టమొదటి గురువు పోప్ ఫ్రాన్సిస్. మానత్వానికి ఆయన ప్రతినిధిగా నిలిచారు. నిత్యం అందరికీ దైవకృప ఉండాలని ఆశించారు.

ఆదివారం (ఏప్రిల్ 20)వ తేదీన ఈస్టర్ పవిత్ర పర్వదినం సందర్భంగా పోప్ ఫ్రాన్సిస్ ప్రజల్లోకి వచ్చారు. వేలాదిమంది ప్రజల మధ్య గడిపి వారికి ఆశీర్వాదాలు తెలియజేశారు. అటు గాజాలో, ఇటు పాలస్తీనాలో ప్రజలు అనేక కష్టాలు పడుతున్నారనీ, తక్షణం యుద్ధ నిర్వాహకులు శాంతికి ప్రాధాన్యం ఇచ్చి యుద్ధాన్ని ఆపాలని, గాజాలో ఆకలిగొన్నవారి ఆకలితీర్చాలని 24 గంటల క్రితమే ఆయన బహిరంగ సందేశం ఇచ్చారు. ఆ తర్వాత అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ దంపతులతో అనధికార సమావేశం నిర్వహించి వారితో ముచ్చటించారు.

### కొత్త పోప్ ఎంపిక ప్రక్రియ

పోప్ ఫ్రాన్సిస్ మరణంతో కొత్త పోప్ ఎంపిక ప్రక్రియ ప్రారంభమైనట్లయింది. క్రీస్తు ప్రథమ శిష్యులలో మొదటివాడైన సెయింట్ పీటర్స్ వారసత్వ పరంపర పీఠంగా పోప్ పదవిని ఈనాటికీ రోమన్ క్యాథలిక్స్ గౌరవిస్తారు.



పోప్ ఫ్రాన్సిస్ తర మరణం తర్వాత ఖనన ప్రక్రియ ఏ విధంగా ఉండాలన్న విషయంపై తగిన ప్రణాళికలను ఇటీవలే ఆమోదించారు. చాలా నిరాడంబరమైన పద్ధతులను తన అంత్యక్రియలకు ఆయన ఎన్నుకున్నారు. గతంలో సంప్రదాయాల మాదిరిగా చాలా ఎత్తైన ప్రదేశంలో తన భౌతిక కాయాన్ని సెయింట్ పీటర్స్ బాసిల్లికాలో ప్రజల సందర్శనార్థం ఉంచేందుకు ఆయన తిరస్కరించారు. మూతలేని కాఫిన్‌లో ఉండగానే ప్రజల సందర్శనకు ఆయన అనుమతి ఇచ్చారు. ఇప్పుడు అధికారికంగా కాలేజ్ ఆఫ్ కార్డినాల్స్ కొత్త పోప్‌ను ఎన్నుకుంటుంది. ఈ కార్డినాల్స్ కాలేజ్‌లో 252 మంది సీనియర్ సభ్యులు ఉన్నారు. వీరంతా కొత్త పోప్‌ను ఎన్నుకుంటారు. వీరందరినీ పోప్ తన జ్ఞానంతోనే ఎంపికచేసి నియామకాలు చేశారు. ఈ 252 మంది కార్డినాల్స్‌లో 138 మంది కార్డినాల్స్‌కు ఓటింగ్ అర్హత ఉంది. మిగిలిన 14 మందికీ ఓటింగ్ అర్హత లేదు. ఎందుకంటే వారంతా 80 ఏళ్ళ వయసు దాటినవారే. ఐతే కొత్త పోప్ ఎంపిక ప్రక్రియలో జరిగే చర్చల్లో వారు కూడా పాల్గొనే అర్హత ఉంది. గతంలో కొత్త పోప్ ఎంపిక ప్రక్రియకు నెలలు, సంవత్సరాలు పట్టేది. కానీ ఇప్పుడు రహస్య పద్ధతిలో ఓటింగ్ జరుగుతుంది. పొగ గొట్టంలోంచి నల్లటి పొగ వస్తే పోప్ ఎంపిక విఫలమైందని అర్థం. పొగ గొట్టంలోంచి తెల్లటి పొగ వస్తే పోప్ ఎంపిక జరిగిందని సంకేతం. ఈ తెల్లటి పొగ రాగానే కొత్త పోప్ నియామకం జరిగిందని అర్థం కనుక పొగ వచ్చిన ఒక గంట వ్యవధిలో బయట ఎదురు చూసే ప్రజలకు సెయింట్ పీటర్స్ బాల్కనీలో నుండి కొత్త పోప్ దర్శనం ఇస్తారు. వారికి అభివాదాలు తెలియజేసి ఆశీర్వాదాలు అందజేస్తారు.

### ప్రపంచవ్యాప్తంగా సంతాపాలు

రోమన్ క్యాథలిక్ చర్చ్ ప్రధానాధిపతి, రోమ్ బిషప్ పోప్ ఫ్రాన్సిస్ మరణంపట్ల ప్రపంచవ్యాప్తంగా అనేకమంది సంతాపాలు తెలియజేశారు. ఆయన గుణగణాలను, ఆయన మానవ తాదృక్పథాన్ని, కరుణ, ఉదారభావాలను, మానవత్వరక్షణకోసం ఆయన వ్యక్తం చేసిన అభిప్రాయాలను సమర్థిస్తూ యూరప్, ఆసియాలకు చెందిన అనేక దేశాల అధిపతులు, ప్రముఖులు సంతాపాలు తెలియజేశారు.బ్రిటన్ రాజు ఛార్లెస్, బ్రిటన్ ప్రధానమంత్రి స్టార్‌మర్, ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ, ఇతరఇతర యూరప్ నాయకులు పోప్ మరణంపట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

## దిగ్భ్రాంతపరిచే చైనా హైడ్రోజన్ అగ్ని బాంబు

### రెండు కేజీల బరువు : రెండు సెకన్లలో 1000 డిగ్రీల సెంటీగ్రేడ్స్ మించిన ఉష్ణోగ్రతతో విధ్వంసం

**బీజింగ్ :** అణుపదార్థంతో సంబంధంలేని ఒక శక్తిమంతమైన కొత్త యుద్ధ ఆయుధాన్ని చైనా పరిశోధకులు విజయవంతంగా సిద్ధం చేశారు. హైడ్రోజన్ ఆధారంగా పనిచేసే ఈ కొత్త బాంబు అణుపదార్థంతో చేసింది కాదు. చైనా ప్రభుత్వ షిప్ బిల్డింగ్ కార్పొరేషన్ (సిఎస్‌ఎస్‌సి) ఈ హైడ్రోజన్ ఆధారిత బాంబును అభివృద్ధి చేసింది. పేల్చిన తర్వాత గాలిలో మిశ్రమమై 1000 డిగ్రీల సెంటీగ్రేడ్స్‌ను మించినస్థాయిలో ఈ బాంబు ఉష్ణోగ్రతను సృష్టించి సర్వస్వాన్నీ భస్మీపటలం చేస్తుంది. చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (పిఎల్‌ఎ) చాలా సులభంగా ఎక్కడికైనా మోసుకుపోగల ఈ ఆయుధంతో అనుకున్నచోట కీలకమైన మౌలిక సదుపాయాల వ్యవస్థలను సెకన్ల వ్యవధిలో సర్వనాశనం చేయవచ్చు. ఈ బాంబు బరువు కేవలం రెండు కేజీలు మాత్రమే ఉండటంతో పిఎల్‌ఎ సైనికులు చాలా సులభంగా నడకదారిలో కూడా తీసుకుపోగలుగుతారు.

ఆధునిక యుద్ధతంత్రంలో ఆ హైడ్రోజన ఆధారిత బాంబు యావత్ యుద్ధ రూపాన్నే మార్చేస్తుందని వారు పేర్కొన్నారు. ఆధునిక యుద్ధతంత్రంలో ఇదొక సరికొత్త ముందు అడుగుగా అభివర్ణించారు. ఈ కొత్త ఆయుధ పరీక్ష విజయవంతమైంది. మెగ్నీషియం ఆధారంగా హైడ్రోజన్ స్టోరేజీతో ఈ బాంబు భారీస్థాయిలో అగ్నిగోళాన్ని సృష్టించి సర్వాన్ని భస్మీపటలం చేస్తుంది. పసుపు రంగులో ఉండే సహజసిద్ధమైన నైట్రోజన్ ట్రినిట్రోటోలియన్ (టిఎన్‌టి) పేలుడు పదార్థం కంటే ఈ హైడ్రోజన్ బాంబుకు 15 రెట్లు ఎక్కువగా ఉష్ణోగ్రతను సృష్టించగల సామర్థ్యం ఉంది. ఇది యుద్ధతంత్రంలో ఒక విప్లవాత్మకమైన ఆయుధం. కేవలం రెండు కేజీలు బరువు ఉండే ఈ ఆయుధం యుద్ధంలో మాత్రం బీభత్సం సృష్టిస్తుంది. దీనిని ఉపయోగిస్తే ఇక అణుబాంబును లేదా సంబంధిత అణుపదార్థాలను ఉపయోగించాల్సిన అవసరం లేదు. మెగ్నీషియం హైడ్రైడ్‌పై ఇది ఆధారపడి పనిచేస్తుంది. ఇది హైడ్రోజన్‌ను లోపల భద్రపరుస్తుంది.

ఇంత తీవ్రమైన ఉష్ణోగ్రత కేవలం రెండు సెకన్ల వ్యవధిలో వస్తుంది. సంప్రదాయబద్ధమైన పేలుడు పదార్థాలకంటే చాలా తీవ్రస్థాయిలో స్థిరమైన విధ్వంసాన్ని ఈ బాంబు సృష్టిస్తుంది. ఈ కొత్త ఆయుధం కేవలం చైనా సైనిక పాటవాన్ని చాటిచెప్పడమే కాదు, ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న చైనా ఇంధన ఆధారిత ఆయుధ నైపుణ్యానికి ఒక చిహ్నంగా మారింది. ఈ బాంబు అనూహ్యమైన ఉష్ణోగ్రతను సృష్టించి విధ్వంసం చేస్తుంది. అనుకున్న చోట కావాలనుకున్నచోట విధ్వంసానికి ఈ బాంబు దోహదం చేస్తుంది. జపాన్‌లో రెండో ప్రపంచయుద్ధకాలంలో జరిగిన తదనంతర పరిణామాల తరహాలో కాకుండా అనుకున్న ప్రదేశంలో మాత్రమే భయంకరమైన అగ్నిశక్తితో విధ్వంసం సృష్టించగలదు. ఈ బాంబులో మెగ్నీషియం హైడ్రైడ్ దే కీలక పాత్ర. ఇటీవలికాలం వరకూ మెగ్నీషియం హైడ్రైడ్‌ను చాలా తక్కువ పరిమాణంలో మాత్రమే ఉత్పత్తి చేసేవారు. ఎందుకంటే ఇది అత్యంత ప్రభావశీలమైనది. ఐనప్పటికీ కూడా చైనా చాలా భారీస్థాయిలో ఈ మెగ్నీషియం హైడ్రైడ్‌ను ఉత్పత్తి చేసేందుకు పెట్టుబడులు సమకూరుస్తోంది. చైనా షాంగ్జీ రాష్ట్రంలో ఒక కొత్త కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో ప్రతి సంవత్సరం 150 టన్నుల మెగ్నీషియం హైడ్రైడ్‌ను ఉత్పత్తి చేయవచ్చు. డేలియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ ఫిజిక్స్ సరికొత్తగా ''వన్ పాట్ సింథసిస్'' పద్ధతిలో దీనిని అభివృద్ధి చేసింది. ఈ కొత్తపద్ధతివల్ల మెగ్నీషియం హైడ్రైడ్‌ను చాలా సురక్షితంగా ఆయుధాలలో ఉపయోగించడానికి ఉత్పత్తి చేయగలుగుతారు. ఉత్పత్తిదశలో ఎలాంటి పారిశ్రామిక ప్రమాదాలకు తావులేని రీతిలో ఈ ఉత్పత్తి పద్ధతిని అభివృద్ధి చేశారు. ఐతే ఇది చాలా ఖర్చుతో కూడుకున్న పని. కానీ చైనా సైనిక అవసరాలకోసం సామూహికంగా ఉత్పత్తి చేయడానికి ఇదెంతో కీలకం. సైనిక ఆధునీకరణ

### క్లీన్ ఎనర్జీ

ఇప్పుడు చైనా మరింత మెగ్నీషియం హైడ్రైడ్‌ను అదనంగా ఉపయోగించుకోవడానికి తీవ్రంగా గాలిస్తున్నది. జలాంతర్గాముల ఇంధన బ్యాటరీలకు, సుదీర్ఘ ప్రయాణంతో శత్రులక్ష్యాలను దెబ్బతీసే డ్రోన్లకు కూడా ఈ పవర్ సోర్స్‌ను ఉపయోగించేందుకు చైనా సిద్ధపడుతున్నది. ఈ విధంగా ఎలాంటి కాలుష్యం, యుద్ధానంతరం అనేక సంవత్సరాలు అణ్వాయుధ ప్రభావం తరహాలో నష్టం కలగకుండా సరికొత్త యుద్ధ తంత్రాన్ని అవసరం మేరకు అమలు చేసేందుకు క్లీన్ ఎనర్జీ పరిష్కారమార్గంగా ఈ బాంబును వెలుగులోకి తెచ్చింది.

చైనా ప్రభుత్వం చాలా విస్తారంగా తన సైన్యాన్ని, సైనిక వ్యవస్థల ఆధునీకరణ చేసేందుకు, ఆయుధ వ్యవస్థల్లో క్లీన్ ఎనర్జీ సాంకేతిక పరిజ్ఞానాన్ని సమకూర్చుకునేందుకు కృషి చేస్తున్న దశలో ఈ మెగ్నీషియం హైడ్రైడ్ ఆధారిత హైజ్రోజన్ బాంబు వెలుగులోకి వచ్చింది. తన యుద్ధనౌకలను కొత్తతరం ఎలక్ట్రానిక్ ప్రొపల్షన్ వ్యవస్థలతో అత్యాధునికంగా తీర్చిదిద్దే పనిలో చైనా నిమగ్నమై ఉంది. టైప్–055 రెన్హై–క్లాస్ క్రూయిజర్లు వంటి అడ్వాన్స్‌డ్ వ్యవస్థలను సమకూర్చుకుంటున్నది. అదేవిధంగా గగనతల యుద్ధంలో కూడా పర్యావరణహితమైన ప్రొపల్షన్ టెక్నాలజీతో యుద్ధ విమానాలను అభివృద్ధి చేసుకుంటున్నది. 2023లో చైనా ప్రపంచంలోనే మొట్టమొదటిసారిగా మీథేన్ శక్తితో నడిచే రాకెట్లను అంతరిక్షంలోకి ప్రయోగించింది. ఒక స్థిరమైన, శక్తిమంతమైన సైనిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ముందుకు తీసుకువెళ్ళాలన్న సంకల్పాన్ని ఈ ప్రయోగం చాటిచెప్పింది.



ప్రపంచంలో తాజాగా ఏర్పడిన రాజకీయ, భౌగోళిక పరిణామాలు, ఉద్రిక్తతల నేపథ్యంలో చైనా సైనికరంగంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో, సరికొత్త ఆయుధాలతో ముందుకు దూసుకువెళుతున్నది. చైనా,తైవాన్ మధ్య ఉద్రిక్తతలు ఇటీవలికాలంలో అదేపనిగా కొనసాగుతున్నాయి. తైవాన్ చుట్టూ చైనా తన యుద్ధ నౌకల వ్యవస్థలను మోహరించింది. విమానవాహక యుద్ధ నౌకల ద్వారా చైనా యుద్ధ విమానాలు తైవాన్ చుట్టూ విన్యాసాలు చేస్తున్నాయి. ఆ దేశానికి బయట నుండి ఎలాంటి సహాయం అందాలన్నాగానీ అదొక సవాలుగా మారింది. ఈ విధంగా ఉద్రిక్తలు పెరుగుతున్న తరుణంలో తైవాన్‌కు అమెరికా ద్వారా ఆయుధాల అమ్మకాలు, ఎగుమతులు కూడా పెరుగుతున్నాయి. అమెరికాకు చెందిన ఉన్నతస్థాయి ప్రభుత్వ నిర్వాహకులు ఆ దేశంలో పర్యటనలు చేయడం పెరిగింది. ఈ నెలలోనే తైవాన్ లక్ష్యంగా చైనా సైనిక విన్యాసాలు పెంచింది. ప్రత్యక్ష కాల్పుల విన్యాసాలు కూడా పెరిగాయి. దీంతో ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు మరింత పెరుగుతున్నాయి. తైవాన్ వ్యవహారాల్లో లేదా చైనా దేశ అంతర్గత వ్యవహారాలలో ఎవరు జోక్యం చేసుకున్నాగానీ పరిణామాలు తీవ్రంగా ఉంటాయని చైనా ఒకవైపు హెచ్చరికలు చేస్తున్నది. తైవాన్‌కు సైనిక సహాయం సమకూరుస్తున్న అమెరికాకు వ్యతిరేకంగా హెచ్చరికలు జారీ చేస్తున్నది. కానీ అమెరికా ఈ హెచ్చరికలను ఖాతరు చేయడంలేదు. తైవాన్ పట్ల అమెరికా తన చిత్తశుద్ధిని, సైనిక సహాయాన్ని పదేపదే ఉద్ఘాటించి చెబుతున్నది. తైవాన్‌కు మద్దతు కొనసాగిస్తామని మొండిగా చెబుతున్నది. తన మిత్రులతో కలిసి సైనిక విన్యాసాలు కూడా చేస్తున్నది.

## జిల్లా రెండో ఎఐవైఎఫ్ మహాసభలను జయప్రదం చేయండి



ప్రజాపక్షం/వలిగొండ : వలిగొండ మండలం కేంద్రంలో అఖిల భారత యువజన సమైక్య ఏఐవైఎఫ్ జిల్లా రెండో మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్ష, కార్యదర్శులు మారోజు నరసింహచారి, సుద్దాల సాయికుమార్ సంయుక్తంగా మాట్లాడుతూ ఏప్రిల్ 29న యాదగిరిగుట్టలో లక్కీ ఫంక్షన్ హాల్‌లో జరుగు జిల్లా రెండోవ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బోడిగే సుదర్శన్ పవన్ కుమార్, నరేష్, దేవేందర్ పాల్గొన్నారు.

## రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు



ప్రజాపక్షం/మునగాల: మునగాల మండలంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఐకెపి కేంద్రాలలో రైతులకు ఇబ్బంది లేకుండా కాంటాలు వేయాలని కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటి డైరెక్టర్ కాసర్ల కోటేశ్వరరావు అన్నారు. సోమవారం మండల పరిధిలోని బరాఖత్‌గూడెం గ్రామ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఐకెపి కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. రైతులకు ఇబ్బంది లేకుండా సీరియల్ ప్రకారం ధాన్యంను కాంటాలు వేయాలన్నారు. వర్షాలు వస్తున్న నేపథ్యంలో ఎప్పటికప్పుడు మ్యాచర్ వచ్చిన ధాన్యంను కాటాలు వేయించాలన్నారు. కొనుగోలు కేంద్రంలో తాగు నీటి సౌకర్యం కల్పించాలని పలువురు రైతులు కోరారు. సంచుల కొరత ఏమైనా ఉంటే తనదృష్టికి తీసుకరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కాలే సామ్యేలు, ఓరుగంటి రవి, గంధం సైదులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజానాట్య మండలి కళాకారుడి ప్రతిభ

ప్రజాపక్షం/హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన ప్రజానాట్య మండలి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గోపనబోయిన వెంకటేశ్వర్లు నెల 18న మిర్యాలగూడ పట్టణంలో నిర్వహించిన పాటల పోటీలలో పాల్గొని అత్యుత్తమ ప్రతిభను కనబర్చి ప్రథమ బహుమతి సాధించి పలువురి మన్ననలు పొందారు. తెలంగాణ సాంస్కృతీక కళా సంఘాల వ్యవస్థాపక అధ్యక్షులు రామచంద్రరావు,అధ్యక్షులు పరిమి రామానందం,ప్రధానకార్యదర్శి పులి కృష్ణ ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా నుండి వందలాది మంది కళాకారులు పాల్గొని తమ ప్రతిభను కనబరిచినారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయిలో తన ప్రతిభను కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచిన గోపనబోయిన వెంకటేశ్వర్లును సోమవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో సిపిఐ జిల్లా ప్రధానకార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్లు,పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు,కెవిఎన్ మూర్తి,యల్లావుల రాములులు పూలమాలలు,శాలువాలతో ఘనంగా సత్కరించారు.

## బాధితులకు తక్షణమే న్యాయం



ప్రజాపక్షం /నల్లగొండ: బాధితులకు సత్వర న్యాయం జరిగేలా పని చేయాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో బాగంగా నల్లగొండ జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన దాదాపు 30 మంది అర్జీదారులతో జిల్లా ఎస్పీ నేరుగా మాట్లాడి తమ సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి పూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశించారు. ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు.బాధితుల సమస్యలు తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని,పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి చట్ట పరంగా బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలని, ఫిర్యాదుదారునికి భరోసా,నమ్మకం కలిగించాలన్నారు. ఎవరైనా చట్టవ్యతిరకమైన చర్యలు చేస్తూ శాంతి భద్రతలకు భంగం కలిగించే వారి పట్ల కటినంగా వ్యవహరించాలని అన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులకు పరిష్కారం

### అదనపు కలెక్టర్ పి రాంబాబు



ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్: ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబు అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించేందుకు సంబంధిత శాఖల అధికారులు చొరవ చూపాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 93 ఫిర్యాదులు అందగా వాటిలో భూ సమస్యలపై 38 ఫిర్యాదులు ఉన్నట్లు తెలిపారు. అనంతరం (బ్రౌస్) భారతి రంగా ఆర్గనైజేషన్ ఫర్ వెల్ఫేర్ సొసైటి వారు జిల్లాలో 700 మంది టిబి రోగులకు న్యూట్రిషియన్ ఫుడ్ 3వేల ప్యాకెట్లను అందజేశారు. జెడ్‌పి సిఈఓ వివి అప్పారావు, వివిధ శాఖల అధికారులు సతీష్ కుమార్, నరసింహరావు, కిషన్, శంకర్, శ్రీధర్ రెడ్డి, జగదీష్ రెడ్డి, శర్మ, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

**జిల్లా పోలీస్ కార్యాలయంలో:** శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ బాధితులకు అండగా ఉంటూ ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను పోలీస్ అధికారులు పరిష్కరించాలని జిల్లా ఎస్‌పి కె నరసింహ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణిలో ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు ఫిర్యాదుదారులకు భరోసా కల్పించేలా ప్రతి అం శాన్ని చట్ట పరిధిలో పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు

## నీటి సంపులో పడి వివాహిత అనుమానాస్పద మృతి

### భర్త వేధింపుల వల్లే జరిగిందంటున్న తల్లిదండ్రులు

ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం : నీటి సంపులో పడి వివాహిత మృతి చెందిన సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం పుట్టపాక గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం మంగళగిరికి చెందిన నాగమణి అనే మహిళను పుట్టపాక గ్రామానికి చెందిన మల్లికార్జున్‌కు ఇచ్చి 2020లో వివాహం జరిపించారు. వివాహం జరిగిన నాటినుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మంగళగిరిలోనే బంగారం తయారీ పనులు చేసుకుంటూ వీరు ఇరువురు నివాసం ఉంటున్నారు. ఇటీవల పుటపాక లోని మృతురాలు జంజన నాగమణి(25) భర్త స్వగ్రామంలో నూతన ఇంటి నిర్మాణ పనులను పర్యవేక్షించేందుకు వచ్చారు. సోమవారం ఉదయం ప్రస్తుతం పుట్టపాకలో నివాసం ఉంటున్న ఇంటి వద్ద నుంచి మృతురాలి భర్త నూతనంగా నిర్మించే ఇంటి వద్దకు పనులు పర్యవేక్షించేందుకు వెళ్లాడు. మృతురాలి మామ బట్టలు అమ్మేందుకు వెళ్లగా ఇంట్లో తన అత్తతో కలిసి ఉన్నది. తన భర్తతో కలిసి గుడికి వెళ్తానని మృతురాలు తన అత్తకు తెలపడంతో నూతనంగా నిర్మించే ఇంటి వద్ద ఉన్న కుమారుడ్ని ఇంటికి పంపేందుకు ఆమె కూడా ఇంట్లో నుండి వెళ్లిపోయింది. ఈ సమయంలో ఇంటి వద్దకు వచ్చిన మృతురాలి భర్త అప్పటికే నీటి సంపులో పడి తన భార్య మృతి చెందిన విషయాన్ని గుర్తించాడు. జరిగిన విషయాన్ని కుటుంబ సభ్యులతో పాటు పోలీసులకు తెలపడంతో సంఘటన స్థలాన్ని పరిశీలించారు. వేధింపులతోనే మృతి. తమ కూతురును తరచూ వేధించడంతోనే మృతి చెందిందని మృతురాలి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. తన కూతురు మృతికి కారణమైన ఆమె భర్త మల్లికార్జున్ తో పాటు ఆయన కుటుంబ సభ్యులపై చర్యలు తీసుకోవాలని మృతురాలి తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీంతో జరిగిన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. నాగమణి మృతి పై పలు అనుమానాలు ఉండడంతో స్థానిక ఎస్సు జగన్ ప్రత్యేకంగా పర్యవేక్షిస్తూ మృతదేహానికి నలగొండ జిల్లా కేంద్రంలో ప్రత్యేక ఫోరెన్సిక్ నిపుణునితో పోస్టుమార్టం నిర్వహిస్తున్నారు. పోస్టుమార్టం నివేదిక వచ్చాక బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు.

# భూ భారతి పైలెట్ ప్రాజెక్టుగా చందంపేట



### భూ భారతి ద్వారా అందరికీ మేలు
### మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
### రెవెన్యూ అధికారుల తీరుపై మంత్రి 'సీరియస్'

ప్రజాపక్షం/చందంపేట: నల్లగొండ జిల్లా చందంపేట మండలం భూ భారతి ద్వారా ప్రతి రైతుకు న్యాయం జరుగుతుందని రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార పౌర సరఫరాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సోమవారం నల్గొండ జిల్లా చందంపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశానికి స్థానిక ఎంఎల్‌ఏ అధ్యక్షతన ఏర్పాటు చేసిన తెలంగాణ భూ భారతి 2025 చట్టం పై నిర్వహిస్తున్న అవగాహన సదస్సుకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ చందంపేట మండలంలో రెవెన్యూ అధికారులు పనితీరు మార్చుకోవాలని ఆయన సిరియస్ అయ్యారు. గత పాలనలో పేద ప్రజలకు న్యాయం జరగలేదని, రెవెన్యూ అధికారులు పింక్ కలర్ పార్టీ నాయకులు ఏది చెప్తే అది చేయడంతో పేద ప్రజలకు అన్యాయం జరిగిందని ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు ప్రతి ఒక్కటి ఆలోచన చేసి అందరికి న్యాయం చేసే విధంగా భూ భారతి చట్టం ద్వారా న్యాయం జరగాలని రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్రంలో నాలుగు మండలాలను పైలెట్ ప్రాజెక్టు కింద తీసుకోవడం జరిగిందన్నారు. ఈనెలాఖరు నాటికి పైలెట్ ప్రాజెక్టు పూర్తవుతుందని జూన్ 2 నుండి పైలెట్ మండలాలలో వ్యవసాయ భూముల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించుకుంటామని మే 01 నుండి అన్ని జిల్లాల్లో ఒక మండలాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద తీసుకోనున్నామని అత్యంత వెనుకబడిన చందంపేట మండలాన్ని కూడా దేవరకొండ ఎంఎల్‌ఏ బాలునాయక్ చెప్పినట్లుగా పైలెట్ మండలంగా తీసుకునే విషయంపై ఆలోచన చేస్తామని జూన్ 2 నుండి ప్రతి గ్రామానికి తహశీల్దార్ స్థాయి అధికారులు వచ్చి భూ సమస్యలపై దరఖాస్తులు తీసుకుంటారని రైతులు ఒక్క రూపాయి కూడా చెల్లించకుండా రెవెన్యూ సమస్యలను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. రైతుల భూముల సర్వే కోసం 6వేల మంది లైసెన్స్డ్ సర్వేలను నియమించనున్నామని ప్రతి గ్రామానికి ఒక గ్రామ పరిపాలన అధికారి చొప్పున 10695 మందిని వచ్చే నెల మొదటి వారం నుండి పంపించనున్నామని ఆయన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం భూ భారతి ద్వారా అందరికి న్యాయం చేస్తూ పేద రైతుల ప్రజల కన్నీళ్లు తుడుస్తామని మంత్రి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఏలు శంకర్‌నాయక్, నెల్లికంటి సత్యం, మార్కెట్ చైర్మన్ జమునమాధవరెడ్డి, జిల్లా ఎస్పి శరత్‌చంద్రపవార్, కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు ఎస్పి మౌనిక, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి, బద్య, సర్వయ్య, ఆర్డీవో రమణారెడ్డి, ఎంఆర్‌వో గోవర్ధన్‌రెడ్డి, ఎంపిడివో లక్ష్మి , సిఐ సురేష్, ఎస్ఐ సతీష్ నాయకులు పాల్గొన్నారు.

### సాగు చేసుకున్న భూములకు పట్టాలు : ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



చందంపేట మండలం భూ భారతి చట్టం 2025పై చందంపేట మండల పరిధిలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఎంఎల్‌సి సత్యం మాట్లాడుతూ గత పాలనలో ధరణిలో అనేక సమస్యలు ఉండేవని రైతులు సాగు చేసుకుంటున్న భూములను అప్పటి అధికార పార్టీ నాయకులు, అప్పటి అధికారులు పేద రైతులను ఇబ్బందులకు గురిచేశారని అలాగే చందంపేట మండలంలో కొన్ని గ్రామాలు ధరణిలో బ్లాక్ చేయడం జరిగిందని వీటన్నింటిని పరిష్కరించేందుకే రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చిందని తెలిపారు. డి ఫారెస్ట్ భూములు పరిష్కరించే దిశగా ఆలోచించాలని నల్గొండ జిల్లాలో మండలాలకు సర్వేయర్లను నియమించాలని, క్షేత్రస్థాయిలో పరిశీలించి భూమి ఉన్న వారికి పట్టాలు ఇవ్వాలని సాగు చేసుకుంటున్న వారికి హక్కు కల్పించాలని భూ భారతి చట్టం వల్ల రైతులకు లాభం జరుగుతుందని ఆయన ఆశించారు. గత ప్రభుత్వంలో మండలాల చుట్టూ తిరిగి రైతులు ఎంతో ఎంతో ఇబ్బంది పడ్డారని రైతుల బాధలు కొన్ని గ్రామాలకు వెళ్లి తెలుసుకున్నామన్నారు.

# భూ భారతి చట్టం రైతులకు చుట్టం

### ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



ప్రజాపక్షం/బొమ్మలరామారం : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూ భారతి చట్టం రైతులకు చుట్టం లాంటిదని అది కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు కల్పించిన ఒక వరమని ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. సోమవారం బొమ్మలరామారం మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయ ప్రాంగణంలో జరిగిన భూ భారతి చట్టం పై రైతులతో జరిగిన అవగాహన సదస్సుకు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి భూభారతి చట్టం పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ భూ భారతి చట్టం భూ వివాదాల శాశ్వత పరిష్కారం కోసమే ప్రభుత్వం తీసుకువచ్చిందని ఆయన తెలిపారు. ( ప్రతి గ్రామానికి గ్రామ పరిపాలన అధికారిని నియమించడంతో రైతులకు అన్ని సేవలు గ్రామంలో అందుతాయని రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసి రైతులకు ప్రజలకు అన్ని సేవలు అందించేలా ఉపయోగపడుతుందన్నారు. అనంతరం బొమ్మలరామారం మండల కేంద్రంలో పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు, జాయింట్ కలెక్టర్ వీరారెడ్డి, భువనగిరి ఆర్డీవో కృష్ణారెడ్డి బొమ్మలరామారం తాసిల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో రాజా త్రివిక్రమం, ఆర్ఐ వెంకట్ రెడ్డి, నరేష్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు సంజీవరెడ్డి, మదర్ డైరీ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, పీసీసీ కోఆర్డినేటర్ సంధ్యారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పావని, భువనగిరి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బైసు రాజేష్ పాల్గొన్నారు.

**తండాలో సన్నబియ్యం భోజనం చేసిన బీర్ల**



ప్రజాపక్షం/తుర్కపల్లి : యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం మోతీరామ్ తండా గ్రామంలో బాణోత్ మంగ్య రుక్కి గిరిజన కుటుంబంతో కలిసి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ అందిస్తున్న రేషన్ సన్న బియ్యంతో వండిన భోజనాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య గిరిజనులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆ కుటుంబంతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సన్న బియ్యం ఎలా ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు.



## మేడే గోడ పత్రిక ఆవిష్కరణ

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: కార్మికుల హక్కుల పరిరక్షణకు బలమైన ఉద్యమాలు జరపాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండి.సయ్యద్‌లు పిలుపునిచ్చారు. సోమవారం లైట్ మోటార్స్ వెహికల్స్ కార్మికులతో కలిసి మేడే ఉత్సవాల గోడపత్రికను ఆవిష్కరించి వారు మాట్లాడుతూ ఎన్నో పోరాటాల ఫలితంగా కారిమకులు సాధించుకున్న హక్కులను పాలక ప్రభుత్వాలు హరించి వేసేందుకు కుట్రలు పన్నుతున్నాయని వాటిని తిప్పి కొట్టేందుకు రాజీలేని పోరాటాలు సాగించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. పీఎఫ్, ఈఎస్ఐ, గ్రాటివిటి బోనస్, పెన్షన్ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలన్నారు. హమాలీ ఆటో వర్కర్స్ కార్మికులకు సమగ్ర సంక్షేమ చట్టం తీసుకురావాలన్నారు. అదేవిధంగా **30**వేల సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాదవశాత్తు మృతిచెందిన భవన నిర్మాణ కార్మికులకు రూ.10లక్షల ప్రమాద బీమా, 60 సంవత్సరాలు పైబడిన ప్రతి కార్మికునికి రూ.10వేల పెన్షన్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ దామరచర్ల మండల కార్యదర్శి ధీరావత్ లింగానాయక్, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వల్లంపట్ల వెంకన్న, లైట్ మోటార్స్ వెహికిల్స్ కార్మికులు వెంకన్న, గోప జానయ్య, చోటు, షఫి, శ్రీనివాసరాజు, ఎర్రబోయిన శ్రీను, హాజీ, రఫి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య

ప్రజాపక్షం/నకిరేకల్ : నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయుల చేత నాణ్యమైన విద్యను అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు చేర్పించాలని అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ దండి మణెమ్మ అన్నారు. సోమవారం నకిరేకల్ మండలంలోని మండలాపురం లో ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మేడే రామకృష్ణ ఆధ్వర్యంలో, ఉపాధ్యాయులు కె.బాలాజీ, పి.రమేష్ , పి.దశరథ, విద్యార్థులు , గ్రామ పెద్దలు కలిసి గ్రామంలో బడి బాట ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భంగా అమ్మ అదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ శ్రీమతి దండి మణెమ్మ మాట్లాడుతూ విశాలమైన ఆట స్థలం, ఆకర్షణీయమైన తరగతి గదులు, ప్రతి తరగతి గదిలో ఫ్యాను,డ్యూయల్ డెస్క్ లు, పచ్చని చెట్లు కలిగిన ఆహ్లాదకరమైన వాతావరణం , ఇంగ్లీష్ మీడియం ఉన్న మన మండలాపురం స్కూల్‌లో మన గ్రామ పిల్లలు ఉండడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మాజీ సర్పంచ్ లు దండి నాగేశ్వరరావు, గుడుకుంట్ల లచ్చుమమ్మ శంభయ్య , తంగెళ్ళ రామిరెడ్డి, ఏర్పుల మల్లమ్మ సైదులు, గ్రామ యవ్వకులు దండి అంజయ్య, తీగల బక్కయ్య, తీగల మహేశ్, తీగల రమేష్, కొత్తపల్లి నరసింహ, కిషోర్ పాల్గొన్నారు.




# జూన్ 2 నుండి ఆన్‌లైన్‌లో భూభారతి చట్టం పోర్టల్

### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



ప్రజాపక్షం/అనంతగిరి: రైతుల భూములకు భరోసా కల్పించే చట్టం భూ భారతిచట్టమని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని శాంతినగర్ గ్రామంలో గల గోదాంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకవచ్చిన తెలంగాణ భూభారతి చట్టం (భూమి హక్కుల రికార్డు చట్టం 2025) పై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు కలెక్టర్ హాజరై మాట్లాడారు. ప్రజల కోసం, ప్రత్యేకించి రైతులకు వారి భూములపై భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టం తీసుకవచ్చిందని తెలిపారు. ధరణి పోర్టల్‌లో లేని అనేక సమస్యలకు పరిష్కారం భూ భారతి చట్టం ద్వారా దొరుకుతుందని జూన్ 2 నుండి ఆన్‌లైన్‌లో భూభారతి చట్టం పోర్టల్ పనిచేస్తుందని తెలిపారు. భూములకు సంబంధించిన సమస్యలపై రైతులు దరఖాస్తు చేసుకోవచ్చని, ఏదైనా సమస్య పరిష్కారినికి దరఖాస్తు చేస్తే నిర్దేశించిన సమయంలో పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి సంవత్సరం డిసెంబర్ 31న భూభారతి చట్టంలోని నిబంధనల ప్రకారం రికార్డులను అప్డేట్ చేయడం జరుగుతుందన్నారు. భూభారతి చట్టంలో మ్యూటేషన్లు ఆటోమెటిక్‌గా అవుతాయని, 30 రోజుల్లో మ్యుటేషన్ కాకపోతే 31వ రోజు ఆటోమెటిగ్గా మ్యుటేషన్ జరుగుతుందన్నారు. భూభారతి చట్టంలోని అంశాలను సంబంధించి ఏవైనా సమస్యలుంటే ఆర్డీవో కార్యాలయంలో ఫిర్యాదుల విభాగాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఇక్కడ ఫిర్యాదులను సమర్పించి పరిష్కరించుకోవచ్చని, ఒక వేళ రైతులకు ఎవరికైనా న్యాయ సహాయం అవసరమైతే ఉచిత న్యాయ సహాయాన్ని కూడా ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని కలెక్టర్ తెలిపారు. కోదాడ ఆర్డీవో సూర్యానారయణ మాట్లాడుతూ భూభారతి చట్టంలోని సెక్షన్లు వాటి వివరాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసిల్దార్ హిమబిందు, మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసరావు, డిప్యూటి తహసిల్దార్ శ్రీధర్, సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ముస్కు శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపిపి చుండూరు వెంకటేశ్వర్లు, మాజీ జడ్పిటిసి కొణతం ఉమా శ్రీనివాసరెడ్డి, నాయకులు బుర్ర పుల్లారెడ్డి, గునుకుల గోపాల్‌రెడ్డి, ఈదుల కృష్ణయ్య పాల్గొన్నారు.

# ఫీల్డ్ అసిస్టెంట్లకు జీతాలు రాక గోస : చంద్రశేఖర్



పజాపక్షం/భువనగిరి రూరల్: ఫీల్డ్ అసిస్టెంట్లకు గత మూడు నెలల నుంచి జీతాలు రాక ఇబ్బందులు గురవుతున్నారని ఐఎన్‌టియుసి స్టేట్ జనరల్ సెక్రెటరీ ఆర్టి చంద్రశేఖర్ అన్నారు. సోమవారం ఫీల్డ్ అసిస్టెంట్ రాష్ట్ర కమిటి ఐఎన్‌టియుసి అనుబంధం పిలుపుమేరకు ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం జిల్లా అధ్యక్షులు బబ్బూరి శంకర్ ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరి జిల్లాలో రాయిగిర్ కమాన్ నుండి కలెక్టరేట్ వరకు ఫీల్ అసిస్టెంట్లు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో పరిపాలన అధికారి జగన్మోహన్ రెడ్డి, డిఆర్డిఓ నాగిరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐఎన్‌టియుసి స్టేట్ జనరల్ సెక్రెటరీ ఆర్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ కనీస వేతన చట్టం ప్రకారం రూ.25 వేల జీతం ఇవ్వాలని, ఫీల్డ్ అసిస్టెంట్లకు హెల్త్ కార్డు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ విధి నిర్వహణలో మరణిస్తే 15 లక్షల ఎక్స్ గ్రేషియ ప్రకటించాలని కోరారు. అలాగే 4779 జిఓ ప్రకారం తొలగించిన ఫీల్డ్ అసిస్టెంట్లను వెంటనే విధులకు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే కూలీలకు సంవత్సరానికీ 150 రోజుల పని దినాలు కల్పించి కూలీ రేటు రూ.400 ఇవ్వాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు జీవన్ రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కంకల సిద్దిరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి బైరగోని రమేష్, కోశాధికారి జెర్రిపోతుల ఉపేందర్, నరేందర్, రామచందర్, బింగి నర్సింహా, రవి వెంకటేష్, సుధాకర్, కూమార్, శ్రీను రజిత సునీత, వాణి లక్ష్మి వివిధ మండలాల ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## జై బాపు, జై భీమ్, జై సంవిధాన్

ప్రజాపక్షం/భువనగిరిరూరల్ : భువనగిరి మండలంలోని వడపర్తి, బిఎన్ తిమ్మాపురం, హన్మాపురం గ్రామాల్లో ఏఐసీసీ, పీసీసీ, డీసీసీ పిలుపు మేరకు భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ బొజ్జ సంధ్యారెడ్డి ఆదేశాలతో జై భీమ్ జై బాపు జై సంవిధాన్ కార్యక్రమాన్ని భువనగిరి మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఎలిమినేటి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణకు దేశం మొత్తం ఏకం కావాలని, రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని, అహింస, శాంతి సిద్ధాంతాలను అలవర్చుకోవాలని, మహాత్మా గాంధీ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆలోచనలను, ఆశయాలను సాధించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో భువనగిరి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు చిక్కుల వెంకటేశం, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మంగ ప్రవీణ్, భువనగిరి మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పాశం శివానంద్, ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ పులిగిల్ల బాలయ్య, ఎన్ఎస్‌యుఐ జిల్లా ప్రధాన కార్యదర్శి సురుపంగ చందు, మండల నాయకులు కోట మహేందర్, గ్రామశాఖ అధ్యక్షులు జిన్న సత్తయ్య, పిన్నం శ్రీశైలం, తుమ్మేటి వెంకటేష్, ఉడత ధనకోటి, ఎర్ర మహేష్, ముదుగుల ఆనంద్, సిలువేరి శ్రీను, శానూర్ పాల్గొన్నారు.

## టేకు చెట్ల నరికివేతపై కఠిన చర్య

ఇద్దరికి 14 రోజుల రిమాండ్

ప్రజాపక్షం/ జన్నారం : టేకు చెట్లను అక్రమంగా నరికిన ఇద్దరిపై కోర్టు 14 రోజుల రిమాండ్ విధించినట్లు జన్నారం ఫారెస్ట్ అధికారులు తెలిపారు. జన్నారం మండలంలోని చింతగూడెం సెక్షన్ పరిధిలో గల పైడిపల్లి బీట్ పరిధిలో పేద్రం శ్రీనివాస్, వేడుమ మధుకర్ అనే వ్యక్తులు చెట్లను నరికినట్లు గుర్తించి, ఫారెస్ట్ సిబ్బంది వారిని అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ సెక్షన్ అధికారి జె. శివకుమార్ మాట్లాడుతూ ప్రకృతి సంపదను రక్షించటం అందరి బాధ్యత అని, అడవులను నాశనం చేసే చర్యలపై శాఖ దృష్టి కేంద్రీకరించి కఠినంగా వ్యవహరిస్తుందని అన్నారు. చెట్లు నరికిన వారిని లక్షెట్టిపేట కోర్టులో హాజరుపర్చగా, మెజిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్ విధించినట్లు తెలియజేశారు.పైడిపల్లి ఎఫ్‌బిఒ లాల్ భాయ్, చింతగూడెం ఎఫ్‌బిఒ శ్రీనివాస్, ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.



## విద్యుత్ షాక్‌తో మృతి చెందిన వారికి చెక్కు అందజేత

ప్రజాపక్షం/బైంసా : బైంసా మండలంలోని ఇలేగాం గ్రామానికి చెందిన నీ లం సాయినాథ్ గత కొన్ని నెలల క్రితం విద్యుత్ షాక్ తో మృతి చెం దడంతో బాధిత కుటంబం, మృతుడి భార్య సౌజన్యకు ఐదు లక్షల రూపాయల చెక్కును సోమవారం ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ అందజేశారు. విద్యుత్ శాఖ తరపున ఈ పరిహారాన్ని అందజేసినట్లు చెప్పారు.బాధితురాలికి ప్రభుత్వ పరంగా మరింత సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమం లో మాజీ ఎంపిపి అబ్దుల్ రజా క్, మండల బిజెపి అధ్యక్షురా లు సిరం సుష్మ రెడ్డి, నాయకు లు సొంలి రమేష్, పండిత్ రా వ్, మధుకర్, సాయన్న, సాయిబాబా ఇలేగాం గ్రామస్తులు తదితరులు ఉన్నారు.



## గ్రామ పంచాయతీల్లో రికార్డులు సక్రమంగా ఉంచాలి:డిపిఒ

చిన్నధర్మారం, కోనూరు, మద్దిమాడ పంచాయతీల్లో ఆకస్మిక తనిఖీలు



ప్రజాపక్షం/ కాసిపేట:గ్రామ పంచాయతీలలో రికార్డులు క్రమబద్ధంగా ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి డి. వెంకటేశ్వరరావు ఆదేశించారు. సోమవారం కాసిపేట మండలంలోని చిన్నధర్మారం, కోనూరు, మద్దిమాడ గ్రామ పంచాయతీలను ఆకస్మికంగా పర్యటించి గ్రామ పంచాయతీల్లోని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డిపిఒ మాట్లాడుతూ నీటి సరఫరా తదితర అంశాలపై నిర్వహణ తీరు సక్రమంగా ఉండాలని, ప్రతి గ్రామ పంచాయతీలో తడి, పొడి చెత్తను విడిగా సేకరించేందుకు చర్యలు తీసుకోవాలని, మంగళ, శనివారాల్లో ప్రత్యేకంగా ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించాలని సూచించారు. తడి చెత్తతో వర్మి కంపోస్టు తయారీ చేపట్టాలని, వేసవి నేపథ్యంలో ప్రతి రోజు తాగునీటి సరఫరా నిరవధికంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎక్కడైనా సరఫరాలో అంతరాయం ఏర్పడిన వెంటనే పరిష్కరించాలని స్పష్టం చేశారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహించే పంచాయతీ కార్యదర్శులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో మండల పంచాయతీ అధికారి షేక్ సఫ్దర్ అలీ, పంచాయతీ కార్యదర్శులు మోబిన్, దీప్తి, సురేష్ పాల్గొన్నారు.

## రోడ్డుపై విగ్రహాలు పెట్టినవారిపై రౌడీషీట్ ఓపెన్ చేస్తాం : ఎస్‌పి



ప్రజాపక్షం/కొల్చారం:ప్రభుత్వ రోడ్డుపై ఎలాంటి అనుమతులు లేకుండా విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రజలకు ఆటంకం కలిగిస్తున్న వారిపై కేసులు నమోదు చేసి రౌడీషీట్ ఓపెన్ చేస్తామని ఎస్‌పి ఉదయ్ కుమార్ రెడ్డి తెలిపారు. సోమవారం మండల కేంద్రమైన కొల్చారంలో ఎలాంటి అనుమతులు లేకుండా రాత్రికి రాత్రి నడిరోడ్డుపై వెలసిన అంబేద్కర్ విగ్రహంతో పాటు అదే రోడ్డుపై చత్రపతి శివాజీ విగ్రహ ఏర్పాటుకు రోడ్డు ధ్వంసం చేసిన రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్తులు నష్టపరుస్తూ ప్రజలకు ఆటంకం కలిగిస్తున్న వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటూ కేసులు నమోదు చేసి జైలు పంపడంతో పాటు రౌడీ షీట్ ఓపెన్ చేస్తామని హెచ్చరించారు. ఎవరైనా విగ్రహాలు పెట్టుకోవాలనుకుంటే ప్రభుత్వ అనుమతులు తీసుకొని ప్రజలకు ఆటంకం కలగకుండా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇరు వర్గాల వారు గ్రామంలో చర్చించుకుని సమస్యను పరిష్కరించకపోతే ఎన్ని రోజులైతే పోలీస్ క్యాంప్ ఉంటుందో అన్ని రోజులకు సంబంధించిన ఖర్చులను గ్రామపంచాయతీపై వేయడం జరుగుతుందని వెల్లడించారు.

## మద్యానికి బానిసయ్యాడని భర్తను హత్య చేసిన భార్య



ప్రజాపక్షం/పాపన్నపేట: ప్రతి రోజూ మద్యం సేవించి వస్తున్నాడని తన భర్తను భార్య హత్య చేసిన సంఘటన మండల పరిధిలోని నామాపూర్‌లో చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ కథనం మేరకు వివరాలు గ్రామానికి చెందిన గొల్ల జోగయ్య (51)వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గత కొన్ని రోజులుగా మద్యానికి బానిసగా మారాడు. ప్రతి రోజూ మద్యం తాగి ఇంటికి రావడంతో ఇంట్లో గొడవలు జరుగుతున్నాయి. విసుగు చెందిన భార్య నాగమ్మ ఆదివారం మధ్యాహ్నం సమయంలో ఇంట్లో చిన్న కూతురుతో కలిసి జోగయ్య మెడకు చీరతో ఉరి బిగించి హత్య చేసింది. కూతురు అతని కాళ్ళు పట్టుకోగా నాగమ్మ గొంతుకు ఉరి బిగించింది. సాయంత్రం సమయంలో పొరుగున ఉన్నవారు జోగయ్య ఇంటికి వెళ్ళారు. ఇంట్లో చలనం లేకుండా జోగయ్య పడి ఉండటాన్ని గమనించి చికిత్స కోసం మెదక్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. అక్కడే మార్చురీలో శవాన్ని భద్రపరిచారు. సోమవారం బంధువులకు విషయం తెలువడంతో వారు అక్కడికి చేరుకొని పరీక్షించగా జోగయ్య మెడకు కమిలిన గాయం కనిపించింది. అనుమానం వచ్చి భార్య నాగమ్మను నిలదీయడంతో అసలు విషయం బయటపడింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడి సోదరి లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

## ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య



ప్రజాపక్షం/పాపన్నపేట: ఆర్థిక ఇబ్బందులతో మద్యానికి బానిసగా మారి పురుగు మందు సేవించి చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని బాచారం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తెలిపిన ప్రకారం వివరాలు గ్రామానికి చెందిన రావుగారి ఆంజనేయులు (40) గత కొన్నేళ్లుగా సంగారెడ్డి జిల్లా పటాన్ చెరులో కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గత కొన్నేళ్ల కిం దట ఇంద్రేశంలో రేకుల ఇళ్లు నిర్మించుకున్నాడు. ఇంటి నిర్మాణం కోసం కొంత అప్పు అయింది. ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టడంతో మద్యానికి బానిసగా మారాడు. ఈ నెల 19న గ్రామంలో బంధువుల ఫంక్షన్‌లో పాల్గొనేందుకు గ్రామానికి వచ్చాడు. అదే రోజు సాయంత్రం గ్రామ శివారులోనీ చేను వద్ద పురుగు మందు సేవించాడు. అటుగా వెళ్లిన వారు గమనిం చి చికిత్స నిమిత్తం మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం గాంధీకి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెం దాడు. మృతుడికి భార్యతో పాటు కూతురు, ఇద్దరు కుమారులు, ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

# భూభారతితో భూ సమస్యల పరిష్కారం

కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే



ప్రజాపక్షం/ కాగజ్‌నగర్ రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భూభారతి చట్టంతో భూ సమస్యలకు పూర్తిస్థాయిలో పరిష్కారం లభిస్తుందని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. సోమవారం కాగజ్‌నగర్ మండలం వంజిరి గ్రామంలోని రైతువేదికలో భూభారతి నూతన ఆర్ఓఆర్ చట్టంలోని హక్కులు, అంశాలపై రైతులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా శాసన మండలి సభ్యులు దండే విఠల్, జిల్లా అదనపు కలెక్టర్ ఎం. డేవిడ్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, సిర్పూర్ శాసనసభ్యులు పాల్వాయి హరీష్ బాబులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూభారతి నూతన ఆర్ఓఆర్ చట్టం రైతులకు ఎంతో మేలు చేస్తుందని, రికార్డులలో ఏదైనా తప్పుల సవరణకు తహసీల్దార్ కార్యాలయంలో సరిచేసుకునే అవకాశం కల్పించడం జరిగిందని తెలిపారు. ధరణి పోర్టల్‌లోని పార్ట్ బిలో ఉన్న భూములకు భూభారతి చట్టంలో పరిష్కరించానికి అవకాశం కల్పించడం జరిగిందని, భూభారతి చట్టంలోని అంశాలు, హక్కులపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. శాసనమండలి సభ్యుడు దండే విఠల్ మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం నూతన ఆర్ఓఆర్ చట్టం తీసుకువచ్చి రికార్డులలోని తప్పు, ఒప్పులను సవరించుకునే అవకాశం కల్పించిందని, పట్టా మార్పిడి సులభమైన పద్ధతిలో జరుగుతుందని తెలిపారు. సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు మాట్లాడుతూ ధరణి స్థానంలో భూభారతి నూతన ఆర్ఓఆర్ చట్టం తీసుకురావడంతో రైతులకు, అసలైన భూ యజమానులకు మేలు కలుగుతుందని, గతంలో ధరణిలో ఏదైనా తప్పు జరిగితే పరిష్కరించేందుకు ఎలాంటి అవకాశం ఉండేది కాదని, కానీ భూభారతిలో అప్పిలు వ్యవస్థ తీసుకురావడంతో రైతులకు మంచి జరుగుతుందని అన్నారు. రాజస్వ మండల అధికారి, జిల్లా కలెక్టర్, సిసిఎల్ఏ స్థాయిలలో అప్పీలుకు అవకాశం కల్పించడం జరిగిందని, పట్టా మార్పిడిలో సంబంధిత యజమానులు తమ కమతం సంబంధించిన నక్షజతపరచడం వలన ఎలాంటి వివాదాలకు తావు లేకుండా పట్టా మార్పిడి జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సదస్సులో కాగజ్‌నగర్ తహసీల్దార్ టి. కిరణ్‌కుమార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి రమేష్, వ్యవసాయశాఖ అధికారులు, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## మైనార్టీల సంక్షేమానికి అన్ని విధాలా కృషి



ప్రజాపక్షం / కాగజ్‌నగర్ : మైనార్టీల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెడుతోందని ఎంఎల్‌సి దండే విఠల్ అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని సంతోష్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం హజ్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన హజ్ యాత్రికుల టీకా కార్యక్రమంలో సొసైటీ ప్రధాన కార్యదర్శి ముఫకం అహ్మద్‌తో కలిసి యాత్రికులకు టీకాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హజ్ యాత్రికులు తప్పనిసరిగా టీకా వేసుకోవాలని సూచించారు. యాత్రికులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరం గా తెలియజేశారు. ప్రభుత్వం నుండి ఎంపికైన ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్‌నగర్, ఐరి ఆలపల్లి నుంచి 33 మంది పురుషులు, మహిళలు హజ్ యాత్రకు వెళ్లనున్నట్లు తెలిపారు. మైనార్టీల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టిందని, వారి సంక్షేమం కోసం ప్రభుత్వం పాటుపడుతున్నట్లు ఆయన అన్నారు. హజ్ యాత్ర గురించి కమిటీ హాల్ ఏర్పాటుకు హామీ ఇచ్చారు. హజ్ యాత్రికులకు మెడికల్ కిట్లు, బ్యాగులు ఇతర సామాగ్రిని పం పిణీ చేశారు. వారికి యాత్రకు సంబంధించిన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సద్దాం హుస్సేన్, దస్తగిర్, కాంగ్రెస్ నాయకులు అబ్దుల్ షకీల్, మత పెద్దలు, సొసైటీ సభ్యులు హాఫిజ్ రియాజ్, షాకీర్, అబ్దుల్ ముఖీమ్, అన్సార్ అలీ, డాక్టర్ అజీమ్, డాక్టర్ రవి, డాక్టర్ కౌసర్, డాక్టర్ నేహా, ఏఎన్ఎంలు, ఆశాలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సిసి రోడ్డు నిర్మించాలని కమిషనర్‌కు వినతి



ప్రజాపక్షం/గజ్వేల్: మున్సిపల్ పరిధిలోని అయ్యప్ప నగర్, సత్య ఫంక్షన్ హాల్ వీధి చివరి వరకు సిసి రోడ్డు నిర్మించాలని కోరుతూ కాలనీవాసులు సోమవారం సిపిఐ నేత రాజేశం ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ నర్సయ్యకు వినతిపత్రం అందజేశారు. అయితే కొద్దిపాటి వర్షం పడినా నడవడానికి కష్టంగా ఉంటుందని, రోడ్డు గుంతల మయంగా మారడంతో కాలనీ వాసుల ఇబ్బందులు వర్ణనాతీతం అని స్పష్టం చేశారు. తమ సమస్యలను ఇప్పటికే పలుమార్లు పాలక మండలి దృష్టికి ఇచ్చినప్పటికీ ఫలితం లేకపోగా, ఇప్పటికైనా స్పందించని పక్షంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని వివరించారు.

## సంబంధం లేకుండా రాజీవ్ యువ వికాసం పథకాలు

కలెక్టర్‌క్రాంతి వల్లూరు



ప్రజాపక్షం /సంగారెడ్డి ప్రతినిధి: సివిల్ స్కోర్‌తో సంబంధం లేకుండా రాజీవ్ యువవికాసం పథకాన్ని అందించాలని, జిల్లా కలెక్టర్ క్రాంతి వ ల్లూరు బ్యాంకర్ల సమావేశంలో తెలిపారు. కలెక్టర్లట్లో రాజీవ్ వికాసం పథకంపై బ్యాంకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ సివిల్ స్కోర్‌తో సంబంధం లేకుండా అర్హులైన వారికి ఈ పథకం వర్తింపజేయాలన్నారు. ఈ పథకంలో అర్హులైన నిరుద్యోగులకు ఏలాంటి షరతులు లేకుండా రాజీవ్ యువ వికాసం పథకం అందించాలన్నారు. నిరుద్యోగ యువతను స్వయం ఉపాదివైపు ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు తలపెటిన రాజీవ్ యువ వికాసం పథకానికి జిల్లాలో అనూహ్య స్పందన అభించిందని ఆయా వర్గాలకు చెం దిన నిరుద్యోగుల నుంచి భారీగా దరఖాస్తులు వచ్చాయన్నారు. అన్ని వర్గాల నుండి అనూహ్య స్పందన లభించగా రూ. 50వేలు మొదలుకొని రూ. 4 లక్షల వరకు రుణం పొందేందుకు పథకాలను ప్రభుత్వం నిర్వహించిందని ఈనెల 14వ తేదీతో దరఖాస్తు సమర్పణకు ప్రభుత్వం ఆన్‌లైన్‌లో చివరి తేదీగా నిర్ణయించిందన్నారు. జిల్లా మొత్తంతో51,657 మంది దరఖాస్తులు సమర్పించారని అత్యదికంగా బిసి వర్గాలనుంచి 6,546 యూనిట్లకుగాను, 23,681 ఎస్‌సి విభాగంలో 7,415 యూనిట్లకు, 14,460, మైనార్టీ విభాగంలో 2,456 యూనిట్లకు 8,378, ఎస్‌టి విభాగంలో 2,502 యూనిట్లకు 4,232, ఇబిసిలో 1,654 యూనిట్లకు 817 దరఖాస్తులను సమర్పించారని తెలియజేశారు. రాజీవ్ యువ వికాసం పథకాన్ని నాలుగు కేటగిరీ జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా యూనిట్లను మంజూరు చేసి వారికి ప్రొసిడింగ్స్ అందచేయనున్నారని ఈ పథకంలో మొదటి నిస్సహాయులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు నిరుద్యోగులు, ఇది వరకు ప్రభుత్వం నుంచి స్వయం ఉపాది పథకాల ఋణాలు పొందని వారికి ప్రాధాన్యత క్రమంలో మంజూరు చేయనుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ పిడి డిఆర్‌డి జ్యోతి ఈడి కార్పొరేషన్ రామాచారి సాంఘీక సంక్షేమ శాఖ గిరిజన సంక్షేమ శాఖ, అధికారి అఖిలేష్, రెడ్డి, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి జగదీష్, ఎల్‌డిఎం . గోపాల్ రెడ్డి, జిల్లా అల్ప సంఖ్య సంక్షేమ అధికారి దేవుజా, వివిధ బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

## సాదా బైనామా దరఖాస్తుల క్రమబద్ధీకరణ

కలెక్టర్ అభిలాష అభినవ్ వెల్లడి



ప్రజాపక్షం/బైంసా :రైతులకు వారి భూములపై సమగ్ర హక్కులు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం భూ భారతి(నూతన ఆర్‌ఓఆర్) 2025 చట్టాన్ని తీసుకువచ్చిందని నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ స్పష్టం చేశారు. బాసర రైతు వేదికలో నిర్వహించిన భూ భారతి అవగాహన సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,ధరణి ద్వారా పరిష్కారం కాని సమస్యలకు కొత్త భూ భారతి చట్టం ద్వారా పరిష్కారం లభిస్తుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో సాదా బైనామాల ద్వారా కొనుగోలు చేసిన వ్యవసాయ భూములపై పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ప్రభుత్వం క్రమబద్ధీకరించేందుకు వీలు కల్పించిందని వివరించారు. భూముల హక్కుల రికార్డుల్లో తప్పుల సవరణ కోసం కొత్త చట్టం అమలులో దరఖాస్తు చేసుకునే వెసులు బాటు ఉందని, ఆ దరఖాస్తులను రెవెన్యూ డివిజన్ అధికారి, కలెక్టర్ పరిశీలించి నిర్ణయం తీసుకుంటారని చెప్పారు.అభ్యంతరాలుంటే కలెక్టర్ వద్ద అప్పీల్, ఆపై ల్యాండ్ ట్రిబ్యూనల వద్ద అవకాశాలు ఉన్నాయని వివరించారు. పురాతన అప్పీల్ వ్యవస్థలతో పోలిస్తే,ఈ కొత్త రెవెన్యూ కోర్టుల ద్వారా రైతులకు వేగవంతమై న్యాయం లభిస్తుందని చెప్పారు. చిన్న, సన్నకారు రైతులకు ఉచిత న్యాయ సహాయం అందుతుందని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో రెవెన్యూ రికార్డులు తయారు చేసి వార్షికంగా వాటిని ప్రజల ముందు ప్రదర్శిస్తారని, ఆధార్ తరహాలో భూమికి ప్రత్యేకప భూదార్ నంబర్ కేటాయించి ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలని ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. అనంతరం రైతులు అడిగిన వివిధ భూ సమస్యలకు కలెక్టర్ సమాధానం ఇచ్చారు.ఈ అవగాహన సదస్సులో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావు,అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్,ఆర్‌డిఒ కోమల్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి రమణ,తహసిల్దార్ పవన్ చంద్ర, ఎంపిడిఒ అశోక్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## భూ సమస్యలు పరిష్కారం...

అవగాహన సదస్సులో కలెక్టర్ రాహుల్ రాజ్



ప్రజాపక్షం/పాపన్నపేటద: భూభారతి చట్టంతో ఊరూరా వెళ్లి భూ సమస్యలను పరిష్కరిస్తామని, ప్రతి గ్రామానికి గ్రామ పరిపాలన అధికారి నీ నియమిస్తామని, మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. సోమవారం పాపన్న పేట మండలం మల్లంపేట గ్రామంలో రైతు వేదికలో భూభారతి చట్టం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, ఆర్‌డిఒ రమాదేవి, తహసీల్దార్, సతీష్, ఎఒ నాగ మాధురి, సంబంధిత ప్రజాప్రతినిధులు ప్రభుత్వ అధికారులతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ముందుగా భూభారతి చట్టంలోని ప్రభుత్వ మార్గదర్శకాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు కళా ప్రదర్శనలు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భూ భారతి.. చారిత్రాత్మక చట్టంఅని నూతన భూ భారతి చట్టంతో భూమికి భూధార్ కార్డు జారీచేయ నున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. భూ సమస్య లను పరిష్కరించడానికి, రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు ఎప్పటికప్పుడు ప్రభుత్వం కొత్త చట్టాలను రూపొందిస్తుందని తెలిపారు. సాధాబైనామ దరఖాస్తు లను పరిష్కరించడానికి భూ భారతి ద్వారా మంచి అవకాశం వచ్చిందన్నారు. రాబోయే రోజుల్లో గ్రామ పరిపాలన అధికారి వస్తారని, భూ భారతి చట్టం ద్వారా అప్పీల్ వ్యవస్థ ఏర్పడిందని.. ఇలా రెవెన్యూ వ్యవస్థ ను ప్రభుత్వం మరింత పటిష్టం చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ జిల్లా అ ధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, శ్రీకాంత్ అప్ప, ఆకుల శ్రీనివాస్, రాజశేఖర్, శ్రీకాంత్ రెడ్డి, సంతోష్ రెడ్డి, రెవెన్యూసిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఉద్యమ స్ఫూర్తిని చాటాలి

నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి



ప్రజాపక్షం/వెల్దుర్తి: నర్సాపూర్ నియోజకవర్గ ప్రజలు ఉద్యమ స్ఫూర్తిని చాటాలని ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న బిఆర్ఎస్ రజతోత్సవ సభకు సమయం ఆసన్నమైందని మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం మెదక్ జిల్లా వెల్దుర్తి మండల కేంద్రం లోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో ని పార్టీ ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. రజతోత్సవ సభకు సంబంధించిన వాల్ పోస్టర్ను ఆమె ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సభకు బయలుదేరేముందు గ్రామాల్లో గులాబీ జెండాలు ఆవిష్కరించాలని, ప్రజలతో కలిసి సభకు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆమె సూచించారు. ఇప్పటికే కెసిఆర్ సభ అంటేనే అధికార పార్టీలో అలజడి మొదలైందని 420 హామీలతో గద్దెనెక్కిన రేవంత్ సర్కారు వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆమె అన్నారు. కోట్లాది రూపాయలు ఢిల్లీకి చేర్పించడమే పనిగా పెట్టుకున్న సిఎంకు ప్రజలు బుద్ధి చెప్పేందుకు సంసిద్ధం కావాలని చరిత్రలో నిలిచిపోయేలా విజయవంతం చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆమె అన్నారు. మాజీ సిఎం కెసిఆర్ తెలంగాణను సాధించి దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దారన్నారు. ప్రజలు రేవంత్ రెడ్డి మోసపూరిత మాటలకు ఆశపడి కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారని ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేయాలని, అడుగుతే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ కాలం గడుపుతున్నారని, ఆమె ఎద్దేవా చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి రమేష్ గౌడ్, మాజీ ఎంపీటీసీ మోహన్ రెడ్డి, వెల్దుర్తి మండల పార్టీ ఉపాధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, కృష్ణ గౌడ్, తోట నరసింహులు, శ్రీనివాస్ రెడ్డి, అశోక్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, శ్రవణ్ కుమార్, చల్ల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా విజయ



ప్రజాపక్షం/గజ్వేల్: సిద్దిపేట జిల్లాలో ప్రతిష్టాత్మక వంటిమామిడి వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకమండలి సభ్యులను నియమిస్తూ సిఎం రేవంత్ రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాల మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బాగనోల్ల విజయ మోహన్, వైస్ చైర్మన్‌గా కోడిత్యాల ప్రభాకర్ గుప్త తో పాటు పలువురు సభ్యులను నియమిస్తూ సంబంధిత వ్యవసాయ శాఖ సెక్రటరీ రఘునందన్ రావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు సోమవారం వంటిమామిడి మార్కెట్ కమిటీ సెక్రటరీ రేవంత్ ఆధ్వర్యంలో చైర్మన్‌గా బాగనోల్ల విజయ, వైస్ చైర్మన్ ప్రభాకర్ గుప్త, పలువురు సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించగా, అనంతరం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వంటిమామిడి మార్కెట్ పరిధిలోని మండలాల్లో వ్యవసాయ ఉత్పత్తులను ప్రోత్సహించడంతోపాటు, పెద్ద ఎత్తున కూరగాయల సాగుకు సహకారం అందించనున్నట్లు చెప్పారు. ముఖ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం మేరకు రైతు సంక్షేమానికి పెద్దపీట వేసి ఆర్థికంగా తోడ్పాటు అందించనున్నట్లు స్పష్టం చేశారు. ముఖ్యంగా తమపై నమ్మకం ఉంచి వంటిమామిడి మార్కెట్ బాధ్యతలు అప్పగించిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి లకు వారు కృతజ్ఞతలు తెలిపారు. అయితే త్వరలోనే... వంటిమామిడి మార్కెట్ యార్డు ఆవరణలో పెద్ద ఎత్తున కార్యక్రమం నిర్వహించి సిఎం రేవంత్ రెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కొండ సురేఖ, పొన్నం ప్రభాకర్ తదితరుల సన్మాన కార్యక్రమం ఉంటుందని వివరించారు. గజ్వేల్ కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ నిమ్మ రంగారెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు నరేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మండల పార్టీ బాధ్యులు శ్రీనివాస్, సీనియర్ నాయకులు భాస్కర్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, రవీందర్ రెడ్డి తదితరులు వారిని ఘనంగా సత్కరించారు.

## ప్రజావాణి దరఖాస్తుల సత్వర పరిష్కారానికి చర్యలు

ప్రజాపక్షం/ ఆసిఫాబాద్: ప్రజావాణిలో అందిన దరఖాసులను అధికారుల సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు తో కలిసి అర్జి దారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. రెబ్బెన మండలం ఎడవెల్లి గ్రామానికి చెందిన రాథోడ్ సుజాత తన భర్త మరణించినందున తనకు వితంతు పింఛన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. సిర్పూర్ టి మండల కేంద్రానికి చెందిన మచ్చ సుశీల తన భర్త మరణించినందున వితంతు పింఛన్ ఇప్పించాలని, చింతల మానేపల్లి మండలం రణవెల్లి గ్రామానికి చెందిన చిట్యాల శంకర్ తాను కొనుగోలు చేసిన భూమిని తన తెలియకుండా ఇతరులు పట్టమార్పిడి చేసుకున్నారని, ఇట్టి పట్టాను రద్దుచేసి తనకు న్యాయం చేయాలని, ఆసిఫాబాద్ మండలం జెండాగూడ గ్రామానికి చెందిన దుర్గం ధర్మయ్య తమ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లే రహదారిని కొంతమంది అక్రమంగా ఆక్రమించారని, ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని, చింతల మానేపల్లి మండలం రణవెల్లి గ్రామానికి చెందిన బిట్టుపెల్లి చంద్రయ్య తనకు గ్రామంలో ఉన్న భూమికి సంబంధించి వివరాలను ఆన్ లైన్ లో నమోదు చేసి పట్టా పాసు పుస్తకం మంజూరు చేయాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరమే పరిష్కరించే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, అర్జిదారులు పాల్గొన్నారు.

## భూ భారతిపై అవగాహన కార్యక్రమం



**ప్రజాపక్షం/చందుర్తి:** ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన భూ భారతి చట్టం పై మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు మండల తహసిల్దార్ శ్రీనివాస్ తెలిపారు.ధరణి తో రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం భూ భారతి చట్టం తీసుకువచ్చిందని, కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా,ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ , వేములవాడ ఆర్‌డిఓ రాజేశ్వర్ హాజరవుతారని అన్నారు. మండల రైతులు , రైతు నాయకులు ఈ కార్యక్రమానికి హాజరై సందేహాలను నివృతి చేసుకోవాలని కోరారు.

## గ్రామాల అభివృద్ధిని పట్టించుకోవాలి

**ప్రజాపక్షం/గోదావరిఖని :** దేశంలో ఎక్కడ లేని విధంగా పరిశ్రమల అవసరాల కోసం 73 వేల ఎకరాల భూమిని రామగుండం నియోజకవర్గం ప్రజలు ఇచ్చారని, కానీ, నేటికి కూడ ప్రభావిత గ్రామాల అభివృద్ధిని పట్టించుకోవడంలేదని, ఇకనైన అన్నివిధాల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి నిర్వాసిత, ప్రభావిత నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ కోరారు. సోమవారం ఎన్‌టిపిసి మిలినీయం హాల్‌లో ఎన్‌టిపిసి, ఆర్ఎఫ్‌సిఎల్ , రెవెన్యూశాఖ అధికారులు, నిర్వాసిత, ప్రభావిత గ్రామాల మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేతో పాటు ఎన్‌టిపిసి ఎజీఎం సిక్ధర్, ఆర్ఎఫ్‌సిఎల్ హెచ్ఆర్ అధికారి సోమనాథ్, పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య, తహసీల్దారు శ్రీపాద ఈశ్వర్‌ల దృష్టికి పలువురు తమ గ్రామాల సమస్యలను వివరించారు. పరిశ్రమల్లో అందరికి ఉపాధి కల్పించాలని, ఎన్‌టిపిసి ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించాలని, పాఠశాలలను దత్తత తీసుకొని అభివృద్ధి చేయాలని, అన్నిచోట్ల ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఆయా ప్రాంతాల నాయకులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## దేశ రాజకీయాల్లో కమ్యునిస్టు ఉద్యమం ఎనలేనిది

సిపిఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్



**ప్రజాపక్షం/అక్కన్నపేట:** స్వాతంత్ర్య పోరాటంలో, దేశ రాజకీయాల్లో కమ్యునిస్టు ఉద్యమం నిర్వహించిన పాత్ర ఎంతో గర్వించతగినదని, భారత రాజ్యాంగ పరిరక్షణకు, రాజ్యాంగం కల్పించిన హక్కుల కోసం ప్రతీ ఒక్కరూ సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్ పిలుపునిచ్చారు. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలంలోని ధర్మారం, పోతారం(జే), నందారం గ్రామాల్లో నిర్వహించిన సిపిఐ గ్రామశాఖల మహసభలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. బ్రిటీషు పాలకుల నిర్బంధ కాండకు, నిరంకుశత్వానికి వ్యతిరేకంగా సిపిఐ ఆవిర్భవించిందని చెప్పారు. నాటి నుంచి నేటి వరకు దేశ సమైఖ్యత, సమగ్రతకు సమరశీల పోరాటాలు చేస్తూనే ఉన్నామన్నారు. జాతి, కుల, వర్గ, మత, లింగ వివక్ష నివారణకు సమ సమాజామే ఆవశ్యకమని విశ్వసించి ఆ దిశగా సీపీఐ అలుపెరుగని పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. దేశంలో మతోన్మాద శక్తులను తుద ముట్టించడానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమ కార్యాచరణ రూపొందించే వేదికగా సిపిఐ గ్రామసభలు నిలవబోతున్నాయని ఉద్ఘాటించారు.అటు కేంద్రంలో మోదీ ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్నీ విస్మరించి దేశ సంపదని కొల్లగొడుతుందని మండిపడ్డారు. ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేసి యువతకు ఉపాధి అవకాశాలు లేకుండా చేస్తున్నారని ఆరోపించ్చరు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ఎన్నికల హామీలను అమలు చేయడంలో జాప్యం తగదన్నారు. తక్షణమే హామీలను అమలు చేయాలని లేని పక్షంలో తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు యెడల వనేష్, అక్కన్నపేట మండల కార్యదర్శి కొమ్ముల భాస్కర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జనార్ధన్ ,మండల సహాయ కార్యదర్శి బొజ్జపురి రాజు, లింగాల బాబు తదితరులు పాల్గొన్నారు.

## ప్లీనరీకి తెలంగాణ ఉద్యమకారులు



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి:** పెద్దపల్లి జిల్లాకు చెందిన తెలంగాణ ఉద్యమకారులు హైదరాబాద్ సీతాఫల్ మండి జిహెచ్ఎంసి ఫంక్షన్ హాల్ లో తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ తలపెట్టిన తెలంగాణ ఉద్యమకారుల ప్లీనరీ సభకు జిల్లా అధ్యక్షులు గుండేటి ఐలయ్య యాదవ్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున తరలి వెళ్లారు.ఈ సందర్భంగా ఉద్యమకారులు మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం 13 సంవత్సరాలు ఉద్యమం చేశామని,రాష్ట్రం వస్తే ఈ ప్రాంత ప్రజల బతుకులు మారుతాయి అని ఎన్నడు వెనక్కి తిరిగి చూడకుండా ఉద్యమాన్ని ముందుకు నడిపామని తెలిపారు.మన ప్రజా ప్రభుత్వంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్యమకారులను గుర్తింపు ఇస్తామని, 250 గజాల ఇంటి సలం, పెన్షన్ ఇస్తామని చెప్పడం పట్ల తమకు న్యాయం చేస్తారని ఆశిస్తున్నామని అన్నారు.తెలంగాణ ఉద్యమంలో చాలా మంది పేద,మధ్యతరగతి ఉద్యమకారులు ఉన్నారని,రాష్ట్రం కోసం ఎన్నో అవస్థలు పడ్డామని, ఆర్థికంగా నష్టపోయామని కనీసం ఇప్పుడైనా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తమను ప్రజా ప్రభుత్వంలో గుర్తించి ఉద్యమకారుల సంక్షేమ బోర్డ్ ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్రంలో ఉన్న మంత్రులు , ఎమ్మెల్యేలు , ఎంపీలు , ప్రజాప్రతినిధులు అందరు ఉద్యమకారుల సంక్షేమం కోసం ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యమకారులు నూనె రాజేశం ముదిరాజ్ , బింగి రాజు,బత్తుల శంకర్,చంద్రకళ , ముద్దమల్ల రమేష్ , గోగుల రాజిరెడ్డి ,కోడూరి రాజా వీర్ గౌడ్ , కదర కళాధర్ రెడ్డి , అనుముల కళావతి , మద్యల సంజీవ్ ,ప్రతాప్ ,చర్ల పెల్లి సురేష్ గౌడ్ , పద్మ , మూల మల్లేష్ , చింతల తిరుపతి , దామ సదయ్య , గోవుల రాజిరెడ్డి , బండారి సుధాకర్ , కాజీపేట సాంబయ్య , రాజయ్య , శ్రీనివాస్ , మల్లేష్ , దాసరి రామస్వామి , మేరా శంకరయ్య , కందుల అశోక్ , సయ్యద్ ఖాదర్ పషా , ఆలేటి ఎల్లమ్మ , అజిత్ , కన్నాలా , ఎండి కజిత , సంటి నర్సక్క , కాంతాల సమీరెడ్డి , పలకల నరసింహా రెడ్డి , గోవిందుల ఎల్ల స్వామి ,అజయ్ ,సంపత్,సతీష్ , నారాయణ ,పురుషోత్తం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణాలు తనిఖీ



**ప్రజాపక్షం/చొప్పదండి:** చొప్పదండి మండలంలోని ఎరువుల దుకాణాలను జిల్లా వ్యవసాయ అదికారి జె.భాగ్యలక్ష్మి సోమవారం తనిఖీలు నిర్వహించారు. దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్లు, బిల్ బుక్కులను పరిశీలించారు. రైతులు ఎరువులు కొనుగోలు చేసిన సమయంలో విధిగా బిల్లులు ఇవ్వాలని, దుకాణాల ఎదుట ధరల పట్టిక ఏర్పాటు చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. ఆయన వెంట ఏవో వంశీకృష్ణ ఉన్నారు.

## పెద్దంపేటలో మౌలిక వసతులు కల్పించాలి



**ప్రజాపక్షం/అంతర్గాం :** ఎన్‌టిపిసి ప్రభావిత గ్రామమైన పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం పెద్దంపేటలో మౌలిక వసతులు కల్పించాలని రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్‌కు సోమవారం వినతిపత్రం అందజేసినట్లు కాంగ్రెస్ పార్టీ ఓబిసి సెల్ జిల్లా అధ్యక్షులు పెండ్యాల మహేష్ తెలిపారు. ఎన్‌టిపిసి ప్రభావిత, నిర్వాసిత గ్రామాల అభివృద్ధిపై జరిగిన సమీక్షా సమావేశంలో పాల్గొని ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు. గ్రామంలో సుమారు 150 ఎల్ఈడి వీధి దీపాలను ఏర్పాటు చేయాలన్నారు. వైద్య, విద్యా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని కోరినట్లు తెలిపారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

పెండింగ్ భూ సమస్యలకు భూ భారతితో మోక్షం

కొత్త చట్టంలో అప్పీలు వ్యవస్థ

30 రోజుల్లో మ్యుటేషన్ దరఖాస్తుల పరిష్కారం

ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**ప్రజాపక్షం/గంగాధర:** ధరణి కారణంగా యేండ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న రైతు భూ సమస్యలకు భూ భారతి చట్టం ద్వారా మోక్షం కలగనుందని చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం అన్నారు. సోమవారం గంగాధర మండల కేంద్రంలోని స్థానిక ఎస్.ఆర్ ఫంక్షన్ హాలులో నిర్వహించిన భూ భారతి నూతన ఆర్ఓఆర్ చట్టంపై అవగాహన కార్యక్రమానికి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి హాజరయ్యారు. ఈ సంధర్బంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి చట్టం రైతుల పాలిట శాపంగా మారిందన్నారు. ఏ తప్పు చేయకుండానే రైతులను, అధికారులను ధరణి దోషులుగా నిలబెట్టిందని పేర్కొన్నారు. ధరణి చట్టంలోని లోపాలు రైతులు, అధికారుల మద్య గొడవలు సృష్టించేలా చేశాయని, రైతులను ఆత్మహత్యలకు ఉసిగొల్పాయని అన్నారు. రైతుల పాలిట శాపంగా మారిన ధరణిని తొలగిస్తామని ఎన్నికలకు ముందు తమ పార్టీ మాట ఇచ్చిందని గుర్తు చేశారు. ఈ నేపధ్యంలో ఎంతోమంది మేధావులు, రాజకీయ నాయకులు, రైతు సంఘాల నాయకులు, అధికారులతో చర్చించి మెరుగైన ఆర్ఓఆర్ చట్టాన్ని రూపొందించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయించారని తెలిపారు. వారి సూచనలు, సలహాలు మేరకు భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి భూ భారతి చట్టాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని వివరించారు. ఈ చట్టం ద్వారా పేరుకుపోయిన భూ సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని అన్నారు. భూ భారతి చట్టంలో అప్పీలు వ్యవస్థ ఉండడం ద్వారా రైతులు అన్ని స్థాయిల్లో ఉన్న అధికారులకు అప్పీలు చేసుకోవచ్చని అన్నారు. కోర్టుల చుట్టూ తిరగాల్సిన పనిలేదని చెప్పారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ ధరణిలోని పొరపాట్లను సవరించేందుకు కలెక్టర్‌కి మినహా ఏ అధికారికి అవకాశం లేదని చెప్పారు. దీని వల్ల తహసీల్దార్ స్థాయిలో పరిష్కారమయ్యే చిన్న సమస్యలు సైతం వేల సంఖ్యలో పేరుకుపోయేవని అన్నారు. తాను విధుల్లో చేరేటప్పుడు 11 వేల భూ సమస్యల ధరఖాస్తులు పెండింగ్‌లో ఉండేవని అన్నారు. రెండంతల అప్పీలు వ్యవస్థతో రైతులు, ప్రజలు భూ సమస్యలపై కోర్టు వరకు వెళ్లాల్సిన అవసరం దాదాపు ఉండదని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మి కిరణ్, ఆర్డీవో మహేశ్వర్, తహసీల్దార్ అనుపమ, ఎంపిడివో రాము తదితరులున్నారు.

## వడగండ్ల వర్షం బీభత్సం

* వరిపంటకు తీవ్ర నష్టం
* నేల కూలిన విద్యుత్ స్థంబాలు

**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** జగదేవ్‌పూర్ మండలంలో భారీ ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వర్షానికి తీవ్రనష్టం వాటిల్లింది. కోత దశలో ఉన్న వరి పంటకు భారీ నష్టం సంభవించింది. సోమవారం మండలంలో ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వర్షానికి జగదేవ్‌పూర్‌లో చిరు వ్యాపారులు వేసుకున్న రేకుల షేడ్లు కుప్పకూలగా, వృక్షాలు విరిగి పడి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. జగదేవ్‌పూర్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నేల కూలడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అలాగే మాందాపూర్, పలుగుగడ్డ, పీర్లపల్లి తదితర గ్రామాలలో వడగండ్ల వర్షానికి వరి మొక్క జొన్న, మామిడి, కూరగాయాల తోటలకు తీవ్ర నష్టం జరిగింది.



## భూ భారతితో రైతుల సమస్యలు సత్వర పరిష్కారం



**ప్రజాపక్షం/దుబ్బాక:** భూ భారతితో రైతుల భూ సమస్యలను సత్వరమే పరిష్కారం లభిస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ఆర్ఓఆర్ 2025 చట్టంతో ఎంతోమంది రైతులకు మేలు చేకూరనుందని సిద్దిపేట జిల్లా కలెక్టర్ మనుచౌదరి పేర్కొన్నారు. దుబ్బాక నియోజకవర్గ పరిధిలోని మిరుదొడ్డి మండల కేంద్రంలోని రైతు వేదికలో భూ భారతి చట్టం గురించి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు ఎన్నో ఏళ్లుగాభూ సమస్యల పరిష్కారానికై, అధికారుల చుట్టూ, కోర్టుల చుట్టూ తిరుగుతూ డబ్బులు, సమయాన్ని వృధా చేసుకోడవమే తప్ప సమస్యల పరిష్కారం కాక రైతులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ప్రస్తుతం భూ భారతి చట్టం ద్వారా రైతులకు చేకూరే ప్రయోజనాల గురించి కలెక్టర్ ఒక్కో అంశంపై దృశ్యరూపకంగా వివరించారు. భూ సమస్యలు కలిగిన రైతులు చట్టం అమల్లోకి వచ్చిన ఏడాది కాలంలోపు భూ భారతి పోర్టర్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. భూ భారతి చట్టం ప్రకారం భూ సంబంధిత సమస్యను బట్టి తహసీల్దార్, రెవెన్యూ డివిజన్ అధికారి రెండు అంచెలలో వ్యవస్థతో నిర్థిష్ట గడువులోపు పరిష్కరించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. సమస్య పరిష్కారం కాకుంటే కొత్తగా ఏర్పాటు చేసిన ట్రిబ్యునల్ ను కూడా ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందని పేర్కొన్నారు. అనంతరం రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని , పరిష్కారానికి భూ భారతి పోర్టల్‌లో దరాఖస్తు చేసుకోవాలని సూచించారు. రెవెన్యూ డివిజన్ అధికారి నిర్ణయం సరైందని కాదని భావిస్తే కలెక్టర్ వద్ద, కలెక్టర్ నిర్ణయంపై అభ్యంతరం ఉంటే ల్యాండ్ ట్రిబ్యునల్ కు అప్పిల్ చేసుకోవచ్చని అన్నారు. గ్రామంలో రెవెన్యూ రికార్డులు తయారు చేసి, ప్రతి సంవత్సరం డిజిటల్ రూపంలో పొందుతారన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ అబ్దుల్ హమీద్, రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ సదానందం, మిరుదొడ్డి మండల తహశీల్దార్ ఉదయశ్రీ అధికారులు సందీప్, ఎంపీడీవో గణేశ్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## పాఠశాల అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి

కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లిరూరల్:** మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, అదనపు కలెక్టర్ డి.వేణు తో కలిసి ఎలిగేడు మండలంలో విస్తృతంగా పర్యటించారు. ఎలిగేడు మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్యాక్స్ ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం, లాలపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులు, ఎంపిపిఎస్ పాఠశాల, సుల్తాన్ పూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నర్సాపూర్ గ్రామంలో ఎంపిపిఎస్, ప్యాక్స్ ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం కలెక్టర్ పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పన కోసం కలెక్టర్ ప్రత్యేకంగా మంజూరు చేసిన నిధులతో చేపట్టిన పనుల పురోగతి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎలిగేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు చేపట్టిన డైనింగ్ హాల్, కాంపౌండ్ వాల్ పనులను త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ సూచించారు. లాలపల్లి గ్రామంలో చివరి దశకు చేరుకున్న కాంపౌండ్ వాల్ పనులు పూర్తి చేయాలని,పాఠశాలకు పెయింటింగ్ పనులు సైతం ప్రారంభించాలని కలెక్టర్ తెలిపారు. వేసవి దృష్ట్యా ఉపాధి హామీ పని ప్రదేశాలలో అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా పౌర సరఫరాల అధికారి రాజేందర్, డి.యం. శ్రీకాంత్ , ఎలిగేడు మండల తహసిల్దార్ బషీర్, ఎంపీడీవో భాస్కర రావు, మండల పంచాయతీ అధికారి కిరణ్, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ బలోపేతం కోసం ప్రతి కార్యకర్తా కృషి

ఎన్నికల హామీల అమలు కోసం పోరాడాలి

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కొయ్యడ సృజన్ కుమార్ పిలుపు



**ప్రజాపక్షం/చొప్పదండి:** గ్రామాల్లో సిపిఐ బలోపేతం కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్ కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం చొప్పదండి మండలం రుక్మాపూర్ గ్రామంలో సిపిఐ పార్టీ గ్రామ శాఖ మహాసభ నిర్వహించారు. ఈ సంధర్బంగా సృజన్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి కేంద్రంలో, రాష్ట్రంలో పాలన కొనసాగిస్తున్న వారిని హామీల అమలు పరచాలని సిపిఐ ఆధ్వర్యంలో పోరాటాలు చేయాలన్నారు. ప్రజల్లో పార్టీ పట్ల నమ్మకాన్ని కలిగించాలన్నారు. సిపిఐ ఆవిర్భవించి వంద సంవత్సరాలు పూర్తవుతోందని, మార్క్సిజం, లెనినిజం సిద్ధాంతాలతో సమ సమాజ స్థాపనే లక్ష్యంగా దోపిడీ లేని సమాజం కోసం అంతరాలు లేని వ్యవస్థ కోసం దేశంలోనే మొట్టమొదటి రాజకీయ పార్టీ సిపిఐ అని, నాటి నుంచి నేటి వరకు కార్మిక, కర్షకుల సమస్యలతో పాటు దేశంలోని అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం పాటుపడుతున్న ఏకైక పార్టీ అన్నారు. రాష్ట్రంలోని రేవంత్‌రెడ్డి ఎన్నికల హామీలను అమలు చేయడంలో ఆలస్యమవుతోందని, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులు, నిరుద్యోగ భృతి, ఉద్యోగాల కల్పన, పెన్షన్స్ పెంపు, రైతుల రుణ మాఫీ తదితర హామీలను వెంటనే నెరవేర్చాలని, లేని పక్షంలో ప్రజా ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు మచ్చరమేష్, మండల నాయకులు లంక అజయ్, శ్రీనివాస్, పవన్, సిద్దార్థ్, రాజయ్య, కనుకవంశీ తదితరులున్నారు.

## ఆడపడుచులకు అండగా కల్యాణలక్ష్మి

ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్



**ప్రజాపక్షం/గొల్లపల్లి:** పేదింటి ఆడపడుచులకు అండగా కల్యాణలక్ష్మి , షాదీ ముబారక్ ఉన్నదని ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. సోమవారం జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని పెళ్లి చేసుకున్న పేదింటి ఆడబిడ్డలకు మేనమామ కట్నంగా ఒక లక్ష నూట పదహారు రూపాయల చెక్కులను ,మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 57 మంది లబ్ధిదారులకు 57లక్షల ఆరు వేల అరు వందల పన్నెండు రూపాయలు విలువగల కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పేదల ప్రభుత్వమని, రాష్ట్రంలోని పేద వర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కిషోర్, వరదన్, రామ్‌రెడ్డి , అనూష, బీమా సంతోష్, రాజిరెడ్డి, ముస్కు నిశాంత్ రెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## గ్రీవెన్స్ డే బాధితుల సమస్యల పరిష్కారానికి చర్యలు



**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి:** జిల్లాలో ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో భాగంగా, ఈ రోజు జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 13 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి, వారి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, సమస్యల పూర్తి వివరాలను సమర్పించాలని, ప్రతి కేసుపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు. బాధితుల సమస్యలు తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. బాధితుల యొక్క ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో పొందుపరుస్తూ నిత్యం పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు.

## బ్లాక్‌మెయిలింగ్ యూట్యూబ్ చానళ్లపై కఠిన చర్యలు

మంత్రి బండి సంజయ్



**ప్రజాపక్షం/వేములవాడ:** జర్నలిజం అనుభవం లేకున్నా యూట్యూబ్ ఛానళ్ల ముసుగులో ఇష్టానుసారం వ్యక్తిగత దూషణలు చేస్తూ కుటుంబాలపై బురద చల్లుతూ బ్లాక్ మెయిలింగ్ కు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. వీరివల్ల నిజమైన జర్నలిస్టులకు కూడా చెడ్డపేరు వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. జర్నలిస్టు సంఘాలు, ప్రెస్ క్లబ్ నిర్వాహకులు కూడా ఈ విషయంలో కఠినంగా ఉండాలని కోరారు. అదే సమయంలో ప్రజా సమస్యలపై స్పందిస్తూ సమాజ హితం కోసం పనిచేసే యూట్యూబ్ ఛానళ్లను కచ్చితంగా ప్రోత్సహించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. ఈ విషయంపై త్వరలోనే ముఖ్యమంత్రికి లేఖ రాస్తానని చెప్పారు. రాష్ట్రంలో జర్నలిస్టులు తీవ్రమైన ఇబ్బందుల్లో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చాలీచాలని జీతాలతో నెట్టుకొస్తున్న జర్నలిస్టులను ఆదుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. ఈసారి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది భారతీయ జనతా పార్టీయేనని స్పష్టం చేశారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే జర్నలిస్టులందరికీ ఇండ్లు నిర్మించడంతోపాటు హెల్త్ కార్డులు, ఇన్సూరెన్స్ అందిస్తామని హామీ ఇచ్చారు. దీంతోపాటు సమాజంలో జర్నలిస్టులు గౌరవప్రదంగా జీవించేలా చర్యలు తీసుకుంటామన్నారు. సోమవారం రోజు సాయంత్రం వేములవాడకు విచ్చేసిన కేంద్ర మంత్రి స్థానిక ప్రెస్ క్లబ్ (ఐజేయూ) ను సందర్శించారు. ప్రెస్ క్లబ్ భవన నిర్మాణానికి గతంలో రూ.10 లక్షల మేరకు ఎంపీ లాడ్స్ నిధులను మంజూరు చేశారు. ఆ నిధులతోపాటు దాతల సాయంతో నిర్మిస్తున్న ప్రెస్ క్లబ్ నూతన భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు పుట్టపాక లక్ష్మణ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన బండి సంజయ్ ను గజమాలతో ఘనంగా సన్మానించారు. బీజేపీ రాష్ట్ర నాయకులు ప్రతాప రామక్రిష్ణ, జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి, దళిత మోర్చా రాష్ట్ర నాయకులు కుమ్మరి శంకర్, ఐజేయూ జిల్లా అధ్యక్షులు బండి సంతోష్ తదితరులు హాజరైన ఈ కార్యక్రమంలో బండి సంజయ్ మాట్లాడుతూ తాను ఈరోజు ఈస్థాయికి వచ్చానంటే మీడియా సహకారమే కారణమని గుర్తు చేశారు. ప్రజల కోసం తాను చేసిన ఉద్యమాలను, కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంవల్లనే తానకు రాష్ట్ర, జాతీయ స్థాయిలో పేరు వచ్చిందని పేర్కొన్నారు. మీడియా సహకారం లేకపోతే కరీంనగర్ కే పరిమితమయ్యేవాడిని. వేములవాడ ప్రెస్ క్లబ్ భవన నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు మరో రూ.10 లక్షల సాయం అందించాలని కోరుతూ ప్రెస్ క్లబ్ నిర్వాహకులు బండి సంజయ్ ను కోరారు. సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ తప్పనిసరిగా తనవంతు సాయం అందిస్తానని హామీ ఇచ్చారు. జర్నలిస్టుల సంక్షేమం విషయంలో తాను ముందుంటానని ఉద్ఘాటించారు. ప్రెస్ మీట్ అనంతరం వేములవాడ లోని యాదవ సంఘం బోనాల ఊరేగింపు కార్యక్రమం లో పాల్గొన్నారు.

## వర్షం నీటిపాలైన ధాన్యం



**ప్రజాపక్షం/హుస్నాబాద్:** అరుగాం కష్టపడి పండించిన పంట గాలి దూమారానికి వర్షనికి కొట్టుకు పోతుంటే రైతులు లబొదిబొ మని ఏడ్చిన పట్టింకునే నాధుడే కరువైనాడని రైతులు తీవ్ర అవేదన వ్యక్తం చేశారు. సోమవారం సాయంత్రం గాలి దుమారంతో కూడిన వర్షం లో హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో అరబొసిన వరి ధాన్యం అకాల వర్షనికి కోట్టుకుసాగా రైతులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. రైతుల అరబొసిన వరి ధాణ్యం ఒకరి ధాణ్యం మరొకకరి ధాణ్యంలో కల్సి కోట్టుకుపోతుంటే రైతులు వడ్ల కొసం కొట్టు కునే పరిస్థితి ఏర్పడింది . పట్టణంలోని అనేక బోర్డంగ్‌లు చెట్లు, నేల కూలగా వ్యవసాయ మార్కెట్లో రైతులు అరబొసిన వరిధాన్యం వర్షంతో పూర్తిగా తడిసి నీటిలో కోట్టుకుపోయాయి. అకాల వర్షంతో ప్రతి ఏటా హుస్నాబాద్ వ్యవసాయ యార్కెట్‌లో రైతుల ధాణ్యానికి రక్షణ లేదని రైతు తీవ్ర అవేదన వ్యక్తం చేశారు. గత ఏడాది ఇలాగే వర్షంలో తీవ్రమైన పంట నష్టం వచ్చిన అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదని కన్నీటి పర్యంతమైనారు. మ్యాచర్ పేరుతో రైతుల ధాన్యం వెంట వెంటనే తూకం చేయకపొవడంతో రైతులు అనేక కష్టాలు పడుతున్నామని అన్నారు. కప్పుడికైన హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్‌లొ కనీస సౌకర్యలు కలిపచాలని రైతులు అధికారులను కొరుతున్నారు. తడిసిన ధాణ్యం ప్రభుత్వం వెంటనే కొనుగొలు చేయాలి.

# యువతరంగం

## ఫోకస్

# స్వయంకృషితో వెలిగిన భాస్కరుడు

హోటల్ క్లీనర్ నుంచి వ్యాపారవేత్తగా ఎదిగిన కర్నాటక హీరో కెఆర్ భాస్కర్ ప్రస్థానం యువతకు ఆదర్శం. జీవితంలో ఎదురయ్యే సమస్యలను స్వయం కృషితో ఎదిరించి, ఎదగవచ్చని నిరూపించిన భాస్కర్ 12 ఏళ్ల వయసులో బెంగళూరులోని ఒక హోటల్‌లో క్లీనర్‌గా కెరీర్ ప్రారంభించాడు. తరువాత అతను నృత్య బోధకుడిగా పనిచేశాడు. కొంతకాలం పాన్ షాప్ నడిపించాడు. పకోడీలు, బోండాలు వంటి చిరుతిళ్లు అమ్మాడు. కానీ, అతని ప్రయత్నాలు ఫలించలేదు. జీవితం స్థిరపడలేదు. అయితే, వ్యాపారవేత్తగా ఎదగాలన్న పట్టుదలను మాత్రం భాస్కర్ ఏనాడూ కోల్పోలేదు. కొత్తకొత్త ప్రయత్నాలు కొనసాగించాడు. చివరికి 23 ఏళ్ల వయసులో తన తల్లి తయారు చేసే సాంప్రదాయ వంటకం 'పురాన్‌ఫోలిన్' (బొబ్బట్లు)ను తయారు చేసి అమ్మడం ప్రారంభించాడు. ఈ తీపి వంటకం రుచి అందరినీ ఆకట్టుకుంది. దీనితో చిన్న ఫుట్‌పాత్ స్టాల్‌తో ప్రారంభమైన భాస్కర్ వ్యాపారం పుంజుకుంది. డిమాండ్ పెరగడంతో, సైకిల్‌పై తిరుగుతూ 'పురాన్‌ఫోలిన్'తోపాటు మరికొన్ని వంటకాలను స్థానిక దుకాణాలను సరఫరా చేయడం మొదలుపెట్టాడు. అంకిత భావంతో పని చేస్తున్న కారణంగా, క్రమంగా ప్రజాదరణ పెరిగింది. ఒక టీవీ చానెల్ నిర్వహించిన వంటకు సంబంధించిన కార్యక్రమంలో పాల్గొనే అవకాశం అతనికి దక్కింది. అప్పటి వరకూ పేరు లేకుండా, కేవలం తినుబండారాలను పాలిథిన్ కవర్లలో అమ్ముతున్న భాస్కర్‌కు బ్రాండింగ్‌పై దృష్టిపెట్టాలని టీవీకు హాజరైన పలువురుర ప్రముఖులు సూచించారు. నాణ్యత విషయంలో రాజీపడవద్దని సలహా ఇచ్చారు. వారి సూచనలను పాటించిన భాస్కర్ తన పేరుమీదే సొంత బ్రాండ్ 'భాస్కర్స్ మానే హోలిగే'ను స్థాపించాడు. ఈ బ్రాండ్ వేగంగా విస్తరించింది, దాదాపు ప్రతి ఎనిమిది నెలలకు ఒక కొత్త స్టోర్‌ను తెరుస్తూ అతను వ్యాపారంలో దూసుకెళ్లాడు. కర్నాటక అంతటా 17 అవుట్‌లెట్‌లు, 10 కంటే ఎక్కువ ఫ్రాంచైజీలను ఏర్పాటు చేశాడు. ఈ వ్యాపారం రూ. 18 కోట్ల వార్షిక అమ్మకాలను సాధించింది, నికర లాభం రూ. 3.6 కోట్లు. తన వ్యాపార పరిధిని మరింత విస్తృతం చేసుకోవాలన్న ఉద్దేశంతో, విట్టల్ శెట్టి, సౌరభ్ చౌదరిలను భాగస్వాములుగా చేర్చుకున్నాడు. మహారాష్ట్రలో 'భాస్కర్స్ పురాన్‌పోలి ఘర్'ను ప్రవేశపెట్టాడు. 2021, జనవరిలో మొదటి అవుట్‌లెట్ థానేలో ప్రారంభమైంది, తరువాత పూణే, కండివాలి, కళ్యాణ్‌లలో బ్రాంచీలు తెరుచుకున్నాయి. భాస్కర్ నెలకొల్పిన సంస్థలు ఎలాంటి ప్రిజర్వేటివ్స్‌ను ఉపయోగించకుండా బొబ్బట్లుసహా 24 రకాల స్వీట్లను తయారు చేస్తున్నాయి. అంతేగాక, 400 కంటే ఎక్కువ స్నాక్స్‌ను అంబాటులోకి తెచ్చాయి. భాస్కర్ కార్య దీక్షకు, అంకిత భావానికి, స్వయం కృషికి అతని ఎదుగుదలే నిదర్శనం. అతని ప్రయాణం యువతకు అనుసరణీయం.








### యూత్ ఐకాన్స్

ఎంతో మంది యువతీయువకులు దేశ కీర్తిప్రతిష్ఠలను ఇనుమడింపచేశారు. చిన్న వయసులోనే అత్యున్నత శిఖరాలను అధిరోహించారు. యువతకు మార్గదర్శకులుగా నిలిచారు. అలాంటి అద్వితీయ ప్రతిభావంతుల గురించి క్లుప్తంగా తెలుసుకుందాం..

# యుజిసి నిబంధనలకు చెల్లుచీటీ!

ప్రైవేటు విశ్వవిద్యాలయాలకు గుర్తింపు ఇచ్చే సమయంలో యుజిసి కొన్ని కఠిన నిర్ణయాలు తూచా తప్పకుండా పాటించాలి. లేకుంటే ఇంకోసారి ఆ విశ్వవిద్యాలయాలకు గుర్తింపు రద్దు చేస్తారు. కానీ ఇలాంటి ప్రైవేటు విశ్వవిద్యాలయాల్లో ఇప్పుడు ప్రో వైస్ ఛాన్సలర్, ఛాన్సలర్, బోర్డు మెంబర్లు అందరు గతంలో యుజిసి లేదా ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో ఉన్నత పదవులు నిర్వహించిన వారే. ప్రైవేటు విశ్వవిద్యాలయాల వెబ్సైట్ పరిశీలిస్తే ప్రతి ప్రైవేటు విశ్వవిద్యాలయంలో యుజిసి, ఎఐసిటిఈ, న్యాక్, ఎన్‌బిఎలో డైరెక్టర్లు, సలహాదారులు, పేరెన్నిక కలిగిన విశ్వవిద్యాలయాలలో ఉపకులపతిగా పనిచేసిన వారు ఉంటున్నారు. వీరందరూ రిటైర్ అయిన తరువాత తమ కుటుంబంతో గడుపుతుంటారు తప్ప అక్కడకు వెళ్ళేది కేవలం రెండు నెలలకు ఒకసారేనన్న విమర్శలున్నాయి. వీరంతా మా బలమని ఈ విశ్వవిద్యాలయాలు విర్రవీగు తుంటాయి. వారికైతే ప్రభుత్వ మరియు యూజీసీ వివిధ విభాగాలలో పనిచేసిన అనుభవం ఉంది కాబట్టి నందిని పందిగా సులభంగా మార్చవచ్చు. కంచె చేను మేస్తే కాపు ఏమి చేయగలరు. పేరున్న కొన్ని విశ్వవిద్యాలయాలు ప్రత్యేక ఎంట్రన్స్ పరీక్ష నిర్వహిస్తున్నారు. వీటికి దాదాపు ఒక్క హైదరాబాద్ నగరంలో సుమారు 25000 నుంచి 30000 మంది దాకా విద్యార్థులు హాజరవుతున్నారు. ఒకవైపు ప్రైవేటు విద్యను, సాంకేతిక విద్యను కట్టడి చేసాము, ప్రభుత్వ విద్య బలోపేతం చేసాము అని చెబుతున్న ప్రభుత్వం ఇప్పుడు ఏమి చేయలేని అచేతన స్థితిలో ఉంది. కొన్ని ప్రయివేటు ఇంజనీరింగ్ కళాశాలలు విద్యకు సంబంధం లేని బ్రోకర్లను కన్సల్టెన్సీలు ఆశ్రయించి అక్రిడేషన్ పొందుతున్నారు. గత దశాబ్ద కాలంగా ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో నియామకాలు లేకపోవడం, గవర్నమెంట్ యూనివర్సిటీల్లో కీలక విభాగాలు మూసివేతకు గురికావడం, రీసర్చ్ గ్రాంట్లు లేకపోవడం, అధికారంలో ఉన్న పార్టీకి ఎలక్టోరల్ బాండ్లు, డొనేషన్ ఇచ్చిన ప్రైవేటు విశ్వవిద్యాలయాలకు కోట్లు గుమ్మరిస్తున్నారు. మేజర్, మైనర్ ప్రాజెక్టులు, సెమినార్ గ్రాంట్లు అన్నీ ఒక వర్గానికే చేరుతున్నాయి. డబ్బు ఇస్తే ఏదైనా సాధ్యపడుతుంది. పరిశోధన అటకెక్కింది, రీసెర్చ్ కామన్ ఎంట్రన్స్ టెస్టులు సక్రమంగా నిర్వహించరు. ఉపకులపతుల నియామకాల్లో కాలయాపన, విశ్వవిద్యాలయాలలో చేరే సంఖ్య నామమాత్రంగా ఉంటుంది. ఏమాత్రం వసతులు లేని ఇరుకు గదుల్లో ఉన్న ప్రయివేటు యూనివర్సిటీలలో పట్టుమని పది ఎకరాల స్థలం ఉండదు కానీ వేలల్లో విద్యార్థులు ఉంటున్నారు. జనవరి నుంచి సామాజిక మాధ్యమాల ద్వారా కోట్లు ఖర్చు చేసి ప్రకటనలు ఇచ్చి విద్యార్థుల దగ్గర నుంచి లక్షలు వసూలు చేస్తున్నారు. ఫీజు నియంత్రణ ఉండదు, క్లాస్ నియంత్రణ ఉండదు. డబ్బు కడితే ఎప్పుడు కావాలన్నా, ఏ కోర్సు చేరాలన్నా సీటు దొరుకుతుంది. ప్రయివేటు ఇంజనీరింగ్ కళాశాలలో పనిచేసే చాలా మంది అధ్యాపకులు ప్రభుత్వ విశ్వవిద్యాలయాలలో సీటు రాక దాదాపు ఐదు వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రయివేటు యూనివర్సిటీలలో పీహెచ్డీ చేరుతున్నారు. అక్కడ వసతులు ఉండదు, రీసర్చ్ సూపర్వైజర్లు తరచూ మారుతుంటారు, ఎందులో పిహెచ్‌డి చేశారో తెలియదు. సన్ రైజ్, బెస్ట్, జైపూర్ నేషనల్ యూనివర్సిటీ, శ్రీ సాయి, సత్యసాయి, జంబనియా, ట్రైబ్రేవాలా, శ్రీ వెంకటేశ్వర గగ్రోల, శిక్ష ఓ అనుసంధాన్, మగధ, బుందేల్ ఖండ గోండ్వానా, జంబర్వాల్ ఇలా చాలా విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. ఎకరం భూమి ఉండదు కానీ అగ్రికల్చర్ యూనివర్సిటీ నడుపుతున్నారు. ఒక్క చెట్టు ఉండదు కానీ హార్టికల్చర్ యూనివర్సిటీ, ఏరో స్పేస్ టెక్నాలజీ, ఏరోనాటికల్ ఇంజనీరింగ్ కోర్సులు నడిపిస్తున్నారు. వ్యవస్థలో కుక్క తోక ఆడించాలి కానీ తోక కుక్కను ఆడిస్తోంది. ఇబ్బడి ముబ్బడిగా అటానమస్ ఇచ్చి అకడమిక్స్ ను నీరుగార్చారు. ఉపాధ్యాయులు పాఠాలు బోధించడం లేదు కేవలం న్యాక్, ఎన్బీఏ క్రైటీరియా పనులు చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు పట్టించుకోకపోతే రాబోయే రెండు మూడు సంవత్సరాలలో శాశ్వతంగా మూసివేసే ప్రమాదముంది. ఇటువంటి అనైతిక పద్ధతులతో మన ఉన్నత విద్యా వ్యవస్థ యొక్క సమగ్రతను దెబ్బతీస్తాయి. ప్రజల విశ్వాసాన్ని పునరుద్ధరించడానికి విద్యా నైపుణ్యం ప్రమాణాలు నిలబెట్టడానికి త్వరితగత చర్యలు అత్యవసరం.






# మంచి నిర్ణయం

శర వేగంతో విస్తరిస్తున్న కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లేదా ఎఐ)పై చైనా ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించింది. ఈ రంగంలో నిష్ణాతులను తయారు చేయాలన్న ఉద్దేశంతో, ఈ ఏడాది సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి దేశంలోని అన్ని ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలల్లో ఎఐ విద్యను తప్పనిసరి చేసింది. ప్రతి విద్యా సంవత్సరానికి కనీసం ఎనిమిది గంటల బోధన ఉంటుంది, ప్రాథమిక భావనలు, ఆచరణాత్మక ఉపయోగాలు, అధునాతన ఆవిష్కరణలపై దృష్టి పెట్టడానికి గ్రేడ్ స్థాయిని బట్టి ఈ సబ్జెక్ట్‌ను రూపొందిస్తారు. ఈ చర్య బీజింగ్ యొక్క ప్రపంచ ఎఐ లీడర్‌గా తనను తాను నిలబెట్టుకునే విస్తృత వ్యూహంలో భాగం. 2025లో జాతీయ ఎఐ విద్యా ఏకీకరణ కోసం విధానాలు, లక్ష్యాలను వివరిస్తూ ఒక శ్వేతపత్రాన్ని ప్రచురించాలని యోచిస్తోంది. ఈ చొరవ కాలిఫోర్నియా యొక్క అల్ పాఠ్యాంశ చట్టం, ఇటలీ తరగతి గది అల్ ప్రయోగాలు వంటి ప్రపంచ ప్రయత్నాలకు అనుగుణంగా ఉంటుంది. ఎఐ ఆధారిత భవిష్యత్తు కోసం సిద్ధంగా ఉన్న సాంకేతిక అవగాహన గల తరాన్ని నిర్మించాలనే చైనా యొక్క ఉత్సాహాన్ని ఇది ప్రతిబింబిస్తుంది. మొత్తం మీద పరిస్థితులను గమనించి చైనా ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకుంది. ఎఐలో చిన్నతనం నుంచే శిక్షణ ఇప్పించడం ద్వారా శాస్త్ర సాంకేతిక రంగాల్లో తిరుగులేని ఆధిపత్యాన్ని సంపాదించడం ఖాయంగా కనిపిస్తున్నది.



## ప్రభుత్వ భూముల్లో పేదలకు ఇంటి స్థలాలివ్వండి

సిపిఐ యాదాద్రి జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు



**ప్రజాపక్షం/భువనగిరిరూరల్ :** ప్రభుత్వ భూముల్లో పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు డిమాండ్ చేశారు. సోమవారం భారత కమ్యూనిస్టు పార్టీ భువనగిరి పట్టణ మూడవ మహాసభ జిల్లా పార్టీ కార్యాలయంలో బద్దం వెంకట్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా గోద శ్రీరాములు మాట్లాడుతూ భువనగిరి పట్టణ, మండల పరిధిలో ప్రభుత్వ మిగులు భూములు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆ భూములు పేదల ఇంటి నివేషణ స్థలాలకు కేటాయింపులు చేయాలని సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తున్న ప్రభుత్వాలు నిర్లక్ష్య వైఖరినీ అవలంబిస్తున్నాయని విమర్శించారు. ఎట్టి పరిస్థితులలోనూ ఆ భూములను వదలమన్నారు. అర్హులైన లబ్ధిదారులకు కేటాయింపులు ఇచ్చేంతవరకు పోరాటాలు కొనసాగుతాయని హెచ్చరించారు. భువనగిరి పట్టణం మండలంలో అర్హుల జాబితాలోని అర్జీలను పరిశీలించి స్థలాలను కేటాయించి ఇందిరమ్మ ఇండ్ల మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏశాల అశోక్ మాట్లాడుతూ ఈనెల 28న భువనగిరి తహసీల్దార్ కార్యాలయం ముట్టడి దిగ్బంధనం చేస్తామన్నారు. మహాసభలో పట్టణ కార్యదర్శి పుట్ట రమేష్, సిపిఐ సీనియర్ నాయకులు చొప్పరి సత్తయ్య, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు సోమన సబిత, జిల్లా అధ్యక్షులు వస్తువుల అభిలాష్, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి చింతల మల్లేశం, నాయకులు దాసరి లక్ష్మయ్య, చింతల పెంటయ్య, సొప్పరి సత్తయ్య, ఎండి బాబా, దాసరి మారయా, కోరే సామెల్ పాల్గొన్నారు.

## ప్రజావ్యతిరేక విధానాలు ఎండగట్టాలి

సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు




**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం హుజూర్‌నగర్‌లోని సిపిఐ కార్యాలయంలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలు చేయాలని, తద్వారా పార్టీ బలోపేతానికి కృషిచేయాలన్నారు. ప్రతి ప్రాంతంలో డివిజన్ సమావేశాలు నిర్వహించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ప్రతి పల్లెలో, పట్టణాలలో కార్మికులు, కార్యకర్తలు కార్మిక దినోత్సవమైన మేడేను విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు మామిడి వెంకటేశ్వర్లు, పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, కెవిఎన్ మూర్తి, జడ వెంకన్న, కృష్ణ, సైదులు, మస్తాన్, మల్లయ్య, ప్రసాద్, సత్యవతి రమణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాసమస్యలు గాలికి వదిలేసిన కేంద్రం

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు

గ్యాస్ ధరల పెంపు, వక్ఫ్ చట్టం రద్దుకు సిపిఐ ధర్నాలు

**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజాసమస్యలను గాలికి వదిలేసిందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు ఆరోపించారు. నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని, వక్ఫ్ చట్టాన్ని రద్దు చేయాలని సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో సోమవారం హనుమకొండ కాళోజీ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ రోజురోజుకూ నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటినా వాటిని నియంత్రించడంలో మోడీ ప్రభుత్వం విఫలం అయిందన్నారు. హిందువులు, ముస్లింల పేరుతో ప్రజలను విడగొట్టేందుకు బిజెపి ప్రయత్నిస్తోందని, అందులో భాగంగానే వక్ఫ్ సవరణ బిల్లును తీసుకుని వచ్చారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆదాయపు పన్ను, సిబిఐ, ఇడి వంటి రాజ్యాంగ సంస్థలను దుర్వినియోగం చేస్తున్నదని, మాట వినని ప్రతిపక్ష పార్టీ నాయకులపై వాటిని ఉసిగొల్పుతున్నారన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక, రాజ్యాంగ వ్యతిరేక విధానాలను మానుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆదరి శ్రీనివాస్, అశోక్ స్టాలిన్, జిల్లా సహాయ కార్యదర్శులు తోట భిక్షపతి, మద్దెల యెల్లేష్, నాయకులు మోతె లింగారెడ్డి, కర్రె లక్ష్మణ్, ఊటుకూరి రాములు, వేల్పుల సారంగపాణి, నేదునూరి వెంకటరాజం, మునిగల భిక్షపతి, బత్తిని సదానందం, మాలోతు శంకర్, మంచాల రమాదేవి తదితరులు పాల్గొన్నారు.




**వరంగల్ ప్రతినిధి :** నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని, వక్ఫ్ చట్టాన్ని రద్దు చేయాలని సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి డిమాండ్ చేశారు. సోమవారం వరంగల్ సమితి ఆధ్వర్యంలో హెడ్ పోస్ట్ ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మేకల రవి పాల్గొని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పేద మధ్యతరగతి కుటుంబాలను చిన్నాభిన్నం చేసే విధంగా నిత్యావసర వస్తువుల ధరలు పెంచుతుందన్నారు. కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్న కేంద్ర ప్రభుత్వం ప్రజల నడ్డివిరిచే విధంగా ఉందన్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థను ప్రక్షాళన చేసి పేద కుటుంబాలకు 14 రకాల నిత్యావసర వస్తువులను రేషన్ కార్డు ద్వారా అందించాలని, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఐ వరంగల్ సహాయ కార్యదర్శులు షేక్ బాష్ మియా, పనాస ప్రసాద్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు లక్ష్మణ్, గుండె భద్రి, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఓర్సు రాజు, ల్యాదల్ల శరత్, తాళ్ళపల్లి జాన్ పాల్, యండి అక్బర్ పాషా, దస్రు, నాయకులు జన్ను రాజు, కుమార్, రాజేందర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

**మహబూబాబాద్ ప్రతినిధి :** గ్యాస్ అధిక ధరలు అరికట్టాలని, వక్ఫ్ చట్టం సవరణ రద్దు చేయాలని సిపిఐ ఆధ్వర్యంలో మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి మాట్లాడుతూ అధిక ధరలు అరికట్టాలని, వక్ఫ్ సవరణ చట్టం బిల్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళనకు ముస్లీం కమిటీ బాధ్యులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బి.అజయ్ సారథిరెడ్డి, కట్టెబోయిన శ్రీనివాస్, ముస్లీం కమిటీ బాధ్యులు ఎండి ఇక్బాల్, ఫరీద్, రియాజ్, ఆషీఫ్, ఇబ్రహీం, ఇస్మాయిల్, రహీముద్దీన్‌చాంద్, పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, చొప్పరి శేఖర్, సారిక, శ్రీను, జంపాల వెంకన్న, ఎండి ఫాతిమా, వెలుగు శ్రావణ్, తూటి వెంకటరెడ్డి, అవోక్, ప్రవీణ్, వంకాయలపాటి చిరంజీవి, చీర వెంకన్న పాల్గొన్నారు.





# బిజెపి కార్పొరేట్ విధానాలపై పోరాటం

ఎఐటియుసి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వేల్పుల సారంగపాణి, జక్కుల రాజుగౌడ్

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** కేంద్రంలో మూడో సారీ అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తూ, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా, మతోన్మాద చర్యలను దూకుడుగా అమలు చేస్తుందని, ఈ విధానాలపై పోరాటం చేయాలని ఎఐటియుసి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వేల్పుల సారంగపాణి, జక్కుల రాజుగౌడ్ పిలుపునిచ్చారు. సోమవారం రామనగర్‌లోని సుందరయ్య భవన్‌లో సిఐటియు జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ అధ్యక్షతన జాతీయ కార్మిక సంఘాల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సారంగపాణి, రాజుగౌడ్ మాట్లాడుతూ కార్మికులు పోరాటాల ద్వారా సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్ లను చట్టం చేసి అమల్లోకి తీసుకువచ్చేందుకు బిజెపి ప్రభుత్వం సిద్ధం అయిందని, దీనికి వ్యతిరేకంగా గత ఐదు సంవత్సరాలుగా కార్మిక వర్గం చేస్తున్న ఆందోళన పోరాటాలను అణిచి వేస్తూ కార్మిక హక్కులను కాల రాస్తుందని వారు విమర్శించారు. 2025 –26 బడ్జెట్లో కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా కేటాయింపులు చేసిందన్నారు. సామాజిక సంక్షేమానికి కోతలు పెట్టి, సామాన్యులపై భారాలు మోపి కార్పొరేట్ గుత్తా సంస్థలకు పెట్టుబడుదారులకు వేలకోట్ల రూపాయలు రాయితీలు ప్రకటించిందన్నారు.ఉపాధి నిరుద్యోగము అధిక ధరలు ఆకలి అసమానులతో ఆరోగ్య రక్షణ లాంటి ప్రాథమిక సమస్యలను పట్టించుకోకుండా ఈ సమస్యలను మరింత తీవ్ర రూపం దాల్చే విధంగా ఆర్థిక విధానాలను విచక్షనా రహితంగా అమలు చేస్తుందన్నారు. బిజెపి ప్రభుత్వం కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలు వెనుక కొట్టేందుకు భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను రక్షించుకునేందుకు కేంద్ర కార్మిక సంఘాలు స్వతంత్ర ఫెడరేషన్లు అసోసియేషన్లు కలిసి మే 20న దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చాయని దానిని జయప్రదం చేయడం కోసం ఈనెల 27న కాకతీయ యూనివర్సిటీలో జిల్లా సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐఎఫ్టియు జిల్లా నాయకులు నున్న అప్పారావు, ఎఐసిటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్మెస్ రావు, టిఎన్టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్యాంసుందర్, ఐఎన్టియుసి జిల్లా నాయకులు మైమూదాలు, సిఐటియు జిల్లా అధ్యక్షులు టీ.ఉప్పలయ్య, కార్మిక సంఘాల నాయకులు పుల్ల అశోక్, ఎన్.రజిత, గుంటి రాజేందర్, ఆర్ కుమార్, మంద మల్లేశం, డి.భాను నాయక్, ఆర్.దుర్గాప్రసాద్, ఏ.మల్లయ్య ఆర్ వంశీ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు




## 29న యాదగిరిగుట్టలో ఎఐవైఎఫ్ జిల్లా మహాసభలు

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** అఖిల భారత యువజన సమైక్య (ఎఐవైఎఫ్) యాదాద్రి భువనగిరిజిల్లా 2వ మహాసభల కరపత్రాన్ని యాదగిరిగుట్టలో సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పేరబొయిన మహేందర్ మాట్లాడుతూ యాదగిరిగుట్టలోని లక్కీ ఫంక్షన్ హాల్ లో జరిగే జిల్లా మహాసభలకు యువత పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి బండి జంగమ్మ, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు బబ్బూరి శ్రీధర్, మండల కార్యదర్శి కల్లెపల్లి మహేందర్, మున్సిపల్ మాజీ కోఆప్షన్ మెంబర్ పేరబోయిన పెంటయ్య, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు గోరేటి రాములు, సిపిఐ పట్టణ కార్యదర్శి గోపగాని రాజు, ఎఐవైఎఫ్ మండల కార్యదర్శి కంబాల వెంకటేష్, నాయకులు అనంతుల నరసింహ, పాకలపాటి రాజు, రావుల శీను, శెట్టి నరసింహ, కంబాల సత్యం, సంగి అరవింద్, సుమంత్, శ్రీను పాల్గొన్నారు.





# స్థానికం
REGIONAL NEWS
ఖమ్మం | భద్రాద్రి కొత్తగూడెం

## జవాబుదారీతనం పెంచేందుకు : స్పెషల్ డిప్యూటీ కలెక్టర్

**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** రైతులకు జవాబుదారీతనం ను పెంచేందుకే భూ భారతి చట్టంను ప్రవేశపెట్టినట్లు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరం లు పేర్కొన్నారు. మండలం లోని కోరట్లగూడెం, అప్పలనరసింహాపురం, రాజారాంపేట గ్రామాలలో సోమవారం గ్రామ సభలు నిర్వహించారు. అప్పలనరసింహాపురం లో వివిధ సమస్యల పై 92, రాజారాంపేట లో 55, కోరట్లగూడెం లో 98 దరఖాస్తులను అందించారు. గ్రామ సభలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిస్టర్ నమోదు ను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. రైతుల వద్ద కు వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏ సమస్యల పై దరఖాస్తులు వస్తున్నాయి అని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. భూ భారతి చట్టం పై క్షేత్ర స్థాయిలో ప్రతీ ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వి.వెంకటేశ్వర్లు, తహశీల్దార్ హుస్సేన్, డిప్యూటీ తహసీల్దార్ ఇమ్రాన్, మండల రెవెన్యూ ఇన్సెపెక్టర్లు మధుసూదన్ రావు, అల్లం రవి,గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల పరిశీలన



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు మండలంలోని ల ఒకమలారం గ్రామంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను సోమవారం గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రగతి, నాణ్యత, లబ్ధిదారుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఫ్లాగ్ షిప్ కార్యక్రమైన ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా అర్హులైన వారికి శాశ్వతమైన, మౌలిక వసతులతో కూడిన ఇళ్లను అందించడమే లక్ష్యం అన్నారు. ప్రతి ఇల్లు 400 చ.అడుగుల స్థలంలో నిర్మించబడుతుందన్నారు.మంజూరైన మొత్తం రూ. 5.00 లక్షలలో భాగంగా మొదటి విడత గా లబ్ధిదారులకు రూ.1.00 లక్ష జమ చేయబడిందన్నారు. ఈ సందర్భ ంగా తోలం సుధా, బండి రాధ అ నే లబ్ధిదారులు తమ ఖాతాల్లోకి వచ్చిన మొదటి విడత నిధులతో గోడల నిర్మాణ పనులు ప్రారంభించారు. అధికారుల సూచన మేరకు పనులను వేగంగా పూర్తిచేయాలని ప్రాజెక్టు డైరెక్టర్ సూచించారు. మొత్తం 11 ఇళ్లకు బేస్‌మెంట్ పనులు పూర్తయ్యాయన్నారు. వాటిలో 7 ఇళ్ల వివరాలు ఆన్లైన్‌లో నమోదు అయ్యాయి అన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ, ఎంపిఒ, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అర్జీలను వెంటనే పరిష్కరించాలి

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రజావాణిలో వచ్చిన అర్జీలను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారిణి ఎ. పద్మశ్రీ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారిణి ఎ. పద్మశ్రీ, డిఆర్‌డివో సన్యాసయ్యతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. తల్లాడ మండలం వెంకటగిరి గ్రామానికి చెందిన డి. వీరనారాయణ తనను నీటిపారుదల శాఖ నందు ఉద్యోగంలో తీసుకోవాలని ఆర్డర్ ఇచ్చారని హైకోర్టు ఆర్డర్ ప్రకారం తనను ఉద్యోగంలోకి తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేశారు. ఖమ్మం నగరానికి చెందిన ఎం.హరి శ్రావణ్ కుమార్ 2016లో డిగ్రీ పూర్తి చేశానని తనకు సదరం సర్టిఫికెట్ ఉందని రేషన్‌షాప్ డీలర్ షిప్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేశారు. ఆయా దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, కలెక్టరేట్ఏఒ అరుణ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ శాఖ ఎస్ఇ 'ఫోన్ ఇన్'

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** విద్యుత్ వినియోగ దారుల సమస్యలపై నేడు ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఖమ్మం విద్యుత్ శాఖ ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలు పవర్ సప్లయ్ పోజిషన్, బిల్లింగ్ సర్వీస్ రిలీజ్, లోవోల్టేజీ సమస్యలు, ఇతర సమస్యలు ఏమైనా ఉంటే విద్యుత్ శాఖ ఎస్ఈ సెల్ 9440811525 నెంబర్‌కు కాల్ చేసి వినియోగదారులు తమ సమస్యలను తెలపవచ్చునని తెలిపారు. ఈ ఫోన్ ఇన్ కార్యక్రమంలో డివిజనల్ ఇంజనీర్లు పాల్గొంటారని తెలిపారు.

## ఉపాధి హామీ బిల్లులు చెల్లించాలి




**ప్రజాపక్షం/ములకలపల్లి:** గత రెండు నెలలుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ బిల్లులను వెంటనే చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ముదిగొండ రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో సంఘం మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నీరు గారిస్తుందన్నారు. గ్రామీణ ఉపాధి పథకాన్ని పట్టణ ప్రాంతాలకు విస్తరింపచేసి గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని బలోపేతం చేసి ఉపాధి హామీ పథకానికి అధిక నిధులు కేటాయించి వ్యవసాయ కూలీలకు రోజుకు కూలి రూ 500 చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పని ప్రదేశాలలో టెంటు, మెడికల్ కిట్టు, త్రాగునీరు, మజ్జిగ ప్యాకెట్లు, సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ కూలీలకు పార, గడ్డపార, తట్ట ప్రభుత్వమే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ కూలీలకు వారం, వారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎండ తీవ్రతకు మరణించిన ఉపాధి హామీ కూలీలకు 10లక్షల బీమా సౌకర్యం కల్పించాలన్నారు. ఈకార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల , తదితరులు పాల్గొన్నారు.

## నిజాయితీ చాటుకున్న యువకుడు



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** జూలూరుపాడు మండలం సూరారం గ్రా మానికి చెందిన ఓ మహిళ తన కూతురుతో కలిసి కొత్తగూడెం వెళ్లేందుకు జూలూరుపాడులోని బస్టాండ్ వద్ద బస్సు కోసం నిరీక్షిస్తుంది. ఈ క్ర మంలో ఆమె మెడలోని రెండు తులాల నల్లపూసల గొలుసు జారి పడిపోయింది. ఈ క్రమంలో మండలంలోని అన్నారు గ్రామానికి చెందిన కొమ్మిన్ని శోభన్ బాబుకు నల్లపూసల గొలుసు దొరికింది. సదరు యువకుడు జూలూరుపాడు ఎస్ఐ బాదావత్ రవి, హెడ్ కానిస్టేబుల్ దయానంద్ సమక్షంలో రూ. 2 లక్షలు విలువ చేసే నల్లపూసల గొలుసు ను మహిళకు అప్పగించాడు. దీంతోఎస్ఐ యువకుడు శోభన్ బాబును అభినందించారు.

## ఎంపిడిఒను సన్మానించిన నాయకులు



**ప్రజాపక్షం/లక్ష్మీదేవిపల్లి:** లక్ష్మీదేవిపల్లి మండల నూతన ఎంపిడిఒ గా బాధ్యతలు స్వీకరించిన అంకుబాబు ను సిపిఐ, కాంగ్రెస్ నాయకులు సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ శ్రీనివాసరావు, సిపిఐ మండల సహాయ కార్యదర్శి నునావత్ గోవింద్, పారుపర్తి రాజు, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు జల్లారపు ఈశ్వర్, నునావత్ బాలు, మాజీ సర్పంచ్ సుక్యా నాయక్, రమణయ్య, అగర్వాల్, సతీష్, బానోత్ లక్యా, జరుపుల మల్సూర్, తదితరులు పాల్గొన్నారు.

## భూ సమస్యల పరిష్కారానికి
# 'భూ భారతి చట్టం'

అవగాహన సదస్సులో ఎంపి



**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి వెబ్‌సైట్ ద్వారా పరిష్కారం లేకుండా ఉన్న భూ సమస్యల పరిష్కారానికి ప్రజా ప్రభుత్వం భూ భారతి చట్టం ప్రవేశపెట్టిందని ఖమ్మం ఎంపి రామసహాయం రఘురాంరెడ్డి తెలిపారు. ఖమ్మం రూరల్ మండలం రెడ్డిపల్లిలోని అమ్మ ఫంక్షన్ హాల్‌లో సోమవారం భూ భారతి కొత్త ఆర్ఒఆర్ చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఖమ్మం ఎంపి రామసహాయం రఘురాంరెడ్డి, జిల్లా ఇంచార్జి కలెక్టర్ డా॥ పి. శ్రీజ, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి వెబ్‌సైట్‌లో భూ సమస్యలు పరిష్కారం కాక కొత్త సమస్యలు ఏర్పడ్డాయని అటువంటి భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రజా ప్రభుత్వం భూ భారతిని ప్రవేశపెట్టిందన్నారు. సాదాబైనామా పరిష్కారం, రికార్డుల్లో తప్పుల సవరణ, దేవాదాయ భూముల పరిష్కారం, సర్వే మ్యాప్ తయారీ, భూ హక్కుల రికార్డు పరిష్కారం చూపించారన్నారు. ప్రజా ప్రభుత్వం ఎటువంటి తొందర లేకుండా సమగ్రంగా చర్చించి చట్టం తీసుకువచ్చారని భూ భారతి చట్టంపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని ఎంపి సూచించారు. ఇంచార్జ్ కలెక్టర్ శ్రీజ మాట్లాడుతూ భూ సమస్యలలో చాలా వరకు పరిష్కార మార్గాలను భూ భారతి చట్టంలో పొందుపర్చడం జరిగిందన్నారు. ప్రజలు అందించిన దరఖాస్తులను పరిశీలించి రెవెన్యూ డివిజనల్ అధికారి, జిల్లా కలెక్టర్ ఒక నిర్ణయం తీసుకుంటారని దరఖాస్తుదారునికి ఏమైనా అభ్యంతరాలు ఉంటే కలెక్టర్, భూ ట్రిబ్యునల్‌లో అప్పీల్ చేసుకోవచ్చునని తెలిపారు. అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ భూ భారతి చట్టం రూల్స్ తీసుకురావడం జరిగిందని ప్రస్తుతం ధరణిలో ఉన్న భూ రికార్డులు భూ భారతి చట్టంలో కొనసాగుతాయని భూ హక్కులకు సంబంధించి ఫిర్యాదులు ఏమైనా ఉంటే మన జిల్లాలో నూతన చట్టం అమల్లోకి వచ్చిన ఏడాది లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ఖమ్మం ఆర్డివో జి. నర్సింహారావు, వ్యవసాయ శాఖాధికారి డి. పుల్లయ్య, ఖమ్మం రూరల్ మండల తహసీల్దార్ రాంప్రసాద్, ఎంపిడివో కుమార్, ప్రజాప్రతినిధులు, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు , సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఉన్నం రంగారావు, పగిళ్ల వీరభద్రం, సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, మండల సమితి సభ్యులు వెంకట నారాయణ, పసంగుల చందర్‌రావు, బాబు, కోయ సీతయ్య, షేక్ జాని తదితరులు పాల్గొన్నారు.

### భూ భారతి చట్టంతో రైతుల సమస్యలకు సత్వర పరిష్కారం:కలెక్టర్ జితేష్ వి పాటిల్



**అశ్వాపురం:** తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతి చట్టంతో రైతాంగ సమస్యలు సత్వరమే పరిష్కారం అయ్యేందుకు మార్గం సుగమమైందని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. అశ్వాపురం మండల కేంద్రంలో ఎమ్మార్వో స్వర్ణ ఆధ్వర్యంలో జరిగిన భూ భారతిపై ఏర్పాటు చేసిన ఈ అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతాంగ భూ సమస్యలు పరిష్కారానికి గతంలో సరైన చట్టం లేక రైతులు అనేక ఇబ్బందులు పడ్డారని అన్నారు. ప్రస్తుత భూ భారతి చట్టంతో రైతులు తమ భూ సమస్యలకు సంబంధించి ఎటువంటి ఇబ్బందులు ఉన్న సత్వరమే పరిష్కారం అయ్యే విధంగా భూభారతిలో అవకాశం కల్పించడం జరిగిందన్నారు. కార్యక్రమం అనంతరం కొన్ని భూ సమస్యల మీద అశ్వాపురం మండల రైతులు వారి సమస్యల వినతి పత్రాలను కలెక్టర్‌కు అందించారు. ఈకార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, పలు రాజకీయ పార్టీల నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## వార్డు ఆఫీసర్లకు అండగా టిఎన్‌జిఓస్ యూనియన్



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** వార్డు ఆఫీసర్లకు టిఎన్‌జిఓస్ యూనియన్ ఎల్లప్పుడు అండగా ఉంటు ందని యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుంటుపల్లి శ్రీనివాసరావు, కొణిదెన శ్రీనివాస్ తెలిపారు. ఖమ్మం కార్పోరేషన్‌లో ఇంటి పన్ను వసూళ్లలో కష్టపడి పనిచేసిన 40 మంది వార్డు సభ్యులను వారు అభినందించారు. నూతనంగా గ్రూప్ 4 ద్వారా ఉద్యోగాలు పొంది ఖమ్మం కార్పోరేషన్‌లో 40 మంది వార్డు ఆఫీసర్లుగా విధుల్లో చేరారు. సోమవారం టిఎన్‌జిఓస్ కార్యాలయంలో 40 మంది వార్డు ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ వార్డు ఆఫీసర్ల సమస్యల పరిష్కారం కోసం టిఎన్‌జిఓస్ ఎల్లప్పుడు కృషి చేస్తుందన్నారు. వార్డు ఆఫీసర్లను యూనియన్ ప్రాథమిక సభ్యులుగా గుర్తిస్తూ టిఎన్‌జిఓస్ యూనియన్ డైరీని అందించారు.ఈనెల 25న ఉద్యోగుల హక్కుల సాధన కోసం జరిగే బైక్ ర్యాలీ, ఉద్యోగ సదస్సులో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ ఖమ్మం నగర అధ్యక్షులు, మున్సిపల్ ఉద్యోగ సంఘం నాయకులు ,తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వవిద్య బలోపేతం కావాలి: కూనంనేని




**ప్రజాపక్షం/పాల్వంచ:** కార్పొరేట్, ప్రైవేట్ విద్యకు ధీటుగా ప్రభుత్వ విద్య బలోపేతం కావాలని కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు ఆకాంక్షించారు. సోమవారం నవ భారత్ కంపెనీ సిఎస్ఆర్ నిధులతో రూ.37లక్షలతో మండల పరిధిలోని కేశవాపురం గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో నిర్మించిన అదనపు తరగతి గది, టాయిలెట్, పట్టణ పరిధిలోని పాలకోయతండాలో నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రభుత్వ బడులు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామని, త్వరలోనే నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలలు, మారుమూల ప్రాంతాలు అభివృద్ధికి సిఎస్ఆర్ నిధులు అభివృద్ధికి మరింత సాకారం అవుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ తహసీల్దార్ వివేక్, మున్సిపల్ కమిషనర్ కె.సుజాత, నవ భారత్ అధికారులు ఎంజీఎం ప్రసాద్, ఉప్పుశెట్టి ఖాదరంద్రబాబు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నూకల రంగారావు, కొండా వెంకన్న, సీపీఐ, కాంగ్రెస్ నాయకులు బండి నాగేశ్వరరావు, ఉప్పుశెట్టి రాహుల్, బానోత్ రంజిత్, రవి, భూక్యా విజయ్‌కుమార్, వేములపల్లి రాజశేఖర్, ఆదినారాయణ, కుమార్, రాజు, విజయ్, రాము, శాంత వర్ధన్, సుమ, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ఠకు హాజరైన కూనంనేని



**సుజాతనగర్:** సుజాతనగర్ మండలంలోని సీతంపేట బంజర గ్రామం వద్ద నూతనంగా నిర్మించిన దేవాలయంలో వసంతాల ముత్యాలమ్మ అమ్మవారు విగ్రహ ప్రతిష్ఠకు కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె సాబీర్ పాషా సోమవారం హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మ దయతో గ్రామ ప్రజలను చల్లగా చూడాలని, పాడి పంటలతో కళకళ లాడుతుండాలని ఆకాంక్షించారు. ఎంతో భక్తిశ్రద్ధలతో, మేళ తాళాలతో, మంగళ వాయిద్యాలతో ముత్యాలమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి భూక్య దస్రు, జిల్లా సమితి సభ్యులు కుమారి హనుమంతరావు, జక్కుల రాములు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తాళ్లూరి పాపారావు, ఏఐటీయూసీ మండల అధ్యక్షులు వీర్ల మల్లేష్, సిపిఐ నాయకులు మదన్ సింగ్, బొడ్డు కేశవరావు, వీర్ల దుర్గాప్రసాద్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పివికాలనీలో ప్రమాదకరంగా స్పీడ్ బ్రేకర్లు



**ప్రజాపక్షం/మణుగూరు:** సమితి సింగారం పంచాయతీ కార్యాలయం సమీపంలో పివికాలనీ రోడ్డులో రెండు రో జుల క్రితం ఆకస్మికంగా ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లు ప్ర మాదాలకు నిలయంగా మారాయని వెంటనే వాటిని తొ లగించాలని లేదా ప్రమాదాలకు ఆస్కారం లేకుండా వేగ నిరోధకాలుగా పని చేసే చిన్న పాటి బ్రేకర్లు ఏర్పాటు చే యాలని మణుగూరు ఏరియా సామాజిక సేవకులు కర్నె బాబురావు అధికారులను కోరారు. ప్రమాదాలకు నిలయంగా మారిన స్పీడ్ బ్రేకర్లను సోమవారం ఆయన సం దర్శించారు. సమితి సింగారం పంచాయతీ కార్యాల యం మూలమలుపు వద్ద కాలనీ రోడ్డులో రెండు రోజుల క్రితం నిర్మించిన స్పీడు బ్రేకర్లు ఎలాంటి హెచ్చరికలు లే కపోవడంతో గమనించగా పలువురు గాయపడ్డారని, ఓ కార్మిక నాయకుడు తెల్లవారుజామున కాలనీ ప్రయాణి స్తూ బ్రేకర్లను గమనించక ద్విచక్ర వాహనం ప్రమాదాని కి గురై తలకు గాయం కావడంతో సింగరేణి ఆసుపత్రికి తరలించారని, ప్రస్తుతం సింగరేణి మెయిన్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నారని, అధికారుల అనాలోచిత నిర్ణయం పలువురు ద్విచక్ర వాహనాలు కింద పడి గా యాల పాలయ్యారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వె ంటనే అధికారులు స్పందించి ప్రమాదాలకు నిలయంగా మారిన స్పీడ్ బ్రేకర్లు తొలగించాలని, తప్పనిసరి అయితేఎత్తు తగ్గించాలని,హెచ్చరిక బోర్డులనుఏర్పాటుచే యాలని, పెయింట్ కూడా వేయాలని, లేదా రోడ్డు నిబ ంధనల ప్రకారం స్ట్రిప్స్ బ్రేకర్స్ ఏర్పాటుచేయాలని కోరారు.

## గులాబీ దండు కదలాలి :ఎమ్మెల్సీ కవిత



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత భద్రాచలం పర్యటనలో భాగంగా సోమవారం బూర్గంపాడు మండల పరిధిలోని లక్ష్మీ పురం గ్రామంలో గల మాజీ జెడ్పిటిసి కార్యాలయంలో తేనేటి విందుకు హాజరయ్యారు. మాజీ జెడ్పిటిసి దంపతులు కామిరెడ్డి శ్రీలత, కామిరెడ్డి రామకొండారెడ్డిలు స్థానిక నాయకులతో కలిసి ఆమెకు ఘన స్వాగతం పలికారు.. స్థానిక నాయకులను కార్యకర్తలను పరిచయం చేస్తూ ఆమెతో ఫోటో సేషన్‌లో పాల్గొన్నారు. అతిథ్యాన్ని స్వీకరించి అందరిని ఆత్మీయంగా పలకరించారు. స్థానికుల నాయకులు, నాయకురాలుకు, యువతలతో ఫోటోలను దిగారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈనెల 27న జరగబోయే బిఆర్ఎస్ పార్టీ 25వ వార్షికోత్సవ పండుగకు గులాబీ దండు అంతా కదిలి రావాలని పిలుపునిచ్చారు. ఆమెతో పాటు బిఆర్ఎస్ పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ తాత మధు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంఎల్ఏ బానోత్ హరిప్రియనాయక్, మాజీ గ్రంథాలయ జిల్లా అధ్యక్షులు దిండిగల రాజేందర్, సొసైటీ ఛైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, మాజీ ఎంపిటిసి వల్లూరిపల్లి వంశీకృష్ణ, బిఆర్ఎస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం జగదీష్, బిఆర్ఎస్ పార్టీ మండల యూత్ అధ్యక్షులు గోనెల నాని, మాజీ సర్పంచులు సిరిపురపు స్వప్న, భూక్య భారతి, కుర్సం వెంకటరమణ, భూక్య శ్రావణి, సొసైటీ డైరెక్టర్ తోకల అనిత, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పొడియం నరేంద్ర, కుర్సం వెంకన్న, నాయకులు బత్తుల రామకొండారెడ్డి, కైపు నాగిరెడ్డి, దుగ్గిరెడ్డి బాలనారాయణరెడ్డి, మూల బాలరెడ్డి, గంగుల చంద్రశేఖర్, ఉండేటి గోవర్ధన్, అంగోత్ రమేష్, చక్కా నరసింహారావు, తోకల సతీష్, పాసిబోయిన గంగరాజు, నాగయ్య, చేతుల సాయి కుమార్, ప్రభాకర్, దివాకర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సానికొమ్ము రామచంద్రారెడ్డి, నరేష్, లోకిరెడ్డి సంతోష్‌రెడ్డి, సుధాకర్, చైతన్యరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## 3 రోజులలో...32 మంది విద్యార్థులు..!

కట్టుకాచారం సర్కారుబడిలో ముందస్తు బడిబాట



**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** స్థానిక ఉపాధ్యాయులు కృషి, శ్రమ, వారి గుర్తింపు తో ప్రవేట్ పాఠశాలకు వెళ్తు న్న విద్యార్థులు ప్రభుత్వ పాఠశాల వైపు పరుగులు తీస్తున్నారు. స్థానిక ఉపాధ్యాయుడు తన కూతురును అదే బడిలో చేర్పించి ఆదర్శంగా నిలిచారు. దీంతో గ్రామంలో తల్లిదండ్రులు పాఠశాల లో చేర్పించేందుకు ఆసక్తి చూపారు. ఖమ్మం జిల్లా సరిహద్దు గ్రామమైన నేలకొండపల్లి మండలం లోని కట్టుకాచారం ప్రాథమికొన్నత పా ఠశాల ఉపాధ్యాయులు ముందస్తు బడిబాట కార్యక్రమంను ప్రారంభించారు.ముందుగా ఆ పాఠశాలలో ఉపాధ్యాయుడు గా పని చేస్తున్న ఇటిక్యాల సురేష్ తన కూతురు ఇటిక్యాల ఆరాధ్య ను తన పాఠశాలలోచేర్పించారు. ఆ తరువాత గ్రామంలో విద్యార్థుల తల్లిదండ్రుల ఇళ్లకు వెళ్లి వారిని ఒప్పించారు. మూడు రోజులలోనే 32 మంది ని పాఠశాలలో చేర్పించి ఆదర్శంగా నిలిచారు. ప్రస్తుతం పాఠశాలలో 60 మంది విద్యార్థులు ఉన్నారు. సోమవారం స్థానిక అంగన్వాడీ ఆయా, పంచాయతీ కార్యాలయంలో పని చేసే సి బ్బంది పిల్లలను బడిలో చేర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామదాసు, ఇటిక్యాల సురేష్, ఎ న్.కళ్యాణిలుమాట్లాడారు. గ్రామంలోని మొత్తం విద్యార్థుల ను ప్రభుత్వ బడిలో చేర్పించే విధంగా చర్యలు తీసుకుంటు న్నాం. వారిఉద్దేశ్యంనుసాధించేలాకృషిచేస్తామని పేర్కొన్నారు.

## 25నఉద్యోగుల సదస్సు

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఉద్యోగ హక్కుల సాధన కోసం ఈనెల 25న జరిగే ఉద్యోగుల సదస్సును విజయవంతం చేయాలని తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి. బిక్కు, కాంపాటి వెంకటరమణ పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా అధ్యక్షులు బిక్కు అధ్యక్షతన యూనియన్ కార్యాలయంలో ఖమ్మంజిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఈనెల 25న జరిగే ఉద్యోగుల సదస్సు గురించి, బైక్ ర్యాలీ గురించి, సిపిఎస్ రద్దు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులరైజ్ చేయాలని, ఈ కుబేర్‌లో ఉన్న పెండింగ్ బిల్లులను ఇప్పించాలని తదితర వాటిపై సమావేశంలో తీర్మానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగుల హక్కుల సాధన కోసం జరిగే ఉద్యోగుల సదస్సులో, ఐడివోసి ఖమ్మం నుంచి టిఎన్‌జీవోస్ ఫంక్షన్ హాల్ వరకు నిర్వహించే బైక్ ర్యాలీలో నాల్గవ తరగతి ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు, నగర శాఖ కార్యవర్గ సభ్యులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా సొసైటీ అధ్యక్షులు కోడి లింగయ్య, నాయకులు వసంత రావు, గిరిజాకుమరి, మాధవి, విజయకుమారి, చంద్రిక, వెంకటరమణ, జి. వెంకటేశ్వర్లు, ప్రసాద్, టి. వెంకటేశ్వర్లు, నర్సింహారావు, జి. వీరస్వామి, నవీన్, ప్రచార కార్యదర్శి చావా నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

## మండల స్థాయి పోషణ పక్వాడ కార్యక్రమం

గర్భిణీలు మంచి ఆహారం తీసుకోవాలి
ఐసిడిఎస్ ఎసిడిపిఒ ఎం ఉషారాణి ఉద్బోధ




**ప్రజాపక్షం/కొణిజర్ల :** గర్భిణీస్త్రీలు మంచి ఆహారం తీ సుకోవాలని ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని ఐసిడిఎస్ ఎసిడిపిఒ ఎం ఉషారాణి అ న్నారు. మండల స్థాయి పోషణ పక్వాడ కార్యక్రమం మండల పరిధిలోని తనికెళ్ల రైతువేదికనందు సోమవా రం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గర్భిణీలకు శ్రీమంతాలు, పిల్లలకు అన్నప్రాసన, అక్షరాభ్యాస న కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు మహిళలకు పిల్లలకు సమతుల్య ఆహారం చాలా అవసరం అని అన్నారు. కూరగాయలు, పండ్లు విరివిగా ఉపయోగించడంవలన అధిక పోషకాలు లభిస్తాయని తెలిపారు. పాలు, కోడిగుడ్లు, పప్పుదినుసుల లో క్యాల్షియం మోతాదు అధికంగా లభిస్తుందని సూ చించారు. సిడిపిఓ సిహెచ్ కమలప్రియ మాట్లాడుతు పిల్లల వయస్సుకు తగ్గ ఆహారం తినాలని అన్నారు. 1000 రోజుల ప్రాముఖ్యత గర్భం దాల్చినప్పటినుంచి బిడ్డకు రెండు సంవత్సరాలు వయసు వచ్చేవరకు తీసుకోవాల్సిన ఆహార, ఆరోగ్యం గురించి వివరించారు. ప సిపిల్లల ఎదుగుదల బరువుల విషయంలో తల్లులు ని ర్లక్ష్యం వహించవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ డి రాజ్యలక్ష్మి , కె జ్యోతి, ఎన్ అరుణ, ప ల్లె దవాఖానా డాక్టర్ కె గీత, పిహెచ్ఎన్ కె జమున, ఎఎన్ఎం , అంగన్‌వాడి టీచర్లు పాల్గొన్నారు.



# స్థానికం

REGIONAL NEWS

వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## ప్రజా ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి: జిల్లా ఎస్‌పి



ప్రజాపక్షం/జయశంకర్‌భూపాలపల్లి ప్రతినిధి : ప్రజల ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని, సామాన్యులు నిర్భయంగా పోలీస్‌స్టేషన్లకు వచ్చి ఫిర్యాదులు అందజేయాలనీ, జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్‌పి కిరణ్ ఖరే అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా దివాస్‌లో కార్యక్రమంలో భాగంగా ఎస్పీ 18 మంది బాధి తుల నుంచి ఫిర్యాదులను స్వీకరించి, వారి సమస్య లు తెలుసుకున్నారు. అనంతరం ఫిర్యాదుదారుల సమస్యలను వేగవంతగా పరిష్కరించాలని సంబధిత పోలీసు అధికారుల ను ఎస్‌పి కిరణ్ ఖరే ఆదేశించారు.

# కదం తొక్కిన ముస్లింలు

### వక్ఫ్ సవరణ-2025 చట్టం రద్దు చేయాలని భారీ ర్యాలీ

### సంఘీభావం తెలిపిన అఖిలపక్షం



ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి: నూతన వక్ఫ్ చట్టం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మ హబూబాబాద్ జిల్లా కేంద్రంలో ముస్లిం సోదరు లు భారీ ర్యాలీ చేపట్టాలరు. ఈ ర్యాలీ, నిరసనకు అఖిపక్షపార్టీలు సంఘీభావం తెలుపుతూ ర్యాలీలో పాల్గొన్నారు. వేలాధిగా కదిలి వచ్చిన ముస్లిం నూరు భాషాలతో మానుకోట రోడ్లు జనసంద్రమయ్యాయి. ర్యాలీలో త్రివర్ణపతాకం రెపరెపలాడింది. నల్లజండాలు, రిబ్బన్‌లతో ముస్లింలు నిరసన తెలుపారు. దివ్య ఖురాన్, అం బేద్కర్ చిత్రపటాలతో ముస్లిం యువకుడు ప్రదర్శనలో ఆకర్షణగా నిలిచాడు. వక్ఫ్‌బోర్డు పరిరక్షణ కమిటీ కన్వీనర్ మహ మ్మద్ ఇక్బాల్ ఆధ్వర్యంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ముస్లింలు సాంప్రదాయ దుస్తులు ధరించి మహ బూబియా మసీదు,తహసీల్దార్ సెంటర్ నుండి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, మదర్ థెరీస్సా సెంటర్ మీదుగా ఆర్‌టిసి బస్టాండ్ వరకూ శాంతియుతంగా నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ప్రభుత్వ విప్ డాక్టర్ రాంచంద్రు నాయక్, మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్, మహబూబాబాద్ ఎంపి పోరిక బలరాంనాయక్, బిఆర్ ఎస్ మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎంపి మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్ మాట్లాడుతూ సెక్యులర్ పార్టీల బాధ్యులు, వివిధ సంఘాల బాధ్యులు, మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చట్టం రూపంలో తీసుకువచ్చిన నూతన వక్ఫ్‌బోర్డు ఉమ్మీద్, వక్ఫ్ భూములు, ఆస్తులు, ఖజానాను ముస్లింల నుండి లాక్కునే ఉద్దేశ్యంతో తీసుకువచ్చిన చట్టాన్ని రద్దుచేసేవరకూ ఏ ఒక్కరూ విశ్రాంతి తీసుకోరాదని తెలిపారు. వ క్ఫ్ ముస్లింలకు దానం రూపంలో సంక్రమిం చినాస్తి, దానిపై ఆంక్షలు పెట్టి ముస్లింల ఆర్థిక మూలాలను కేంద్ర ప్రభుత్వం నాశనం చేస్తోందని వారు పేర్కొన్నారు. వక్ఫ్ బోర్డులో ముస్లింయేతరులకు సభ్యులుగా అవకాశం కల్పించడం ద్వారా వారి నిర్ణయ అధికారానికి భంగాన్ని కలిగి స్తోందన్నారు. వక్ఫ్ యా జర్‌పైపూర్తి హక్కులను వక్ఫ్ బోర్డుకే ఇవ్వాలన్నారు. వక్ఫ్ ఆస్తుల పత్రాలను కోరడం, లేకుంటే స్వాధీనం చేసుకుని ఇతరులకు కట్టబెట్టాలని కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. ఇకనైనా ముస్లింలు మేలుకో క పోతే మునుముందు వారి అస్తిత్వానికే ప్రమాదం ఉందని వారు హెచ్చరించారు. అందుకే ముస్లింలందరూ నేడు రోడ్ల పైకి వచ్చి వక్ఫ్ బోర్డు చట్టాన్ని రద్దు చేయాల్సిందిగా డిమాండ్ చేస్తున్నారన్నారు. ఈ ర్యాలీలో సిపిఐ జిల్లా కార్యదర్శి విజయసారథి, అజయ్‌సారథిరెడ్డి, సూర్నపు సోమయ్య, గుగ్గిళ్ళ పీరయ్య, డోలి సత్యనారాయణ, నూరు భాషా సంఘం బాధ్యులు మహిపాష, నాజర్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు వీడాలి

### పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలి

### సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు పంజాల రమేష్



ప్రజాపక్షం/ నర్సంపేట కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు విడనాడాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్ అన్నారు. వరంగల్ జిల్లా సమితి ఇచ్చిన పిలుపులో భాగంగా నర్సంపేట పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో సోమవారం నిరసన కార్యక్రమాన్ని సిపిఐ నర్సంపేట మండల సమితి ఆధ్వర్యంలో నిర్వహి ంచారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్ మాట్లాడుతూ దేశంలో అధికారం లోఉన్న బిజెపి మోదీ ప్రభుత్వం ప్రజా సమస్యలను విస్మరించి, ప్రజల్ని పక్కదారి పట్టించే మతోన్మాదాన్ని రెచ్చగొట్టే విధంగా ప్రజల మనోభావాలను పక్కదారి పట్టించి పరిపాలన సాగించాలని చూస్తున్న దన్నారు. గ్యాస్ ధరలు విపరీతంగా పెంచే విధానాలను ప్రవేశపెడుతూ కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేసే ఆర్థిక విధానాలలో అమలు చేసే మోడీ ప్రభుత్వాన్ని ప్రజలు గద్దె దించే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. ఇప్పటికైనా పెరిగిన గ్యాస్ ధరలను తగ్గించాలని లేకుంటే ప్రజల ఆగ్రహానికి గురి కావల్సి వస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గొంపల్లి మునీశ్వర్, అక్క పెల్లి రమేష్, మండల కార్యదర్శి గడ్డం యాక య్య, జిల్లా నాయకులు ఇల్లందుల సాంబయ్య, గడ్డం నాగరాజు, శైలజ, మంజుల, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక చొరవ చూపండి: అశ్విని

ప్రజాపక్షం/ఖిలా వరంగల్: ప్రజా సమస్యల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే అభిప్రాయపడ్డారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని పురస్కరించుకొని బల్దియా ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ ఛాంబర్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కమిషనర్ హాజరై ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి పరిష్కారం కోసం ఆయా విభాగాల ఉన్నతాధికారులకు అందచేశారు. ఈ సందర్భంగా మొత్తం 128 దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, డిఎఫ్ఓ శంకర్‌లింగం, ఇన్‌చార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, హెచ్ఓలు రమేశ్, లక్ష్మారెడ్డి, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్నరాణి, రాజేశ్వర్, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి సమస్యలు పరిష్కరించండి

### జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల సమస్యలను నేరుగా ప్రభుత్వ అధి కారులకు తెలియజేసి, వాటిని సత్వరమే పరిష్కరించేందుకు రూపొందించిన ప్రజాసంబంధ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. సోమవారం ఐడిఒసి కార్యాలయంలో అన్ని శాఖల జిల్లా అధికారులతో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించి, జిల్లాలోని వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను అడిగి తెలుసుకొని స్వ యంగా దరఖాస్తులు స్వీకరించారు.కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, సమస్యల పరిష్కారం కోసం సమర్పించిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచ కుండా, సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని, దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్ చేసినట్లు తెలిపారు. ప్రజావాణిలో 52 దరఖాస్తులు వచ్చాయని, ప్రజల ఫిర్యాదులను స్వీకరించి, వాటిని సం బంధిత శాఖలకు ఎండార్స్ చేసి, త్వరితగతిన పరిష్కారించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## దరఖాస్తులు సత్వరమే పరిష్కారం



ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి: ప్రజావాణి ధరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జనగామ జిల్లా అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో స్పెషల్ డిప్యూటి కలెక్టర్ సుహాసిని, జనగామ ఆర్‌డిఓ గోపి రామ్‌లతో కలిసి ప్రజల నుండి విజ్ఞప్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రజల నుండి స్వీకరించిన ధరఖాస్తులపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవ సరం ఉందన్నారు. ధరఖాస్తులను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని, ఈ విషయంలో అధికారులు అంకిత భావంతో పనిచేయాలన్నారు. జిల్లాలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల గ్రౌడింగ్ ప్రక్రియను వేగవంతం చేయా లని, లేఅవుట్ క్రమబద్ధీకరణకు ఈ నెలాకరు వరకు అవకాశం ఉన్నందున ప్రజలు దీనిని ఉపయోగించుకొని 25 శాతం రాయితీ పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఓ వసంత, మున్సిపల్ కమీషనర్ వెంకటేశ్వర్లు, డిపిఓ స్వరూప, డీఏఓ రామారావు నాయక్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## దరఖాస్తుల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

### అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్



ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి : ప్రజావాణిలో ఫిర్యాదు చేసే దరఖా స్తులను నిర్లక్ష్యం చేయకుండా సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్‌రావుతో కలిసి ప్రజల నుండి ఆర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కొన్ని దరఖాస్తులు అక్కడికక్కడే పరిష్కరించారు. ప్రజావాణికి మొత్తం 39 దరకాస్తులు వచ్చాయి. అత్యధికంగా రెవెన్యూ భూమి సమస్యలపై 16 దరఖాస్తులు, ఉపాధి కల్పన కోసం 4, ఇందిరమ్మ ఇండ్ల మంజూరు కోరుతూ 3 ఇతర శాఖల కార్యాలయాలకు సంబంధించినవి 16 దరఖాస్తులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నిరుద్యోగ యువతకు ఉపాధే లక్ష్యం

### మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



ప్రజాపక్షం/పాలకుర్తి: పాలకుర్తి నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు మాజీ మంత్రి దయాకర్‌రావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బృందావన్ గార్డెన్ స్‌లో ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బబ్బూరి శ్రీకాంత్ ఏర్పాటుచేసిన జాబ్ మేళా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూనిరుద్యోగ యువత వివిధ కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని లక్ష్యంతో శ్రీకాంత్ ఈ జాబ్‌మేళా నిర్వహించడం అభినందనీయమన్నారు.ఈనెల 27న నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయ కులు నవీన్, నాగిరెడ్డి, దయాకర్, సుందర్‌రాంరెడ్డి, శ్రీనివాసరావు, అశోక్‌రెడ్డి, బాలు, మల్లేశం, భాస్కర్, పాపారావు, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## కొడకండ్లలో వ్యక్తి దారుణ హత్య

ప్రజాపక్షం/కొడకండ్ల: కొడకండ్ల మండలంలోని రేగులతండాలో గుగులోతు శ్రీను (55) అనే వ్యక్తి సోమవారం దారుణహత్యకు గురయ్యారు. ఈ సందర్భంగా సిఐ మహేందర్‌రెడ్డి, ఎస్ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం ఇటీవల మృతుడు శ్రీనుకు నిందితుడు గుగులోతు జైత్రంకు ఎద్దులను ఇంటి వెనకాల కట్టేసిన విషయంలో గొడవ జరిగిందని దీన్ని మనసులో పెట్టుకుని గుగులోతు జైత్రాం ఆదివారం రాత్రి తన ఇంటి ముందు నిద్రిస్తున్న శ్రీనుని పదునైన ఆయుధంతో చాతిపై, ఇతర చోట్ల దాడిచేశాడన్నారు. దీంతో శ్రీను అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలిపారు. మృతుని కుమారుడు వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## భూసమస్య పరిష్కారానికి 'భూభారతి' వేదిక

### జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్

### కొత్తగూడ, గంగారంలో అవగాహన



ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి: భూ సమస్య పరిష్కారానికి గొప్ప వేదిక భూ భారతి ఆర్ఓఆర్ చట్టం–2025 అని, అప్పీల్ చేసిన ప్రతి రైతులకు భూ భారతి చట్టం ద్వారా పక్కా న్యాయం జరుగుతుందని మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన దీనిపై అవగాహనా సదస్సు సోమవారం కొత్తగూడ, గంగారం మండల కేంద్రం రైతు వేదికల్లో జరిగింది. తొలుత తెలంగాణ గీతం ఆలపించి, పిపిటి చదివి రైతులకు భూభారతి కొత్త ఆర్ఓఆర్ చట్టంపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి భూ సమస్య సులభంగా పరిష్కారం కోసం ఈ భూభారతి చట్టం ఈ పోర్టల్ చాలా ఉపయోగపడు తుంద న్నారు. ఇప్పుడు సామాన్య ప్రజలకు, రైతులకు అందుబాటులో భూ సమస్య పరిష్కారం కోసం భూ భారతి ఆర్ఓఆర్ చట్టం వచ్చిందని సంబంధిత అధికారులకు సూచించారు. రైతు చేసుకున్న దరఖాస్తును పరిశీలించి అధికా రులకు కేటాయించిన సమయంలో రైతుల దరఖాస్తుకు సమాధానం పరిష్కారం చూపే విధంగా ఈ కొత్త చట్టం ఉంటుందన్నారు. దీనికి సంబంధించి పూర్తి అధికారాలు గ్రామ అధికారి తహసీల్దారు, ఆర్‌డిఒ అధికారి కలెక్టర్ స్థాయిలో ఇప్పుడు వర్తిస్తుందని రైతులు ఎలాంటి భూ సమసయలకైనా అప్పీల్ ద్వారా హక్కు పొందే స్వేచ్ఛ రైతులకు, ప్రజలకు ఉంటుందన్నారు. ఈ సదస్సులో అదనపు కలెక్టర్లు కె.వీరబ్రహ్మాచారి(రెవిన్యూ), ఆర్‌డిఒ కృష్ణవేణి, స్థానిక తహసీల్దార్లు రమాదేవి, సత్యనారాయణ, ఎంపిడిఒలు రవీంద్ర ప్రసాద్, బి.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

## త్వరితగతిన ఇందిరమ్మ ఇండ్లకు వెరిఫికేషన్

### మే రెండో తేదీన అర్హుల జాబితా ప్రదర్శన

### హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య



ప్రజాపక్షం/హనుమకొండప్రతినిధి : ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికకు వెరిఫికేషన్ అధికారులు ఈనెల 22 నుండి 30వ తేదీ వరకు వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తిచేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికకు నియమితులైన మండల స్థాయి వెరిఫికేషన్ ఆఫీసర్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య వెరిఫికేషన్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి మం డలంలో నలుగురు అధికారులను వెరిఫికేషన్ ఆఫీసర్లుగా నియమించడం జరిగిందన్నారు. గ్రామాల్లో ఇందిరమ్మ ఇం డ్ల లబ్ధిదారుల ఎంపికకు ఇప్పటి వరకు ఇందిరమ్మ కమిటీ సభ్యులతోపాటు ఎంపీడీవోలు, పంచాయతీ కార్యద ర్శులు పరిశీలించారని, ఇప్పుడు మండల స్థాయిలో వెరిఫికేషన్ ఆఫీసర్లు పరిశీలిస్తారన్నారు. పంచాయతీ కార్యద ర్శులు సమ ర్పించిన వివరాలు రాష్ట్రస్థాయిలో పరిశీలనలో ఉన్నాయన్నారు. మూడు కేటగిరీల లిస్టులను ఇందిరమ్మ కమిటీ సభ్యు లు, అధికారులు అర్హుల జాబితాను పరిశీలిస్తారని, ఇందిరమ్మ ఇండ్లు పథకానికి ఎంపిక చేసే లబ్ధిదా రులలో మహిళ లు పేర్లను మాత్రమే అర్హులు జాబితాలో పెట్టాలని, వారి వివరాలను నమోదు చేయాలన్నారు. ఈ పథకానికి రేషన్ కార్డు తప్పనిసరి కాదు అని, దీనిపై ప్రభుత్వ మార్గదర్శకాలు ఇంకా రాలేదన్నారు. లబ్ధిదారులు బిపిఎల్ అయి ఉంటే చాలు నన్నారు. ఈ సందర్భంగా కాజీపేట మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ గోడిశాల రవీందర్ మున్సిపల్ పరిధి లోని డివిజన్ల వెరిఫికేషన్ గురించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పరకాల ఆర్డిఒ డాక్టర్ నారాయణ, గృహ నిర్మాణ శాఖ డిఇ సిద్ధార్థ నాయక్, జిల్లాలోని ఎంపిడిఒలు, డిప్యూటీ తహసీల్దారులు, ఏఇలు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ జోక్యం వద్దు

### డిహెచ్‌పిఎస్ జిల్లా కార్యదర్శి భద్రయ్య

### దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా




ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెడుతున్న రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ జోక్యం లేకుండా పారదర్శకంగా ఎంపిక చేయాలని దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) జిల్లా కార్యదర్శి రాసపల్లి భద్రయ్య, జాతీయ సమితి సభ్యురాలు పొన్నగంటి లావణ్యలు డిమాండ్ చేశారు. సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్‌సి సబ్ ప్లాన్ నిధుల ద్వారా దళితవాడల్లో ప్రభుత్వ విద్య సంస్థల్లో మౌలిక వసతులు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డులు అందజేయాలని కోరారు. దళితులపై దాడికి పాల్పడిన వారిపై ఎలాంటి జాప్యం లేకుండా తక్షణమే చట్టపరంగా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్న పేదలకు ఇండ్ల పట్టాలు ఇవ్వాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మేనిఫెస్టో లోని ప్రతి ఒక్క పథకం అమలు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి సమితి తరపున డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో డిహెచ్‌పిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి పెద్దమాముల సంధ్య, ఉపాధ్యక్షులు దొంతుల రవీందర్, లోక రాజబాబు,చిట్యాలపద్మ,బౌతు కమలాకర్, పాల్గొన్నారు.

## కాలువలు, వాగులు ధ్వంసం చేస్తే సహించం

### వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్.నాగరాజు



ప్రజాపక్షం /ఎల్కతుర్తి : బిఆర్ఎస్ రజతోత్సవ సభ పేరుతో రైతులకు నీరు అందించే వాగులను కాలువలను ధ్వంసం చేస్తే సహించేది లేదంటూ వర్ధన్నపేట ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇచ్చిన సమాచారం మేరకు రజతోత్సవ సభ పేరుతో కాలువలు వాగులను ధ్వంసం చేసి పూడ్చివేత చేసిన వాటిని కాంగ్రెస్ నాయకులతో కలిసి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హసన్ పర్తి మండలం అనంతసాగర్ శివారులోని మాటు వాగుకు సంబంధించిన కాలువలో రాత్రికి రాత్రే ఎటువంటి అనుమతులు లేకుండా మట్టిని తీసుకు వెళుతున్న బిఆర్ఎస్ నాయకులపై మండిపడ్డారు. రజతోత్సవ సభకు వాహనాల పార్కింగ్ సౌకర్యం కోసం దేవాదుల కాలువకు సంబంధించిన పిల్ల కాలువలను మట్టితో పూడ్చడం సరికాదన్నారు.అధికారుల తీరుపై చరవాణిలో మండిపడ్డారు. కాలువలు, వాగుల ధ్వంసంపై విచారణ చేసి నివేదిక అందించాలని అధికారులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి సభ్యులు బొమ్మనపల్లి అశో క్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఇంద్రసేనారెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు సంతాజీ, సింగిల్ విండో మాజీ చైర్మన్ గోలి రాజేశ్వరరావు, మాజీ సర్పంచ్ గొడిశాల యాదగిరి గౌడ్, యూత్ మండల అధ్యక్షులు అంబాల శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, తదితరులుపాల్గొన్నారు.

## పిల్లలకు ప్రత్యేక టీకా తప్పనిసరి

### డిఎంహెచ్ఓ డాక్టర్ కె మల్లిఖార్జున్‌రావు



ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి: ఇప్పటి వరకు టీకా వేయించని పిల్లలకు, వేయించి మధ్యలో వదిలేసిన వారికి ప్రత్యే వ్యాధి టీకాలు వేయించాలని డిఎంహెచ్ఓ డాక్టర్ కె మల్లిఖార్జున్‌రావు కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలో ప్రత్యేక వ్యాధి టీకా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భండి ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 21 నుండి 28 వరకు ప్రత్యేక టీకాలు కార్యక్రమం జరగనుందని, అన్ని ప్రాథమిక ఆరోగ్య కేం ద్రాలలో, సబ్ సెంటర్లలో టీకా కార్యక్రమం జరుగుతుందన్నారు. పిల్లలకు వ్యాధి నిరోధక శక్తి పెరుటుతుందని, తల్లిదండ్రులు తప్పకుండా తమ పిల్లలకు టీకాలు వేయించాలన్నారు. ఇటుక బట్టీలు, నిర్మాణ ప్రాంతాలు, సంచార జాతులు, కోళ్ల ఫారంలు, రైస్ మిల్స్, జిన్నింగ్ మిల్స్ ప్రాం తా లలో నివసంచే టీకా తప్పనిసరిగా పిల్లలకు సమీప ప్రాథమిక ఆరోగ్య కేం ద్రాల్లో, ఉప ఆరోగ్య కేంద్రాల్లో టీకాలు ఇప్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో యుపిహెచ్‌సి జనగామ వైద్యాధికార డాక్టర్ శ్రీతేజ పాల్గొన్నారు.

## భూ భారతితోనే భూ సమస్యలకు పరిష్కారం


### చట్టంపై అవగాహన కలిగి ఉండాలి

### జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్




ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి:ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూ సమస్యలను పరిష్కరించడానికి అమలు చేయనున్న భూ భారతి చట్టం ద్వారా ఎక్కువ మొత్తంలో భూ సమస్యలు పరిష్కారం అవుతాయని, భూ భారతి చట్టంపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. సోమవారం మల్లంపల్లి మండల కేంద్రంలో భూ భారతిపై నిర్వహించిన అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పాల్గొని రైతులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధరణిలోని పొరపాట్లను సవరించేందుకు కలెక్టర్‌కు మినహా ఏ అధికారికి అవకాశం లేదని చెప్పారు. దీనివలన తహసీల్దారు స్థాయిలో పరిష్కారమయ్యే చిన్న సమస్యలు కూడా వేల సంఖ్యలో పేరుకుపోయేవని అన్నారు. చిన్న చిన్న సమస్యలు కూడా తహసీల్దార్లు, ఆర్‌డిఓ పరిష్కరించలేని పరిస్థితి ఉండేదని పేర్కొన్నా రు. భూ భారతి చట్టం ద్వారా ప్రభుత్వం భూ సమస్యలపై స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చిందని తెలిపారు. ఈ చట్టం ద్వారా పొరపాట్ల సవరణకు అవకాశం ఉందని, మ్యూటేషన్ దరఖాస్తులు త్వరితగతిన పరిష్కారంఅవుతాయని తెలిపారు. రెం డింతల అప్పీలు వ్యవస్థతో రైతులు, ప్రజలు భూసమస్యలపై కోర్టు వరకు వెళ్ళాల్సిన అవసరం దా దాపు ఉండదని తెలిపారు. 2014 సంవత్సరంలో సాదా బైనామా కోసం కానీ 2020 సంవత్సరంలో అప్ప టి ధరణి పోర్టల్‌లో పేరు నమోదు చేసుకొని ప ట్టాలు పొందడానికి ప్రయత్నించినప్పటికి సమస్యలు పరిష్కారం కానివి నేటి ప్రజా ప్రభుత్వం తెచ్చిన భూ భారతి చట్టం ద్వారా సమస్యలు పరిష్కారవుతాయన్నారు. గతంలో ఉన్న చట్టానికి అనుగుణంగామరో 14నూతన అంశాలను ప్రభుత్వం పొందుపరిచిందని, 2010 సంవత్సరంలో ప్రతి వ్యక్తి తన గుర్తింపు కోసం ఆధార్ ఎలా పొందారో అదే తరహాలో భూ భారతి ద్వారా భూమి హక్కు పట్టాలను పొందగలుగుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ వెంకటేష్, తహసీల్దారు విజయభాస్కర్, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట : ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



ప్రజాపక్షం/పాలకుర్తి: ప్రజా ప్రభుత్వం, సిఎం రేవంత్ రెడ్డి విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.30లక్షల నిధులతో చేపట్టే ప్రహారీనిర్మాణం, టాయిలెట్ల నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు. అనంతరం వంట గదిని పరి శీలించి భోజన నాణ్యతను తనిఖీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సరైన విద్యతోపాటు పోషకాలతో కూడిన మధ్యాహ్న భోజనం అందించడం మన బాధ్యతన్నారు. పాలకుర్తి ప్రజల చిరకాల వాంఛ అయిన డిగ్రీ కళాశాలను మంజూరు చేయమని సిఎం దృష్టికి తీసుకెళ్లినట్లు మంజూరు చేయ దానికి సుముఖంగా ఉన్నారన్నారు. ప్రతి పేదవానికి విద్యను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వ స్కూల్స్ పనిచేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి హనుమాండ్ల ఝాన్సిరెడ్డి, మార్కెట్ చైర్‌పర్సన్ మంజుల భాస్కర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు గిరగాని కుమారస్వామి, పాఠశాల హెచ్‌ఎం శోభారాణి, నాయకులు నాగయ్య, రమేష్, రాఘవరావు, యాకాంతరావు,తదితరులు పాల్గొన్నారు.

### భూ భారతి చట్టంతో భూ సమస్యలు సత్వరమే పరిష్కారానికి



భూ సమస్యల సత్వర పరిష్కారం కోసం భూ భారతి చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిందని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో భూ భారతిఆర్ఓఆర్ చట్టంపై అవగాహన సదస్సులను నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బా షా షేక్, అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్, మార్కెట్ చైర్‌పర్సన్ మంజుల భా స్కర్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మాట్లాడుతూ భూ భారతి చట్టం ద్వారా భూముల రికార్డులు పారదర్శకంగా నిర్వహించి భవి ష్యత్ తరాలకు భూ హక్కుల విషయంలో స్పష్టత కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ఈ కార్యక్ర మంలో ఆర్‌డిఒ వెంకన్న, తహశిల్దార్ నాగేశ్వరాచారి, ఎంపిడిఒ రాములు, వ్యవసాయశాఖ అధికారులు పరుశురాం, శరత్‌చంద్ర, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

# క్రీడ

## గిల్‌కు చేజారిన.. శతకం!

తగ్గేదేలే అంటూ కోల్‌కతా నైట్ రైడర్స్ బౌలర్లను ఉతికేసిన ఓపెనర్లు గిల్, సాయి



టేబుల్ టాపర్ గుజరాత్ టైటాన్స్ బ్యాటర్లు తగ్గేదేలే అంటున్నారు. నిలకడగ ఆడుతూ భారీ స్కోర్లతో విరుచుకుపడుతున్నారు. ఈడెన్ గార్డెన్స్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ బౌలర్లను ఉతికేశారు ఓపెనర్లు శుభ్‌మన్ గిల్(90), సాయి సుదర్శన్(52). తమ జోడీ ఎంతో పవర్‌ఫుల్ అని చాటుతూ అదిరే అరంభం ఇచ్చారు. కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడిన గిల్ సెంచరీని చేజార్చుకోగా.. ఆఖర్లో జోస్ బట్లర్(41 నాటౌట్) మెరుపులు మెరిపించాడు. కుర్రాడు షారుఖ్ ఖాన్(11 నాటౌట్)సైతం చెలరేగగా గుజరాత్ నిర్ణీత ఓవర్లలో3 వికెట్లు కోల్పోయి 198రన్స్ కొట్టింది. సొంతమైదానంలో చెలరేగి పోయే కోల్‌కతా బ్యాటర్లు ఛేదనలో ఏం చేస్తారో చూడాలి. టాస్ ఓడిన గుజరాత్ టైటాన్స్‌కు ఓపెనర్లు శుభ్‌మన్ గిల్ (90 : 55 బంతుల్లో 10 ఫోర్లు, 3 సిక్సర్లు), సాయి సుదర్శన్(52 :36 బంతుల్లో 6 ఫోర్లు, ఒక సిక్సర్ )లు బలమైన పునాది వేశారు. కోల్‌కతా బౌలర్లకు ఏ మాత్రం అవకాశం ఇవ్వకుండా బౌండరీలతో చెలరేగారు. పవర్ ప్లే తర్వాత జోరు పెంచిన గిల్ 34 బంతుల్లోనే అర్ధ శతకం బాదేయగా.. హర్షిత్ రానా బౌలింగ్‌లో సిక్సర్ కొట్టిన సాయి సైతం ఫిఫ్టీకి చేరువయ్యాడు. వీళ్లిద్దరి మెరుపులతో గుజరాత్ స్కోర్ 100 దాటేసింది. ప్రమాదకరంగా మారిన ఈ జోడీని విడదీసేందుకు కోల్‌కతా కెప్టెన్ అజింక్యా రహానే బౌలర్లను మార్చినా ఫలితం లేకపోయింది. అయితే.. ఎట్టకేలకు రస్సెల్ విజయవంతమయ్యాడు. డేంజరస్ సుదర్శన్ ఔటయ్యాక జోస్ బట్లర్(41 నాటౌట్) జతగా గిల్ రెచ్చిపోయాడు. ఎడాపెడా బౌండరీలు బాదిన అతడు రెండో వికెట్‌కు 58 రన్స్ జోడించాడు. సెంచరీకి చేరువైన గిల్.. వైభవ్ బౌలింగ్‌లో పెద్ద షాట్ ఆడి రింకూ చేతికి చిక్కాడు. ఆ తర్వాత వచ్చిన రాహుల్ తెవాటియా(0)ను హర్షిత్ పెవిలియన్ పంపాడు. వైభవ్ వేసిన 20వ ఓవర్లో బట్లర్ రెండు ఫోర్లు కొట్టగా షారుఖ్ ఖాన్(11 నాటౌట్) ఐదో బంతిని స్టాండ్స్‌లోకి పంపాడు. దాంతో, గుజరాత్ నిర్ణీత ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 198 రన్స్ చేసింది.

## చరిత్ర సృష్టించిన కశ్మీర్ కండలవీరుడు..




జమ్మూ కశ్మీర్ వెయిట్ లిఫ్టర్ ముమిన్ దార్ చరిత్ర సృష్టించాడు. 'అత్యంత బలశాలిగా' రికార్డు నెలకొల్పాడు. తమ ప్రాంతంలో జరిగిన పవర్ లిఫ్టింగ్, డెడ్‌లిఫ్ట్ ఛాంపియన్‌షిప్ 2025లో ముమిన్ ఏకంగా 663.5 కిలోల బరువులు ఎత్తి ఔరా అనిపించాడు. దాంతో, జమ్ముకశ్మీర్‌లోని స్ట్రాంగెస్ట్ మ్యాన్‌గా రికార్డు పుస్తకాల్లో చోటు సంపాదించాడీ 23 ఏళ్ల లిఫ్టర్. సీనియర్, జూనియర్.. రెండు విభాగాల్లో పోటీ పడిన ముమిన్ రికార్డు స్థాయిలో బరువులెత్తాడు. మొదట స్క్వాట్ పొజిషన్‌లో 241 కిలోలు ఎత్తిన ముమిన్.. బెంచ్ ప్రెస్‌లో 172.5 కిలోల్ని అలవోకగా మోశాడు. ఆ తర్వాత కీలమైన డెడ్‌లిఫ్ట్‌లోనూ ఏమాత్రం తొణకకుండా 250 కిలోల బరువు మోసిన అతడు మొత్తంగా 663.5 కిలోలతో సరికొత్త చరిత్ర లిఖించాడు. తాను సాధించిన ఈ ఘతన పట్ల సంతోషం వ్యక్తం చేసిన ముమిన్.. టైటిల్ గెలుపొందడం గర్వంగా ఉందని చెప్పాడు. 'వెయిట్ లిఫ్టింగ్‌లో రికార్డు నెలకొల్పడం సంతోషంగా ఉంది. జమ్ముకశ్మీర్‌లోనే స్ట్రాంగెస్ట్ మ్యాన్‌గా పేరొందడం నిజంగా నాకెంతో గర్వకారణం. నాతో పాటు చీనాబ్ లోయవాసులంతా గర్వపడే క్షణమిది. ఈ టైటిల్ విజయం వెనక కొన్నేళ్ల శ్రమ దాగి ఉంది. ఈ స్థాయికి రావడానికి ఎన్నో త్యాగాలు చేశాను. ఈ విజయాన్ని మా ప్రాంతంలోని యువతకు అంకితం చేస్తున్నా. నన్ను స్ఫూర్తిగా తీసుకొని వాళ్లు తమ అభిరుచుల్లో రాణించాలని కోరుకుంటున్నా' అని వెల్లడించాడీ పవర్ లిఫ్టర్.

## పాకిస్థాన్ కెప్టెన్‌కు 'గోల్డ్ ఐ ఫోన్' గిఫ్ట్

పాకిస్థాన్ సూపర్ లీగ్‌లోని కరాచీ కింగ్స్ తమ క్రికెటర్లకు హెయిర్ డ్రయ్యర్, ట్రిమ్మర్‌లను కానుకలుగా ఇవ్వడం చూశాం. అయితే.. లాహోర్ క్యాలండర్స్ మాత్రం ఓ అడుగు ముందుకేసి తమ కెప్టెన్ షాహీన్ ఆఫ్రిదికి బంగారు ఐ ఫోన్‌ను గిఫ్ట్‌గా అందించింది. దాంతో, ఆఫ్రిదితో పాటు క్యాలండర్స్ జట్టు ఆటగాళ్లు ఆశ్చర్యానికి గురయ్యారు. కెప్టెన్‌గా, పేసర్‌గా రాణిస్తూ లాహోర్ జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాడు అఫ్రిది. దాంతో, అతడి కోసం ప్రత్యేకంగా 24 క్యారట్ల బంగారంతో ఐ ఫోన్ 16 ప్రోను తయారు చేయించింది యాజమాన్యం. ఈస్టర్ సంబర్భంగా మైదానంలో అతడిని ఆశ్చర్యపరుస్తూ ఈ స్పెషల్ గిఫ్ట్‌ను అందించింది. ఆఫ్రిది ఫోన్ ఉన్న బాక్స్‌ను ఓపెన్ చేయగానే పక్కనే ఉన్న ఇంగ్లాండ్ ఆటగాడు సామ్ బిల్లింగ్స్ షాకయ్యాడు. 'అమ్మో.. ఇంత ఖరీదైన గిఫ్టా' అనినోరెళ్లబెట్టాడు. ఊహించని గిఫ్ట్‌తో అవాక్కైన ఆఫ్రిది.. తన స్పెషల్ గిఫ్ట్‌ను అభిమానులకు చూపిస్తూ మురిసిపోయాడు. అయితే.. తమ అందరినీ వదిలేసి కెప్టెన్‌కు మాత్రమే గిఫ్ట్ ఇవ్వడం సమంజసం కాదని పేసర్ హ్యారిస్ రవుఫ్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. లాహోర్ క్యాలండర్స్ తమ ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసిన ఈ వీడియో నెట్టింట వైరలవుతోంది.



# లీల

## నటన నా రక్తంలోనే ఉంది

– రంభ



సీనియర్ హీరోయిన్ రంభ 1990ల్లో స్టార్ హీరోల సరసన నటించి మెప్పించింది. అయితే, రంభ సినిమాలకు దూరమై 15 ఏళ్లు అయిపోయాయి. ప్రస్తుతం ఓ టీవీ రియాలిటీ షోకు న్యాయనిర్ణేతగా వ్యవహరిస్తోంది. కాగా తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో రంభ మాట్లాడుతూ.. పలు ఆసక్తికర విషయాలు పంచుకుంది. వివాహం అనంతరం కెనడాలో స్థిరపడినట్లు ఆమె చెప్పుకొచ్చింది. రంభ ఇంకా మాట్లాడుతూ.. 'నా పిల్లలకు ఒక వయసు వచ్చేవరకూ తల్లిగా పూర్తి బాధ్యత తీసుకున్నాను. వారిని దగ్గరుండి చూసుకున్నాను. ఇప్పుడు మా బాబుకు 6 ఏళ్లు. కుమార్తెలకు 14, 10 ఏళ్లు వచ్చాయి. వాళ్ల కోసమే నేను ఇన్నేళ్లు సినిమాలకు దూరమయ్యాను' అని రంభ చెప్పింది. రంభ ఇంకా మాట్లాడుతూ.. 'నాకు సినిమాలపై ఉన్న ఆసక్తి నా భర్తకు తెలుసు. ఆయన ప్రోత్సాహంతోనే ఈ షోకు న్యాయనిర్ణేతగా వ్యవహరించేందుకు అంగీకరించాను. ఈ షో కోసం నన్ను సంప్రదించినప్పుడు ఇందులో భాగం కావాలా, వద్దా అని ఆలోచించాను. నా కుటుంబం నన్ను పోత్సహించింది. నాకు సినిమాలపై మరోసారి ఆసక్తి కలిగింది. 15 ఏళ్లు దూరమైనప్పటికీ నటన నా రక్తంలోనే ఉంది. నాతో పాటు ఇండస్ట్రీకి వచ్చిన ఎంతోమంది నేటికీ నటిస్తూనే ఉన్నారు. అందుకే నేను కూడా మరోసారి వెండితెరపై కనిపించాలని నిర్ణయించుకున్నాను' అంటూ రంభ తెలిపింది.



## ఉజ్జయినీ మహాకాళేశ్వర్ సేవలో యష్

కన్నడ స్టార్ హీరో యష్ ప్రధాన పాత్రలో 'రామాయణ' మూవీని తెరకెక్కించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రెండు పార్ట్‌లుగా రామాయణ చిత్రం తెరకెక్కనుండగా, ఈ మూవీకి నితేశ్ తివారీ దర్శకత్వం వహిస్తున్నారు. బాలీవుడ్ స్టార్ రణబీర్ కపూర్ రాముడిగా.. సాయిపల్లవి సీతమ్మగా నటిస్తున్నారు. ఇందులో రావణుని పాత్రలో యశ్ కనిపించనున్నారు. అయతే సోమవారం ఉదయం ఉజ్జయినీ మహాకాళేశ్వర్‌ను దర్శించుకున్నారు కన్నడ స్టార్ హీరో యష్. స్వామి వారి సేవలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయన త్వరలోనే ఆయన 'రామాయణ పార్ట్ 1 మూవీ సెట్‌లో అడుగుపెట్టబోతున్నట్టు తెలుస్తుంది.

## మరో రికార్డు నెలకొల్పిన అజిత్




ప్రముఖ నటుడు అజిత్ ప్రొఫెషనల్ రేసర్ అనే సంగతి తెలిసిందే. సినిమా షూటింగ్స్ లేకపోతే రేసింగ్ బైక్స్, కార్లతోనే కాలక్షేపం చేస్తుంటారాయన. తన టీమ్‌తో కలిసి అజిత్ తాజాగా మరో ఘనత సాధించారు. బెల్జియంలో నిర్వహించిన స్పాఫ్రాన్‌కోర్‌ఛాంప్స్ సర్క్యూట్‌లో ఆయన టీమ్ ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా పంచుకుంటూ టీమ్ ఆనందం వ్యక్తం చేసింది. సినిమా అయినా, స్పోర్ట్స్ అయినా అజిత్ ఉన్న చోట పాజిటివ్ ఎనర్జీ ఉంటుందని కొనియాడింది. టాలీవుడ్‌కు చెందిన సినీ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ అజిత్‌కు శుభాకాంక్షలు తెలిపింది. ఇదొక అద్భుతమైన విజయమని, అజిత్ గర్వపడేలా చేశారని పేర్కొంది. పలువురు సినీ ప్రముఖులు, నెటిజన్లు అజిత్‌కు విషెస్ తెలియజేస్తున్నారు. ఈ ఏడాది జనవరిలో జరిగిన 24హెచ్ దుబాయ్ కారు రేసింగ్‌లో అజిత్ పాల్గొన్న సంగతి తెలిసిందే. ఆ పోటీల్లో అజిత్ టీమ్ మూడో స్థానాన్ని కైవసం చేసుకుంది. ఇటలీలో ఇటీవల జరిగిన 12హెచ్ రేస్‌లోనూ మూడో స్థానం దక్కించుకుంది.

## డేటింగ్‌లో వారిద్దరూ?



తన అందం, అభినయంతో తొలి సినిమాతోనే అందరికీ అభిమాన నటిగా మారారు భాగ్యశ్రీ బోర్సే. ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. కొన్ని రోజుల నుంచి సోషల్ మీడియాలో ఆమె పేరు ట్రెండింగ్ అవుతోంది. దీనికి కారణం యంగ్ హీరో రామ్ పోతినేనితో ఆమె డేటింగ్‌లో ఉన్నట్లు వార్తలు ప్రచారం కావడమే. వీరిద్దరూ కలిసి ఓ సినిమాలో నటిస్తోన్న విషయం తెలిసిందే. ఈ ప్రాజెక్ట్ పట్టాలెక్కినప్పటి నుంచి వీరిద్దరిపై రూమర్స్ ప్రారంభమయ్యాయి. తాజాగా వీరిద్దరూ షేర్ చేసిన ఫొటోల్లో బ్యాక్‌గ్రౌండ్ ఒకేలా ఉండడంతో ఈ ప్రచారం జోరందుకుంది. ఆ ఫొటోలు చూసిన నెటిజన్‌లు 'ఒకే గదిలో ఫొటో దిగారా' అంటూ కామెంట్స్ పెడుతున్నారు. మరొక నెటిజన్ ఇంకాస్త వివరంగా 'మీ చేతికి ఉంగరం ఉంది. అది ఎవరు తొడిగారు?' అని అడిగారు. దీనికి భాగ్యశ్రీ స్పందిస్తూ.. 'అది నేనే కొనుక్కున్నాను' అని రిప్లై పెట్టారు. ప్రస్తుతం వారి ఫొటోలతో పాటు ఆమె రిప్లై కూడా ఆసక్తిగా మారింది.














## రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి



ప్రజాపక్షం/కౌడిపల్లి : రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో ముగ్గురు మృతి చెంది ఆరుగురికి తీవ్ర గాయాలైన సంఘటన మెదక్ జిల్లా కౌడిపల్లి మండల పరిధిలోని వెంకట్రావు పేట గేటు సమీపాన మెదక్ నర్సాపూర్ ప్రధాన రహదారి రోడ్డుపై ఆదివారం అర్ధరాత్రి తర్వాత చోటుచేసుకుంది వివరాల్లోకెళ్తే హైదరాబాద్ రంగారెడ్డి జిల్లా కుబ్దుల్లాపూర్ మండలం సూరారం వాస్తవ్యులు పిల్లలతో సహా తొమ్మిది మంది కారులో ప్రయాణిస్తూ మెదక్ వైపు వెళ్తుండగా రైలాపూర్ గ్రామానికి చెందిన హరీష్ రెడ్డి రైలాపూర్ నుండి నర్సాపూర్ వైపు వెళుతుండగా వెంకట్రావు పేట గేటు సమీపన అతివేగంతో రెండు కార్లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో సూరారం కు చెందిన మహమ్మద్ అలీ 45, అజీమా బేగం 40, మహమ్మద్ గౌస్ తో పాటు మనుమడు ఏడాది బిడ్డ కూడా మృతి చెందారు. మిగిలిన ఆరుగురు సహనా బేగం, ఇరాన్ షాహిష్, హలీమా, మహమ్మద్, చిన్నారులు నీలాఫర్ (ఆరు నెలలు) జూనెర (నాలుగు నెలలు) తీవ్ర గాయాలు కాగా హైదరాబాద్ ఆస్పత్రికి తరలించారు. షిఫ్ట్ డిజైర్ కార్ లో ఉన్న హరీష్ రెడ్డికి తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి, డిఎస్‌పి వెంకట్ రెడ్డి, సిఐ జాన్ రెడ్డి, ఎస్సై రంజిత్ రెడ్డి సందర్శించారు. ప్రమాద విషయమై ఆరా తీశారు ఈ సందర్భంగా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, అతివేగమే ఈ ప్రమాదానికి కారణమైందని చెప్పారు నేషనల్ హైవే 765d డివైడర్ లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని దాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రత్యేకంగా ఎనిమిది లక్షల రూపాయలతో సేఫ్టీ హోల్డర్లు మూలమలుపుల వద్ద ఏర్పాటు చేశామన్నారు కానీ ప్రమాదం జరిగిన చోటు నేరుగా ఉండటంతో అతివేగంతో అజాగ్రత్తతోనే ప్రమాదం చోటు చేసుకుందన్నారు.

ప్రయాణికులు ముఖ్యంగా వేగాన్ని నియంత్రించుకొని గమ్యాలను చేరుకోవాలన్నారు. దర్యాప్తు చేసి ప్రమాదానికి కారణమైన వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు. మృతుడి తమ్ముడు మహమ్మద్ అబ్బాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రంజిత్ రెడ్డి తెలిపారు.






## బిజెపి మత విద్వేషాలను రెచ్చగొడుతోంది: బల్మూరి

ప్రజాపక్షం/హైదరాబాద్ : బిజెపి నాయకులు తమ రాజకీయ లబ్దికోసం ఎమ్మెల్సీ ఎన్నికల పేరుతో ప్రశాంతమైన హైదరాబాద్ నగరంలో రెచ్చగొట్టే వ్యాఖ్యలతో మత విద్వేషాలు పెంచేందుకు కుట్ర పన్నుతున్నారని కాంగ్రెస్ ఎంఎల్‌సి బల్మూరి వెంకట్ ఆరోపించారు. గాంధీభవన్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కేంద్ర మంత్రులుగా కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఎంపిగా ఈటెల రాజేందర్ హైదరాబాద్ అభివృద్ధికి కనీసం ఏమి చేయకపోగా, ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక సాధారణ ఓటర్ల కాదని, వాళ్లంతా పార్టీ గుర్తుపై గెలిచిన ప్రజాప్రతినిధులు, ఎక్స్ అఫిషియో ఓటర్లు మాత్రమే ఓటు వేస్తారు అలాంటి అప్పుడు ప్రజల మధ్య మత విద్వేషాలను రెచ్చకొట్టడం దుర్మార్గమన్నారు. 2016లో 4మంది వున్న కార్పొరేటర్లను 2020లో ప్రజలు 48మంది కార్పొరేటర్లను గెలిపించారు.రెండు సార్లు కేంద్ర మంత్రిగా వున్నా కిషన్ రెడ్డి హైదరాబాద్ అభివృద్ధికి ఏం చేశారో చెప్పాలని, నగర అభివృద్ధిపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చర్చకు రావాలని సవాల్ విసిరారు.బలం లేక పోవడంతోనే కాంగ్రెస్ ఎన్నికలో పోటీ చేయడం లేదని ఆయన స్పష్టం చేశారు.






Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM - 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com